

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 7-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 332 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.2:54 తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్త రా.2:28 తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.9:05-10:49, దుర్ముహూర్తం: ఉ.6:49-8:19, అమృతఘడియలు: రా.7:30-9:15, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:49, సూర్యాస్తమయం:6:09 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
II స్పోర్ట్స్
గుంటూరు ● శనివారం 7 ఫిబ్రవరి 2026

వరల్డ్‌కప్ పూర్తి షెడ్యూలు, ఇతర విశేషాలు రేపటి ఆదివారం అనుబంధంలో..



వైభవంగా కప్పు కొట్టారు

యువ భారత్ 'సిక్సర్'



80 బంతుల్లో 175 రన్స్‌తో చెలరేగిన వైభవ్



ఫైనల్లో ఇంగ్లండ్ చిత్తు
అండర్-19 వన్డే ప్రపంచకప్

వామ్మో వైభవ్.. వయస్సు 14 ఏళ్లే అయినా అతడి బ్యాట్ సాగించిన వీరంగానికి ఇంగ్లండ్ బౌలర్లది దిక్కుతోచని పరిస్థితి. 15 ఫోర్లు, 15 సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు రాబట్టిన సూర్యవంశీ బాదుడుకు రికార్డులు బద్దలయ్యాయి. అటు 412 పరుగుల భారీ ఛేదనను ఇంగ్లండ్ దీటుగానే ఆరంభించింది. కానీ భారత బౌలర్లు వికెట్ల వేట ఆపలేదు. దీంతో రికార్డు స్థాయిలో ఆరోసారి అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్ వశమైంది. 2022లోనూ భారత జట్టు ఇంగ్లండ్‌ను ఓడించే కప్పు కైవసం చేసుకుంది.

హరారే: అండర్-19 వన్డే వరల్డ్ కప్‌ను భారత కుర్రాళ్లు అజేయంగా ముగించారు. శుక్రవారం ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో ఆయుష్ మాత్రే సేన 100 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ ఖాతాలో ఇది ఆరో టైటిల్ కావడం విశేషం. గతంలో 2000, 2008, 2012, 2018, 2022లలో కప్ చాంపియన్‌గా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సర్లతో 175) తుఫాన్ ఇన్నింగ్స్ 50 ఓవర్లలో 411/9 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53), అభిగ్యాన్ (40), కనిష్క్ (37 నాటౌట్), వేదాంత్ (32), విహాన్ (30) సహకరించారు. మింటోకు మూడు.. గ్రీన్, మోర్గాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. వేగంగా ఆడే క్రమంలో జట్టు వికెట్లను కోల్పోవడం దెబ్బతీసింది. అయితే మిడిలార్డర్ బ్యాటర్ ఫాల్కనర్ (67 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 115) వీరోచిత సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓపెనర్ డాకిన్స్ (66), మయేస్ (45), థామస్ రూ (31) ఫర్వాలేదనిపించారు. అంబరీష్‌కు మూడు.. కనిష్క్, దీపేశ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా వైభవ్ నిలిచారు.

వీరవిహారం: మొదటి 25 ఓవర్లలోనే భారత్ స్కోరు 250/2.. కానీ ఆ తర్వాత 25 ఓవర్లలో 161/7 మాత్రమే. ఓపెనర్ వైభవ్ సునామీ ఇన్నింగ్స్ ఎలా సాగిందో ఈ స్కోరు కార్డు చూస్తేనే అర్థమవుతుంది. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడినా.. అతడు క్రీజులో ఉన్నంతవరకు హరారే స్టేడియం భారీ షాట్లతో దద్దరిల్లింది. మరో ఓపెనర్ ఆరోన్ (9) త్వరగానే అవుటైనా కెప్టెన్ ఆయుష్ జత కలవడంతో ఇంగ్లండ్ బౌలర్లు బేలగా మారారు. వీరు రెండో వికెట్‌కు 90 బంతుల్లోనే 142 పరుగులు జత చేసి ప్రత్యర్థి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశారు. 32 బంతుల్లో ఫిఫ్టీ, 55 బంతుల్లో సెంచరీ బాదిన వైభవ్ ఆ తర్వాత మరింతగా చెలరేగాడు. 22వ ఓవర్‌లో 4,6,6,4,4తో 27 రన్స్ సాధించాడు. ఈ దూకుడుకు సెంచరీ తర్వాత మరో 16 బంతుల్లోనే 150కి చేరాడు. తద్వారా అండర్-19లో ఫాస్టెస్ట్ (71 బంతులు) 150 సాధించిన బ్యాటర్ అయ్యాడు. 25వ ఓవర్‌లోనూ 4,6,6,4తో చెలరేగగా స్కోరు 250/2కి చేరింది. ఈ దశలో వైభవ్ డబుల్ సెంచరీతో పాటు భారత్‌కు 500 రన్స్ కూడా సాధ్యమే అనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే పేసర్ లమ్స్డెన్..వైభవ్ వికెట్ తీయడంతో మూడో వికెట్‌కు వేదాంత్‌తో 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక ఆ తర్వాత జట్టు ఆటతీరు నెమ్మదించింది. చివర్లో కనిష్క్, అభిగ్యాన్, విహాన్ మోస్తరుగా ఆడడంతో స్కోరు 400 దాటింది.

- అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యధిక స్కోరు (175) చేసిన బ్యాటర్‌గా వైభవ్. అలాగే ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (15) సంధించడమే కాకుండా మొత్తంగానూ 30 సిక్సర్లతో టాప్‌లో ఉన్నాడు. అలాగే యూత్ వన్డేల్లో బౌండరీలతోనే 150 రన్స్ సాధించిన ఏకైక ఆటగాడు. ఈ టోర్నీ చరిత్రలోనే సెంచరీ చేసిన అతిపిన్న వయస్కుడి (14 ఏళ్లు)గానూ నిలిచాడు.
- అండర్-19 వరల్డ్‌కప్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక స్కోరు (411/9) సాధించిన జట్టుగా భారత్.
- ఈ టోర్నీ చరిత్రలో ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డులందుకున్న ఏకైక బ్యాటర్‌గా వైభవ్.
- యూత్ వన్డే మ్యాచ్‌లో ఎక్కువ పరుగులు (722), ఎక్కువ సిక్సర్లు (31) నమోదు కావడం ఇదే తొలిసారి.

2 అండర్-19 వరల్డ్‌కప్‌లో రెండో వేగవంతమైన సెంచరీ (55 బంతుల్లో) సాధించిన వైభవ్. తాజా టోర్నీలో విల్ (ఆసీస్, 51 బంతుల్లో) ఫాస్టెస్ట్ శతకం బాదాడు. మొత్తంగా ఫైనల్లో సెంచరీ చేసిన మూడో భారత బ్యాటర్. ఉన్ముక్త్, మన్‌జోత్ గతంలో సాధించారు.

స్కోరుబోర్డు

భారత్: ఆరోన్ (సి) మయేస్ (బి) గ్రీన్ 9, వైభవ్ (సి) రూ (బి) లమ్స్డెన్ 175, ఆయుష్ (సి) మయేస్ (బి) గ్రీన్ 53, వేదాంత్ (సి) మయేస్ (బి) మింటో 32, విహాన్ (సి) డాకిన్స్ (బి) మింటో 30, అభిగ్యాన్ (సి) ఆల్బర్ట్ (బి) మోర్గాన్ 40, అంబరీష్ (బి) మింటో 18, కనిష్క్ (నాటౌట్) 37, ఖిలన్ (సి) మూర్స్ (బి) మోర్గాన్ 3, హెనిల్ (రనౌట్) 5, దీపేష్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9, మొత్తం: 50 ఓవర్లలో 411/9. వికెట్ల పతనం:** 1-20, 2-162, 3-251, 4-302, 5-308, 6-359, 7-367, 8-375, 9-393. బౌలింగ్: మోర్గాన్ 9-0-74-2, గ్రీన్ 5-0-49-2, లమ్స్డెన్ 8-0-81-1, మింటో 8-0-63-3, ఫర్హాన్ 10-0-77-0, ఆల్బర్ట్ 10-0-66-0.

ఇంగ్లండ్: డాకిన్స్ (సి) ఖిలన్ (బి) మాత్రే 66, మూర్స్ (బి) అంబరీష్ 17, మయేస్ (సి) హెనిల్ (బి) ఖిలన్ 45, థామస్ (సి) మాత్రే (బి) కనిష్క్ 31, ఫాల్కనర్ (సి) ఖిలన్ (బి) కనిష్క్ 115, ఆల్బర్ట్ (రనౌట్) 0, ఫర్హాన్ (సి) అభిగ్యాన్ (బి) దీపేష్ 1, మోర్గాన్ (సి అండ్ బి) దీపేష్ 0, మింటో (సి సబ్) ఎనాన్ (బి) అంబరీష్ 28, లమ్స్డెన్ (సి) వేదాంత్ (బి) అంబరీష్ 3, గ్రీన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5, మొత్తం: 40.2 ఓవర్లలో 311 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-19, 2-93, 3-142, 4-174, 5-174, 6-177, 7-177, 8-269, 9-281, 10-311. **బౌలింగ్:** అంబరీష్ 9-1-56-3, హెనిల్ 4-2-28-0, దీపేష్ 6-0-64-2, ఖిలన్ 8-0-66-1, కనిష్క్ 8.2-0-63-2, మాత్రే 5-0-31-1.



ధనాధన్ క్రికెట్‌లో అత్యున్నత పోరు నేటి నుంచే.. ఈసారి ఐపీఎల్‌కన్నా ముందుగానే క్రికెట్ ప్రేమికులను టీ20 వరల్డ్‌కప్ అలరించబోతోంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో సూర్యకుమార్ సేన డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఇక ఉత్కంఠ రేపే పోరాటాలు.. తుఫాన్ ఇన్నింగ్స్‌లతో బ్యాటర్ల విన్యాసాలు.. వణికించే బంతులతో వికెట్ల వేటలో బౌలర్లు.. రెప్పపాటులో పట్టిన క్యాచ్‌లతో బ్యాటర్లకు షాక్ ఇచ్చే సూపర్ ఫీల్డర్లు.. ఇలా దాదాపు నెల రోజుల పాటు అందరికీ వినోదాన్ని పంచేందుకు విశ్వకప్ సిద్ధంగా ఉంది.

పరుగుల పండుగ

నేటి నుంచి టీ20 వరల్డ్‌కప్

బరిలో 20 జట్లు	మూడో టైటిల్ కోసం టీమిండియా	ఆరంభ పోరులో అమెరికాతో ఢీ	రాత్రి 7 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ప్రపంచకప్ కెప్టెన్లు



నేటి మ్యాచ్‌లు		
	పాకిస్థాన్ X నెదర్లాండ్స్ (ఉ.11 గం.)	భారత్ X అమెరికా (రాత్రి 7 గం.నుంచి)
	వెస్టిండీస్ X స్కాట్లాండ్ (మ.3 గం.)	

ముంబై: టోర్నీ ఆరంభానికి ముందే వివాదాలతో నలుగుతున్న టీ20 వరల్డ్‌కప్‌నకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి మార్చి 8 వరకు టోర్నమెంట్ జరుగనుంది. 20 జట్లు పోటీపడుతున్న వేళ మొత్తంగా 55 మ్యాచ్‌లతో కొత్త చాంపియన్ ఎవరో తేలనుంది. అలాగే ఆరంభ రోజైన శనివారం నుంచి గ్రూప్ దశలో ప్రతిరోజు మూడు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఫిబ్రవరి 21 నుంచి సూపర్ 8 నిర్వహిస్తారు. ఇక ఆతిథ్య భారత్ వరుసగా రెండో టైటిల్ కోసం అమెరికాతో తమ ప్రస్థానాన్ని ఆరంభించబోతోంది. ఈ మ్యాచ్‌కు స్థానిక వాంఖడే మైదానం వేదిక కానుంది. అయితే దీనికంటే ముందుగా ఉదయం 11 గంటలకు పాకిస్థాన్-నెదర్లాండ్స్ కొలంబోలో, మధ్యాహ్నం 3 గంటలకు కోల్‌కతాలో వెస్టిండీస్-స్కాట్లాండ్ మ్యాచ్‌లు జరుగుతాయి.



ఇదీ చరిత్ర..

టెస్టులు, వన్డేలతో కాస్త స్తబ్ధుగా మారిన క్రికెట్‌కు మరింత ఊపు తెచ్చేందుకు పొట్టి ఫార్మాట్‌ను రంగంలోకి తెచ్చారు. అలాగే దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఆరంభమైన టీ20 వరల్డ్‌కప్‌తో ఈ ఆట దశ తిరిగింది. 2007 టోర్నీ ఆరంభ మ్యాచ్ మొదటి బంతినే సిక్సర్‌గా మలిచిన వెస్టిండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ ఏకంగా శతకంతోనూ అందరి దృష్టిని మరల్చాడు. అంతేకాదు యువరాజ్ సింగ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లతో అబ్బురపరిచిన విన్యాసం కూడా అదే టోర్నీలో ఆవిష్కృతమైంది. ఇక దాయాది పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌ను ఎవరు మర్చిపోగలరు? పాక్‌పై భారత్ సాధించిన ఈ అపూర్వ విజయం ఆధునిక క్రికెట్‌కు సరికొత్త దిశను నిర్దేశించింది. రాబోయే టీ20 వరల్డ్‌కప్‌ల్లో జరుగబోయే నాటకీయ పరిణామాలకు కూడా నాంది పలికినట్టయింది. కానీ పాక్ జట్టు 2009లో టైటిల్ సాధించి తమ కలను నెరవేర్చుకోగలిగింది. 2010లో కెవిన్ పీటర్సన్ సూపర్ బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ తొలిసారి విజేతగా నిలిచింది. 2012లో విండీస్, 2014లో శ్రీలంక తమ కప్ ముచ్చట తీర్చుకున్నాయి. అలాగే భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చిన 2016 టోర్నీ ఫైనల్ నభూతో అన్నట్టుగా సాగింది. అనంతరం ఐదేళ్ల విరామం తర్వాత 2021లో జరిగిన టోర్నీని ఆసీస్ తొలిసారి గెల్చుకుంది. ఏడాది తర్వాత ఇంగ్లండ్ రెండోసారి టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. మరోవైపు 2024లో యూఎస్, కరీబియన్ దీవుల్లో జరిగిన మెగా టోర్నీ 20 జట్లతో సాగగా, దక్షిణాఫ్రికాతో ఫైనల్లో టీమిండియా గెలిచింది.

భారత మ్యాచ్‌ల షెడ్యూల్

7న	అమెరికాతో	ముంబై
12న	నమీబియాతో	ఢిల్లీ
15న	పాకిస్థాన్‌తో	కొలంబో
18న	నెదర్లాండ్స్‌తో	అహ్మదాబాద్

నాలుగు గ్రూప్‌లుగా

క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే ప్రణాళికతో క్రితం సారి నుంచి జట్ల సంఖ్యను 20కి పెంచారు. ర్యాంకింగ్, ఆతిథ్య జట్ల హోదాలో 8 జట్లు ముందుగా అర్హత సాధించగా.. మిగతా టీమ్స్ క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా బెర్త్ దక్కించుకున్నాయి. ఇక బంగ్లాదేశ్‌పై వేటు వేసిన ఐసీసీ ఆ స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకుంది. మొత్తంగా 20 జట్లను ఐదేసి చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఆయా జట్లు తమ గ్రూప్‌లోని మిగతా నాలుగింటితో తలపడతాయి. ఇందులో టాప్-2గా నిలిచిన ఎనిమిది టీమ్స్‌ను మరో రెండు గ్రూప్‌లుగా విడదీసి సూపర్-8ను నిర్వహిస్తారు. ఇందులో మూడేసి మ్యాచ్‌లు జరిగాక, ఆపై సెమీస్, ఫైనల్ ఉంటాయి.

సంప్రదాయ, పాశ్చాత్య కలయికతో ఆరంభ వేడుకలు

టీ20 వరల్డ్‌కప్ ప్రారంభ వేడుకలు ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరుగనున్నాయి. భారత్-యూఎస్ఏ మ్యాచ్‌కు ముందు జరిగే ఈ కార్యక్రమం శాస్త్రీయ సంగీతంతో పాటు పాప్ గీతాలపనతో మురిపించనుంది. ప్రఖ్యాత డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సితారిస్ట్ రిషభ్ రిఖిరామ్ శర్మ సందడి చేయనున్నారు. అనంతరం ర్యాపర్, సింగర్ బాద్షా, బాలీవుడ్ నటి నోరా ఫతే తమ ఆటపాటలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

ఆరంభం అదరాలని!



ముంబై: డిఫెండింగ్ చాంప్ భారత్.. టీ20 వరల్డ్‌కప్‌ను అదిరే విజయంతో ఆరంభించాలనుకొంటోంది. గ్రూప్-ఎలో శనివారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో మరో భారత జట్టుగా కనిపిస్తున్న అమెరికాతో టీమిండియా తలపడనుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సమయంలో ఫామ్ అందిపుచ్చుకోగా.. జట్టులోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చిన వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ అదరగొడుతున్నాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మతో కలసి ఇషాన్ ఓపెనింగ్‌కు దిగుతాడని సూర్యకుమార్ తెలిపాడు. అంటే సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు.



సిరాజ్

ముగ్గురు ముంబై ఆటగాళ్లే..

మరోవైపు భారత సంతతితో కూడిన అమెరికా టీమ్ గట్టిపోటీ ఇవ్వాలనుకొంటోంది. ఒకప్పుడు సూర్యతో కలసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకొన్న శుభం రంజానే, హర్మీత్ సింగ్‌తోపాటు పేసర్ సౌరభ్ నేత్రావల్కర్ ముంబై ప్లేయర్లే కావడంతో వాంఖడే పిచ్‌పై వారికి మంచి అవగాహన ఉండడం అమెరికాకు కలసి వచ్చేదే. కర్నూలుకు చెందిన సాయితేజ ముక్కామల, కెప్టెన్ మొనాంక్ పటేల్ ప్రధాన బ్యాటర్లు.

గాయంతో హర్షిత్ అవుట్..: మెగా టోర్నీ ఆరంభానికి ముందే భారత్‌కు గట్టిదెబ్బ తగిలింది. మోకాలి గాయంతో పేసర్ హర్షిత్ రాణా వరల్డ్‌కప్ మొత్తానికి అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. అతడి స్థానాన్ని సిరాజ్‌తో భర్తీ చేయనున్నారు.

జట్లు (అంచనా):

భారత్: అభిషేక్, ఇషాన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

అమెరికా: సాయితేజ ముక్కామల, ఆండ్రెస్ (వికెట్ కీపర్), షయన్ జహంగీర్, మొనాంక్ పటేల్ (కెప్టెన్), మిలింద్ కుమార్, హర్మీత్ సింగ్, శుభం రంజానె, మొహ్సిన్, షాడే వాన్, సౌరభ్, అలీ ఖాన్.

హాజెల్‌వుడ్ అవుట్

ఆస్ట్రేలియా ప్రధాన పేసర్ జోష్ హాజెల్‌వుడ్ కూడా గాయంతో పొట్టికప్‌నకు దూరమయ్యాడు. తొడ కండర గాయం నుంచి కోలుకొంటున్న హాజెల్‌వుడ్.. టోర్నీ మధ్యలో జట్టులో చేరే అవకాశం ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తొలుత ప్రకటించింది. అయితే, ఆ అవకాశాలు లేకపోవడంతో హాజెల్‌వుడ్ టోర్నీ మొత్తానికే దూరమైనట్టు ప్రకటించింది. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారనేది తెలియరాలేదు.

ముఖేష్ జోడీకి స్వర్ణం

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముఖేష్-వంశికా ద్వయం పసిడి పతకం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన జూనియర్ మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో ముఖేష్ (290 పాయింట్లు)- ఉత్తరప్రదేశ్ షూటర్ వంశికా (289 పాయింట్లు) జోడీ 579 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, స్వర్ణం కైవసం చేసుకుంది. రుద్రాంక్ష్ పాటిల్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం, అర్జున్ రజతం సాధించారు. 10 మీ., ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్, అర్జున్ విశాల్ త్రయం స్వర్ణం కొల్లగొట్టింది.

ఆంధ్ర 264/6

బెంగాల్‌తో రంజీ క్వార్టర్‌ఫైనల్

కళ్యాణి (పశ్చిమ బెంగాల్) : కెప్టెన్ రికీ భుయ్ (83) అర్ధ శతకంతో ఆదుకోవడంతో బెంగాల్‌తో శుక్రవారం ప్రారంభమైన రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ తొలిరోజును ఆంధ్ర గౌరవప్రదంగా ముగించింది. భుయ్‌తోపాటు ఓపెనర్ శ్రీకర్ భరత్ (47), షేక్ రషీద్ (46) రాణించడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 264 పరుగులు చేసింది.

ఓడెన్‌తో నగాల్ ఢీ

నెదర్లాండ్స్‌తో నేటినుంచి డేవిస్ కప్

బెంగళూరు: డేవిస్ కప్ క్వాలిఫయర్-1లో భాగంగా శనివారంనుంచి ఇక్కడ జరిగే పోరులో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. తొలిరోజు నిర్వహించే సింగిల్స్‌లో గయ్ డెన్ ఓడెన్‌ను సుమిత్ నగాల్ ఢీకొంటాడు. రెండో సింగిల్స్‌లో జెస్పెర్ జోంగ్‌తో దక్షిణేశ్వర్ తలపడతాడు. ఆదివారంనాడు..యుకీ/శ్రీరామ్ ద్వయం సండ్రే అరెండ్స్/డేవిడ్ పాల్ జోడీతో ఆడుతుంది. రివర్స్ సింగిల్స్‌లో జెస్పెర్‌తో సుమిత్, గయ్ డెన్‌తో దక్షిణేశ్వర్ అమీతుమీ తేల్చుకుంటారు.

కసితీరా ఆడారు



నెలన్నర కిందట జరిగిన ఆసియా కప్ అండర్-19 వన్డే టోర్నీ ఫైనల్లో యువ భారత్ ఘోర పరాజయం చవిచూసింది. టోర్నమెంట్ ఆసాంతం అదరగొట్టిన మనోళ్లు తీరా అసలు పోరులో నిరాశ పరిచారు. పైగా..ఫైనల్ ప్రత్యర్థి పాకిస్థాన్. ఆఖర్లో భారత బౌలర్లు విజృంభించి వికెట్లు తీసే సరికి జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. ప్రత్యర్థి టాపార్డర్ బ్యాటర్లు సత్తా చాటడంతో పాకిస్థాన్ దాదాపు 350 రన్స్ వరకూ వచ్చింది. కానీ టోర్నమెంట్‌లో అప్పటిదాకా భారత బ్యాటర్లు రాణించిన తీరు చూస్తే 348 పరుగులు పెద్ద లక్ష్యం కాబోదు. కానీ చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ సహ ప్రధాన బ్యాటర్లంతా విఫలం కావడంతో మనోళ్లకు ఓటమి తప్పలేదు. సీన్ కట్‌చేస్తే ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక అండర్-19 వరల్డ్ కప్. ఈ మెగా టోర్నమెంట్‌లో భారత్‌కు ఎన్నో మధురమైన స్మృతులున్నాయి. మహ్మద్ కైఫ్, యువరాజ్ సింగ్, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, ఉన్ముక్త్ చంద్, హనుమ విహారి, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, యశ్‌ధుల్ వంటివారు స్టార్లు వెలుగులోకి వచ్చింది ఈ ప్రపంచ కప్‌నుంచే. గతంలో భారత్ ఐదుసార్లు విశ్వవిజేతగా నిలిచిందంటే టోర్నీలో మనముద్ర ఎలాంటిదో తెలుస్తుంది. ఆ స్ఫూర్తిగా ఈసారి వరల్డ్ కప్ బరిలో దిగిన యువ భారత్ అంచనాలకు మించి చెలరేగింది. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో ఫైనల్లో మనోళ్ల ఆటతీరును వేనోళ్లా పొగడాల్సిందే. ఆసియా కప్ తుదిపోరు చేదు అనుభవాన్ని గుర్తు చేసుకొంటూ కసితీరా ఆడారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌ను వర్ణించేందుకు మాటలు సరిపోవు. ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడేసుకున్నాడు. ఎడాపెడా షాట్లతో ప్రత్యర్థి జట్టు గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. వైభవ్ భారీ సెంచరీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుత అర్ధ శతకంతోపాటు, కీపర్ అభిగ్యాన్ కుందు, ఆల్‌రౌండర్ కనిష్క్ చౌహాన్, వేదాంత్ త్రివేది, విహాన్ మల్హోత్రా కూడా బ్యాట్లు ఝుళిపించడంతో ఇంగ్లండ్ ఎదుట అత్యంత భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. బ్యాటర్లు తమ కర్తవ్యాన్ని దిగ్విజయంగా నిర్వర్తించగా ఆపై బౌలర్లూ తమ పాత్రను సమర్థంగా పోషించడంతో భారత్ ఆరోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సెమీస్‌లో హుస్సాముద్దీన్

లా న్యూసియా (స్పెయిన్): బాక్సాం ఎలీట్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీల్లో తెలుగు బాక్సర్ హుస్సాముద్దీన్ సెమీస్‌కు చేరాడు. 60 కిలోల క్వార్టర్స్‌లో హుస్సాం 5-0తో దగ్గీ అలీ (ఉక్రెయిన్)ను చిత్తుగా ఓడించి, పతకం ఖాయం చేసుకున్నాడు. హుస్సాంతో పాటు మొత్తం 19 మంది భారత బాక్సర్లు ఈ పోటీల్లో పతకాలు ఖాయం చేసుకున్నారు.

భారత్ నిష్క్రమణ
ఆసియా బ్యాడ్మింటన్

కింగ్‌డావో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లు నిరాశపర్చాయి. శుక్రవారం మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 0-3తో చైనా చేతిలో, పురుషుల జట్టు 1-3తో కొరియా చేతిలో పరాజయం పాలై, నిష్క్రమించాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 7-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ



హమ్మయ్య... పెద్దపులి చిక్కింది

గన్ ద్వారా మత్తు ఇంజెక్షన్ ఇచ్చి బంధించిన అధికారులు

విశాఖపట్నంలోని జూకు తరలింపు

12



వైభవ్ సూర్యవంశీ(175)

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు..!

అండర్-19 విజేత భారత్

ఆరోసారి టైటిల్ కైవసం

విశ్వ వేదికపై ధనాధన్

నేటి నుంచే టీ20 వరల్డ్‌కప్

-స్పోర్ట్స్‌లో



ఎక్కడ ఏ పొరపాట్లూ లేకుండా భూరికార్డులు తయారు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ప్రతి ఒక్కరికీ పాస్‌పుస్తకం జారీ చేసి భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. - సీఎం చంద్రబాబు

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు అనగాని, నిమ్మల, భరత్

ట్యాంపర్ చేస్తే జైలుకే

మీ భూమిపై ఎవరి కన్నూ పడకుండా రక్షిస్తా.. రైతులకు సీఎం భరోసా

- వైసీపీ హయాంలో అన్నదాతల భూములనూ 22ఏలో పెట్టి కాజేసే కుట్రలు
- భూ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ప్రతి నెలా 9న మీ ముందుకొస్తా
- ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకాలు 2027 డిసెంబరు నాటికి అందరికీ ఇస్తాం
- క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే భూమి వివరాలు చూసుకోవచ్చు
- సీమ లిఫ్టుపై వైసీపీ అధినేత డ్రామాలు
- ఐదేళ్లు రసాయనాలతో లడ్డూ కల్తీ చేశారు
- అయినా సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చిందంటున్నారు
- ఆయన బాబాయే కల్తీ జరిగిందని చెప్పారు
- కర్నూలు జిల్లా కలుగొట్ల సభలో సీఎం వెల్లడి

కర్నూలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'భూమి అంటే మనకు నమ్మకం. విశ్వాసం.. అమ్మతో సమానం. భూమితో మనకున్న అనుబంధాన్ని ఎవరూ చెరపలేరు. భూమి మీ ఆస్తి.. మీ భవిష్యత్. దానిపై ఇతరులు కన్నేయకుండా సర్వహక్కులు కల్పించాం. డిజిటల్ పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తున్నాం. మీ రికార్డులు ఎవరూ ట్యాంపర్ చేయలేరు.. చేస్తే జైలుకు వెళ్లడం తథ్యం..' అని సీఎం చంద్రబాబు రైతులకు భరోసా ఇచ్చారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి

మిగతా 10వ పేజీలో...

కల్తీ నెయ్యిపై టీం-11 కెప్టెన్ దుష్ప్రచారం

- తిరుమల లడ్డూతో పాటు కల్తీలన్నిటికీ వారే బ్రాండ్ అంబాసిడర్లు: లోకేశ్
- దేవుడిని అడ్డుపెట్టుకుని 250 కోట్లు స్వాహా
- బాబాయిని చంపి గుండెపోటన్నారు
- అవినాశ్ దోషి అని జగన్‌కు తెలుసు
- అయినా ఆ నెపాన్ని చంద్రబాబుపై వేశారు
- సరిగా తిప్పికొట్టలేక నాడు నష్టపోయాం
- బూత్ స్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యం.. వర్క్‌షాపులో లోకేశ్ స్పష్టీకరణ

10

యువత భవితకు పునాది..!

క్వాంటమ్ వ్యాలీ భవనాలకు నేడే శంకుస్థాపన

సీఎం చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో చరిత్రాత్మక ఘట్టానికి రంగం సిద్ధమైంది. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు పడనుంది. దేశ సాంకేతిక రంగాన్ని మలుపుతిప్పే క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ భవనాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేయనున్నారు. అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో జరిగే భూమి పూజ కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు చేశారు. క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ కోసం రూ.9,000 కోట్లతో 80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేక ఆకృతిలో ఐకానిక్ భవనాలు నిర్మించాలని రాష్ట్ర ఐటీ శాఖ నిర్ణయించింది. ఇప్పటికే ఆమోదం పొందిన

మిగతా 10వ పేజీలో...





జగన్ కాన్వాయ్‌లో చిక్కుకున్న అంబులెన్స్

జగన్ 'బల ప్రదర్శన'కు మరో ఇద్దరు బలి!

- గుండెపోటుతో ఒకరు.. ప్రమాదానికి గురై మరొకరు మృతి
- సాగదీత యాత్రలతో పోతున్న ప్రాణాలు
- తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నానికి గంట
- కానీ 7 గంటలు సాగిన జగన్ పర్యటన
- 'గుంటూరు' ఎత్తుగడే మళ్లీ అమలు
- దారి క్లియర్‌గా ఉన్నప్పటికీ 5 కి.మీ. స్పీడ్
- స్టంట్లు చేస్తున్న యువకులను ఆపని జగన్ అండ్ కో.. పైగా రెచ్చగొట్టేలా తీరు
- గతంలో పల్నాడు పర్యటనలో జగన్ కారు కింద పడి నలిగిన వైసీపీ దళిత కార్యకర్త
- ఆ తర్వాతా మారని 'పరామర్శల' తీరు

11

'కల్తీ' మాటలు ఎవరివి జగన్?

- చంద్రబాబు, 'ఆంధ్రజ్యోతి'లదే పాపమంటూ ఇబ్రహీంపట్నంలో జగన్ దుష్ప్రచారం
- ఏ నివేదికా 'కొవ్వు'ను నిర్ధారించలేదట!
- పందికొవ్వుపై 'ఎన్‌డీడీబీ' స్పష్టీకరణ
- ఆ నివేదికే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది
- వాస్తవాలకు జగన్ మార్క్ మసి

మా హయాంలో గొప్పగా లడ్డూ!

- భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారు
- ప్రసాదం ప్రతిష్ఠను బాబే దిగజార్చారు: జగన్





'కల్తీ' కంపెనీల 'కంత్రీ' కుట్ర

నెయ్యి వైష్ణవి, మాల్ గంగా నుంచి.. శాంపిల్స్ హెరిటేజ్, సంగం నుంచి

- రిపోర్టు కోసం వీటిని ఎన్ఏబీఎల్ ల్యాబ్‌కు.. ఈ 'నాణ్యమైన' నివేదికలు చూపి టీటీడీకి 'కల్తీ' నెయ్యి ట్యాంకర్ల సరఫరా..ఇలా 250 కోట్ల విలువైన 60 లక్షల కిలోలు పంపిణీ
- భోలే బాబా డెయిరీలో తయారీ.. సిట్ దర్యాప్తులో వెలుగులోకి
- వైష్ణవి డెయిరీలో హెరిటేజ్, హాట్సన్, సంగం, దొడ్ల నుంచి 'శాంపిల్స్' రశీదులు లభ్యం

11

చెడు పదార్థాలు కలిపి స్వామికి తినిపించారు



- అసలు తప్పే జరగలేదని బొంకడం శోచనీయం
- తప్పు చేసిన వారిలో చిత్తశుద్ధి కనిపించలేదు
- డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే చేశారు
- కల్తీ నెయ్యిపై టీటీడీ మాజీ ఈవో ఎల్వీ

10

సోషల్ మీడియాకు వయో పరిమితి?

- చిన్నపిల్లలను దూరంగా ఉంచేందుకు.. త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం
- కేంద్ర ఐటీ కార్యదర్శి వెల్లడి

9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పరుగుల పండుగ

పిడుగుల్లాంటి సిక్సర్లు, ఫోర్లు.. బుల్లెట్లలా దూసుకొచ్చే బంతులు.. మెరుపుల్లాంటి క్యాచ్‌లతో హోరెత్తిపోయే టీ20 పండగ వచ్చేసింది. భారత్, శ్రీలంక ఆతిథ్యంలో నేటినుంచి వచ్చేనెల ఎనిమిది వరకు జరిగే విశ్వక్రీడా సంరంభానికి రంగం సిద్ధమైంది.

20 జట్లు, 55 మ్యాచ్‌లతో ఈసారి జరగబోతున్నది పదో ప్రపంచ కప్. గత టోర్నీ విజేత భారత్ మరోసారి టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది. దాయాది జట్లు భారత్, పాకిస్థాన్‌తో పాటు అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా గ్రూప్–ఎ నుంచి పోటీలో ఉన్నాయి. మరో ఆతిథ్య జట్టు శ్రీలంక, పటిష్ఠ ఆస్ట్రేలియా గ్రూప్–బి నుంచి, మాజీ విజేతలు ఇంగ్లండ్, వెస్టిండీస్ గ్రూప్–సి తరఫున అమీతుమీకి సిద్ధమయ్యాయి. తొలి కప్పు కోసం ఎన్నాళ్లుగానో నిరీక్షిస్తున్న న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా గ్రూప్–డిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఇదే గ్రూప్ నుంచి సంచలనం సృష్టించేందుకు అఫ్ఘానిస్థాన్ సిద్ధంగా ఉంది. ప్రారంభ టీ20 ప్రపంచకప్ జరిగిన 2007లో చాంపియన్‌గా నిలిచిన టీమిండియా, తర్వాతి కాలంలో ఆ స్థాయి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. 2014 ఫైనల్లో పరాజయం పాలైంది. 2022లో సెమీఫైనల్ దశలోనే నిష్క్రమించింది. తదనంతరం అద్భుతంగా పుంజుకొన్న భారత జట్టు రెండేళ్ల క్రితం రోహిత్ శర్మ సారథ్యంలో విశ్వవిజేతగా నిలిచి రెండోసారి కప్‌ను ఖాతాలో వేసుకుంది. గత టోర్నీలో జట్టును విశ్వవిజేతగా నిలబెట్టిన రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో ఈమారు సూర్యకుమార్ నేతృత్వంలో భారత జట్టు కప్ వేటను ఆరంభించనుంది.

ఈ దఫా పోటీల ఆరంభానికి ముందే పలు వివాదాలు చుట్టుముట్టాయి. ఇందులో అత్యంత చర్చనీయాంశమైన అంశం బంగ్లాదేశ్ జట్టు బహిష్కరణ. టోర్నీ ముందస్తు షెడ్యూలు ప్రకారం గ్రూప్–ఎలో ఉన్న బంగ్లాదేశ్ జట్టు.. తన గ్రూప్ దశ మ్యాచ్‌లను భారత్‌లో ఆడాలి. కానీ, భద్రతా కారణాల సాకు చూపుతూ ఆ జట్టు భారత్‌లో ఆడేందుకు నిరాకరించింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)ని కోరింది. అందుకు ఐసీసీ తిరస్కరించడంతో, భారత్‌కు వచ్చేదే లేదంటూ మొండిపట్టు పట్టింది. దీంతో బంగ్లాను టోర్నీ నుంచి తప్పించిన ఐసీసీ.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. బంగ్లా ఇంతలా మంకు పట్టడానికి కారణం.. ఆ దేశ క్రికెటర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ నుంచి తప్పించడం. కొన్నాళ్లుగా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో.. బంగ్లా ఆటగాడిని ఐపీఎల్‌కు ఎంపిక చేయడంపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీసీసీఐ ఆదేశాల మేరకు నైట్‌రైడర్స్ యాజమాన్యం ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి విడుదలచేసి బంగ్లాకు పంపించింది. ప్రతిగా తమ జట్టును టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపేది లేదని బంగ్లాదేశ్ హూంకరించడంతో ఆ దేశ జట్టు మెగా టోర్నీలో చోటు కోల్పోక తప్పలేదు. టోర్నీ నుంచి బంగ్లా వైదొలగడంతో పాకిస్థాన్ కూడా భారత్‌పై తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది. బంగ్లాదేశ్‌పై వేటుకు నిరసనగా తాము భారత జట్టుతో ఆడబోమని టోర్నీ ఆరంభానికి ముందు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే తదుపరి కఠిన చర్యలకు సిద్ధంగా ఉండాలంటూ పాక్ క్రికెట్ బోర్డును ఐసీసీ ఇప్పటికే హెచ్చరించింది. అయినా ఆ జట్టు వైఖరిలో ఎలాంటి మార్పు కానరావడం లేదు. ఈ దశలో షెడ్యూల్ ప్రకారం ఈనెల 15న కొలంబో వేదికగా భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందా లేదా అన్న సందిగ్ధత క్రికెట్ వర్గాల్లో నెలకొంది. తామైతే యథావిధిగా ఆ రోజు మ్యాచ్ కోసం కొలంబోకు టిక్కెట్లు కూడా బుక్ చేసుకున్నామని టీమిండియా సారథి సూర్య కుమార్ ప్రకటించాడు. మరి.. ఆ మ్యాచ్‌కు పాకిస్థాన్ హాజరుకాకపోతే నిబంధనల ప్రకారం గెలుపు పాయింట్లను భారత్‌కు కేటాయిస్తారు. ఒకవేళ సెమీఫైనల్.. లేదంటే ఫైనల్లో ప్రత్యర్థిగా భారత్ ఎదురైతే అప్పుడు కూడా మ్యాచ్‌ను బహిష్కరిస్తారా అంటూ మీడియా అడిగిన ప్రశ్నకు పాక్ జట్టు నుంచి సమాధానం లేదు. పాక్ జట్టు తమ నిర్ణయానికే కట్టుబడి ఉంటే, బంగ్లా జట్టు తరహాలో కోలుకోలేని నష్టాన్ని చవిచూడక తప్పదు. ఇక, సీనియర్ల వరల్డ్‌కప్‌కు అంతా సిద్ధమైన ఈ తరుణంలో భారత అండర్–19 కుర్రాళ్లు అదరగొట్టే విజయంతో ట్రోఫీని కైవసం చేసుకున్నారు. మన కుర్రాళ్లు ప్రపంచ కప్‌ను గెలవడం ఇది ఏకంగా ఆరోసారి. ఈ విజయం స్ఫూర్తితో సీనియర్లు కూడా వరల్డ్‌కప్‌ను గెల్చుకొస్తారని ఆశిద్దాం.

నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు

ఈ నెల 1న లోక్‌సభలో 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 'జాగరూకత' అనే పదాన్ని, 'ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు' (డోంట్ రాక్ ది బోట్) అనే పద బంధాన్ని ఉపయోగించారు.

భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 2025–26 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ 'తగ్గింపు'నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా 'స్థూల స్థిర మూలధన సంచయం' భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 2023–24, 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 2025–26లో 4.4 శాతం నుంచి 2026–27లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము.



ప్రభుత్వ ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు!

ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ఆర్థిక సర్వే మొదటి అధ్యాయంలోనే 'జాగ్రత్తగా ఉండాలి. అయితే నిరాశావాదం అవసరం లేదు' అని సూచించారు. ఈ ఆశావహ దృక్పథమే ఆ నివేదిక అంతటా కనిపించింది. మరో అధ్యాయంలో ప్రభుత్వం విశ్వసనీయమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవాలని, జీడీపీ–రుణాల నిష్పత్తిని కూడా బాగా తగ్గించుకోవాలని సూచించారు. పట్టణీకరణ విషయంలో మెట్రోపాలిటన్ పాలనా వ్యవస్థలను పటిష్ఠపరచాలని, సమృద్ధిగా నిధుల కేటాయింపులతో నగరాలకు ఆర్థిక సాధికారత కల్పించాలని పేర్కొన్నారు. పట్టణీకరణ విషయంలో ఆయన దృక్పథం సాహసోపేతంగా ఉందని చెప్పవచ్చు. 2025–26 ఆర్థిక సంవత్సరపు పన్నుల జూదం విఫలమయింది. గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో ఉదారంగా అందిన దాదాపు రూ.3,04,000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అంకెలు ఘనంగా కనిపించేందుకు దోహదం చేశాయి. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌గా వరుసగా రూ.2,10,874 కోట్లు, రూ.2,68,590 కోట్లు సమకూరాయి. యూపీఏ ప్రభుత్వాల హయాం (2004–14)లో రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో సమకూరిన గరిష్ఠ మొత్తం (2013–14లో) రూ.52,679 కోట్లు.

తన ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు! అంతకంతకూ మహా శక్తిమంతమవుతోన్న చైనా ఆర్థిక వ్యవస్థ గురించిగానీ, ఆర్థిక వ్యవహారాలపై మెరుగైన అవగాహన ఉన్నవారు బడ్జెట్ నుంచి ఆశిస్తున్న విషయాలపైగానీ ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆర్థిక మంత్రిగానీ, ప్రభుత్వంగానీ ఆర్థిక సర్వేను లెక్కలోకే తీసుకోలేదు– ఇది నేను ఉదారంగా చేస్తున్న విమర్శ. 'మనం సౌర వ్యవస్థలోని ఒక గ్రహవాసులమని ప్రస్తుత పాలకులు భావించడం లేదు' అనేది నేను నిర్దయగా చేసే విమర్శ. మందగించిన వృద్ధిరేటు, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, సంక్షేమంపై నిర్లక్ష్యం, రూపాయి విలువ తగ్గుదల మౌలిక సదుపాయాలు, అత్యవసర సేవల విషయంలో గిరాకీ, సరఫరాల మధ్య అంతరాలతో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు ఏమిటో ఆర్థికమంత్రి తన ప్రసంగంలో వెల్లడించకపోవడం నన్ను నిర్భాంతపరిచింది.

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్– ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చొరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు. నా లెక్కలో అవి కనీసం 24గా ఉన్నాయి. ఆమె ప్రకటించిన ఈ పథకాలు, కార్యక్రమాలు మొదలైన వాటిలో వేటికీ నిధులు కేటాయించకపోవడం దేశ ప్రజల దృష్టికి తప్పక వస్తుంది సుమా! ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మేధా సోమరితనంతో చేసిన ఒక విన్యాసమే ఆమె సమర్పించిన 9వ కేంద్ర బడ్జెట్.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మత జాతీయవాదం భారత్‌కు మేలు చేసేనా?

'పాకిస్థాన్ తన ముస్లిమేతర పౌరులను ఎంతగా దురవస్థలకు గురి చేసినా మనం మన మైనారిటీ మతస్థులపట్ల నాగరిక రీతిలో వ్యవహరించాలి. మన అల్పసంఖ్యాక వర్గాలకు పూర్తి భద్రత కల్పించి, ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి'– 1947 అక్టోబర్ 15న ముఖ్య మంత్రులకు రాసిన లేఖలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉద్ఘాటించిన మాటలవి. లౌకికవాదం, మైనారిటీలకు సమానహక్కుల విషయంలో నెహ్రూ నిబద్ధతకు కాంగ్రెస్ పార్టీలోనే సంపూర్ణ ఆమోదం లేదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోనూ, ఆ తరువాత తన జీవిత పర్యంతం కాంగ్రెస్‌లోనూ, విశాల భారతీయ సమాజంలోనూ మితవాద హిందూ శక్తుల ప్రభావాన్ని సమర్థంగా ప్రతిఘటించేందుకు ప్రధాని నెహ్రూ నిరంతరం కృషి చేశారు. ఆయన మరణానంతర దశాబ్దాలలో మాత్రమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్, ఈ పార్టీ ప్రస్తుత అవతారమైన భారతీయ జనతా పార్టీ తమ ప్రభావ ప్రాబల్యాలను పెంచుకున్నాయి. దేశ విభజన అనంతరం భారత్ లౌకికవాద రాజ్యాంగాన్ని రూపొందించుకుని బహుళత్వ, సమ్మిళిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా ఔదలదాల్చింది. దేశ పాలనా వ్యవహారాలు మత ప్రమేయం లేకుండా జరిగేందుకు తొలి ప్రధాని నెహ్రూ సుస్థిర పునాదులు వేశారు. అయితే మతాన్ని రాజ్య వ్యవహారాలతో మిళితం చేసిన మార్గాన్ని అనుసరించిన పాకిస్థాన్‌కు భారత్ ఇప్పుడు ఆ విషయంలో చేరువవుతోంది!



■ రామచంద్ర గుహ

ఈ మెజారిటీవాద ధోరణి ప్రస్తుత పాలకపక్షం వ్యవహారాలలో స్పష్టంగా కనిపిస్తోంది. గత మూడు సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన 800 మందికి పైగా ప్రజా ప్రతినిధులలో ముస్లిం మతస్థులు ఒక్కరూ లేరు!

> “జాతి అస్తిత్వానికి అధికసంఖ్యాకుల మతాన్ని కేంద్రంగా చేయడం; మతాచార్యుల అభిమతాలకు అనుగుణంగా చట్టాలు, విధానాల రూపకల్పన మహా ప్రమాదకరమైన ఫలితాలకు మాత్రమే దారితీస్తాయి. సున్నీ ముస్లింలు, షియా మహమ్మదీయులు, బౌద్ధ మతస్థులు అధికసంఖ్యాకులుగా ఉన్న దేశాలు ఆ దుష్ఫలితాలను చవి చూశాయి. హిందువులు కూడా అటువంటి మతజాతీయ బాటలో నడిస్తే వారికి ఈ నియమం నుంచి మినహాయింపు ఉండదు.**

నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకోవడంలో చాలావరకు సఫలమయింది. హిందూ ఓటర్ల మద్దతు ఆధారంగా తరచూ ఎన్నికలలో విజయాలు సాధిస్తోంది. హిందువులకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే రాజకీయాల అజెండా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పదే పదే అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తోడ్పడుతుండడంతో సంఘ్ పరివార్ భారతీయ సమాజంలో తన ప్రభావ ప్రాబల్యాలనూ ఇతోధికంగా పెంపొందించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయ ముస్లింలను (అప్పుడప్పుడూ భారతీయ క్రైస్తవులను కూడా) పలు విధాలా వేధింపులకు గురిచేస్తోంది. ఆ మైనారిటీ మతస్థుల పట్ల విద్వేషాన్ని ప్రోత్సహిస్తోంది.

ముస్లింలు ఒకప్పుడు కేంద్ర కేబినెట్‌లో ప్రధాన మంత్రిత్వశాఖలకు సారథ్యం వహించారు. దౌత్య శ్రేణులకు, గూఢచార వర్గాలకు నాయకత్వం వహించారు. భారత ప్రధాన న్యాయమూర్తులుగా దేశ న్యాయపాలనను నిర్దేశించారు. భారత వాయుసేనకు అధినేతలుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో అంటే 2014కు పూర్వం నరేంద్ర మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో రెండు నగరాలు పార్లమెంటులో తమ ప్రతినిధులుగా ముస్లింలను ఎన్నుకున్నాయి. మరి ఇప్పుడో? మన ప్రజా జీవితంలో ప్రముఖ స్థానాలలో ఉన్నవారిలో ఒక్క ముస్లిం కూడా లేరు. కాయకష్టంతో బతికే ముస్లింలను నిత్యం అనేక విధాలుగా అవమానిస్తున్నారు. ముస్లింల భారతీయ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని హింసాకాండకు పాల్పడుతున్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మూకదాడులు చేస్తున్నారు. న్యాయ విరుద్ధంగా ముస్లింల గృహాలను కూల్చివేస్తున్నారు.

లౌకికవాద, బహుళత్వ, సమ్మిళిత ప్రజాస్వామ్యమే భారత్ భావన హృదయం. అయితే పాకిస్థాన్‌కు పునాది అయిన మత జాతీయవాదం ప్రాతిపదికను ప్రాథమికంగా ప్రతిబింబించే ఆధిపత్యవాద రాజ్యంగా భారత్‌ను రూపొందించేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. జాతి జీవనంలోని వివిధ రంగాలలో ఇది ప్రతీకాత్మకంగానూ, ఆచరణాత్మకంగానూ కనిపిస్తోంది. పాలకపక్షం మాటలు, చేతలు ఆ లక్ష్య పరిపూర్తిని మరింత త్వరితం చేసేవిగా ఉన్నాయి.

హిందూ మెజారిటీవాదం మే 2014 నుంచే ప్రారంభం కాలేదు. దానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 19వ శతాబ్దిలో హిందూ మిషనరీ సొసైటీల కార్యకలాపాలు, 20వ శతాబ్దిలో హిందూ మహాసభ రాజకీయాలు, 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భావం ఆ చరిత్రలో భాగాలే. రాజ్య వ్యవహారాలలో మత ప్రమేయం లేకుండా ఉండేందుకు నెహ్రూ నిరంతరం అప్రమత్తంగా ఉండేవారు. అయితే ఆయన మనవడు రాజీవ్‌గాంధీ షా బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఉత్పన్నమైన సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో అనుసరించిన విధానాలు హిందూత్వ శక్తుల ప్రభావశీలత పెరుగుదలకు ఆలంబన అయ్యాయి. పాలనా వ్యవహారాలను మత ప్రాతిపదికన నడపడంతో ముస్లిం మత తీవ్రవాదుల కంటే హిందూ మత తీవ్రవాదులు ఎక్కువగా లబ్ధి పొందారు. రాజీవ్ ప్రభుత్వం అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరవడంతో ఆ మసీదును కూల్చివేసి దాని స్థానంలో రామాలయాన్ని నిర్మించేందుకు సంఘ్ పరివార్ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. 1984 సార్వత్రక ఎన్నికలలో కేవలం రెండే రెండు స్థానాలలో గెలిచిన బీజేపీ దశాబ్దంన్నర కాలంలో దేశంలో అగ్రగామి జాతీయ రాజకీయ పక్షంగా ఆవిర్భవించింది.



బీజేపీ ప్రథమ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి పాలనా శైలిలో మెజారిటీవాద ప్రేరణలు ఉండేవి కావు. ఆయన పార్టీ అనేక సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయవలసి ఉండడంతో ఆయన సంయమనంతో వ్యవహరించేవారు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు మంచి మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ రెండో ప్రధానమంత్రి, మూడోసారి సాధారణ మెజారిటీని సాధించుకోలేకపోయినప్పటికీ పాలనా వ్యవహారాలలో 'హిందువులకే ప్రథమ ప్రాధాన్యం అజెండా'ను అమలుపరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంలోని ప్రస్తుత తరం నాయకుల కంటే బీజేపీ అగ్రనాయక ద్వయం నరేంద్రమోదీ, అమిత్ షాలే మరింతగా సైద్ధాంతిక నిబద్ధులు. అంతేకాదు, అధికారాన్ని గెలుచుకోవడం పైన, గెలుచుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం పైన కాంగ్రెస్ నేతల కంటే వీరే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. మోదీ–షా ద్వయంతో పోలిస్తే రాజకీయాలలో రాహుల్, ప్రియాంకల ఆసక్తి, నిమగ్నత అస్థిరమైనది, అవ్యవస్థితమైనది. కాంగ్రెస్ కృశించి, క్షీణించిపోతుండగా, సంఘ్ పరివార్ ప్రభావ ప్రాబల్యాలు క్రమంగా పెరిగాయి, మరింతగా బలీయమవుతూ విస్తరిస్తున్నాయి. భారతదేశ నడుస్తున్న చరిత్రలో సువ్యక్తమవుతున్నది 'నాగరికతా పునరుజ్జీవనమే'నని హిందూ మితవాద సైద్ధాంతికులు తరచూ పెద్ద పెట్టున వాదిస్తున్నారు. ఈ వాదనలో ఇసుమంత సత్యం కూడా లేదు. భారతీయ కళలు, సంగీతం లేదా తాత్త్విక చింతనా ధోరణులు మహోన్నతమైనవి. వాటిని సమకాలీన ప్రపంచ సమస్యల పరిష్కారానికి వాటిని మరింత ఉపయుక్తంగా చేసే విషయంలో సంఘ్ పరివార్‌కు ఎటువంటి శ్రద్ధ లేదు. వారి శ్రద్ధాసక్తులు వేరే విషయాలలో ఉన్నాయి. హిందువులు కాని ఇతర భారతీయులు, ముఖ్యంగా ముస్లింల కంటే హిందువులే సమస్త జీవన రంగాలలోను అన్ని విధాల ఆధిక్యులు అన్న విషయాన్ని పదే పదే ప్రకటించడంపైన మాత్రమే శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి మనం ఇప్పుడు చూస్తున్నది నాగరికతా పునరుజ్జీవనం కాదు. హిందూత్వ అజెండా ప్రేరేపిత కార్యాచరణే.

నడుస్తున్న కాలంలో, మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ 2026లో భారత్ ఒక హిందూ పాకిస్థాన్‌గా ప్రభవించే సూచనలు సర్వత్రా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని నివారించడం సాధ్యమవుతుందా? లౌకిక, మతపరమైనది కాని రాజ్యవ్యవస్థ భవిష్యత్తులో భద్రంగా వర్ధిల్లుతుందా? సమాధానాలు చెప్పడం అసాధ్యమైన ప్రశ్నలివి. అయితే ఇతర దేశాల అనుభవాలను పరిశీలించినప్పుడు మత విశ్వాసాలను రాజ్య వ్యవహారాలతో మిళితం చేయడమనేది ఎక్కడా సత్ఫలితాలనివ్వలేదని స్పష్టమవుతుంది. పాకిస్థాన్ తన అస్తిత్వానికి ఇస్లాంను కేంద్రంగా చేసుకున్నది. ఇది ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య పాలనా పురోగతికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. లౌకికవాద ఆదర్శాలు పునాదిగా ప్రభవించిన బంగ్లాదేశ్ ఆ ఆదర్శాలను త్యజించింది. ఫలితంగా సంక్షోభంపాలై పలు విధాలా నష్టపోతోంది. ఒక అభివృద్ధి చెందిన దేశంగా వర్ధిల్లేందుకు ఆవశ్యకమైన ఆర్థిక, సాంస్కృతిక వనరులు ఇరాన్‌కు ఉన్నాయి. అయితే 1979లో మత ఛాందసవాద అయతొల్లాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు వమ్మయిపోయాయి.

మెజారిటీవాద పాలనతో నష్టపోయింది ఇస్లామిక్ దేశాలు మాత్రమే కాదు. 1970ల్లో శ్రీలంక వివిధ రంగాలలో భారత్ కంటే ముందంజలో ఉండేది. బౌద్ధ మతస్థులు అయిన సింహళ ప్రజల జాత్యహంకారం పెచ్చరిల్లి అంతర్యుద్ధానికి దారి తీయకుండా ఉన్నట్టయితే కొలంబో, క్యాండీ ఇప్పుడు బెంగళూరు, హైదరాబాద్ వలే అధునాతన ఐటీ విప్లవానికి కేంద్రాలుగా వర్ధిల్లుతుండేవి. హిందూత్వవాదులు అమితంగా అభిమానించే ఇజ్రాయెల్ తన యుద్ధ నేరాలతో ప్రపంచ వ్యవస్థలో ఒక అంటరాని దేశంగా అయిపోతోంది. ఆధునిక జుడాయిజంలోని ప్రగతి నిరోధక ధోరణుల వల్లే ఇజ్రాయెల్ పెడదోవ పట్టి ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తోంది. ఒక జాతి అస్తిత్వానికి అధికసంఖ్యాకుల మతాన్ని కేంద్రంగా చేయడం; ముల్లాలు, పూజారులు, సాధువులు, రబ్బీల అభిమతాలకు అనుగుణంగా చట్టాలు, విధానాల రూపకల్పన; రాజ్యాంగ వ్యవస్థల, సంస్థల నిర్మాణం మహా ప్రమాదకరమైన ఫలితాలకు మాత్రమే దారితీస్తాయి. సున్నీ ముస్లింలు, షియా మహమ్మదీయులు, బౌద్ధ మతస్థులు, చివరకు యూదు ధర్మ అనుయాయులు అధికసంఖ్యాకులుగా ఉన్న దేశాలు ఆ దుష్ఫలితాలను చవి చూశాయి. హిందువులు కూడా అటువంటి మతజాతీయ బాటలో నడిస్తే వారికి ఈ నియమం నుంచి మినహాయింపు ఉండదు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

హింస, క్రూరత్వం, కుట్రలు.. వైసీపీ అజెండా!

ప్రభుత్వాలు మారినప్పుడు కక్షసాధింపు చర్యలు సహజమని భావించే కాలంలో, చట్టాన్ని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లడాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారు. చట్టబద్ధమైన పాలన దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వ పాలననూ చేతగానితనం అనుకోవడం వైసీపీ అవివేకానికి తార్కాణం. గతంలో విపక్ష నేతలపై దాడులు జరిగినప్పుడు భావప్రకటన స్వేచ్ఛ అని సమర్థించుకున్నవారు, ఇప్పుడు అదే స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ హద్దులు దాటుతున్నారు.

చట్టమన్నా, న్యాయస్థానాలన్నా వైసీపీ నేతలకు గౌరవం ఎప్పుడూ లేదు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడితనానికి అలవాటుపడ్డారు. సాక్షాత్తూ చంద్రబాబుపై దాడి చేసి, డీజీపీతో భావవ్యక్తీకరణ అని చెప్పించారు. అంత ఘోరమైన పరిపాలన చేసి, దారుణంగా ఓడిపోయినా వారు ప్రశాంతంగా ఉన్నారు. తాము ఎన్నో చిత్రహింసలు పెట్టినా అధికార పార్టీ ఏమీ చేయడం లేదని అలుసుగా తీసుకుంటున్నారు. చట్టాన్ని అనుసరిస్తూ సాగుతున్న ప్రభుత్వ తీరును చేతగానితనంగా తీసుకున్నారు. అడ్డగోలుగా తిట్లు ప్రారంభించారు. ఇలాంటి వారికి సరైన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది.



వైసీపీ 15 ఏళ్ల ప్రస్థానంలో... అయిదేళ్లు మాత్రమే ఆ పార్టీ అధికారంలో ఉంది. మిగిలిన కాలంలో ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారు. అయితే దానిపై వారు ఎంత మాత్రం ఆలోచన చేయడం లేదు. బూతు మాటలు, కవ్వింపు చర్యలతో వైసీపీ 2.0 కోసం కలలు కంటున్నారు జగన్మోహన్ రెడ్డి. తాను సుపరిపాలన అందించానని, తన హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లను రాజకీయ అవసరాలకు వాడుకుని రోడ్డున పడేసిన జగన్, ఇప్పుడు తన సొంత పార్టీ నేతలను కూడా అదే బాటలో నడిపిస్తున్నారు. బూతులు మాట్లాడితేనే పదవులు, గుర్తింపు దక్కుతాయనే భ్రమలో ఉన్న నేతలు... ఆ భాష వల్లే ప్రజల్లో చీదరింపునకు గురవుతున్నారు. వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి, పార్టీ కోసం తిట్లు తింటున్నా, కనీసం నైతిక మద్దతు ఇచ్చే నాథుడు లేకపోవడం వైసీపీ నేతల దుస్థితికి అద్దంపడుతోంది.

పల్నాడులో బోండా ఉమామహేశ్వరరావు కారుపై జరిగిన దాడి ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉంటుంది. అప్పట్లో ఇనుప రాడ్లతో దాడి చేశారు. దానిని ప్రోత్సహించింది అప్పటి వైసీపీ పాలకులు కాదా? అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై జోగి రమేశ్ దండయాత్ర చేశారు. కర్రలతో దాడికి దిగారు. అయినా అందులో తప్పేముంది అని ప్రశ్నించి జగన్ సమర్థించుకున్నారు. అనంతబాబు డోర్ డెలివరీ అరాచకాలు, గోరంట్ల మాధవ్ విశ్వరూపాలు వంటి వాటిని ఆస్వాదించిన జగన్, ఇప్పుడు అరవ శ్రీధర్ విషయంలో, విలువలు అంటూ ఉపన్యాసాలు చేస్తున్నారు. తాను చేస్తే నీతి.. ఎదుటివాడు చేస్తే బూతు అన్నట్టు హంగామా చేస్తున్నారు. నాడు చంద్రబాబు అరెస్టు సక్రమం అన్నారు. ఇప్పుడు మాత్రం అరెస్టులు అక్రమం అంటున్నారు. అయితే జనాలు అన్నీ గమనిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారు. రాజకీయ విమర్శలు సిద్ధాంత పరంగా ఉండాలి కానీ, వ్యక్తిగత దూషణలుగా మారకూడదు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వాడుతున్న భాష రాష్ట్ర రాజకీయ సంస్కృతిని దిగజారుస్తోంది. దీన్ని ఆదిలోనే అరికట్టకపోతే, భవిష్యత్ తరాలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. గతంలో డీజీపీ వంటి వారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకున్న తీరు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలిసిందే. ఇప్పుడు ఆ వ్యవస్థలను మళ్లీ గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోంది. చట్టం తన పని తాను చేయనివ్వడం అంటే అధికారులకు స్వేచ్ఛనివ్వడం. దీన్ని ప్రభుత్వం బలహీనతగా భావించడం వైసీపీ నేతల అవివేకం. ప్రజాస్వామ్యంలో ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది. అడ్డగోలుగా తిడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని ఉపేక్షించడం అంటే, పరోక్షంగా వారిని ప్రోత్సహించడమే అవుతుంది. ఇటువంటి వారిపై కఠినంగా వ్యవహరించాలి.



● వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖ మంత్రి

విప్లవ స్వాప్నికుడు.. రవూఫ్!

రాయలసీమ వెనుకబాటుతనం నుంచి విప్లవోద్యమ ఆచరణలోకి వచ్చాడు రవూఫ్. విప్లవకారుని జీవన విధానం ఏ రీతిలో ఉండాలో రవూఫ్ జీవనం ఒక నమూనా. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి చారు మజుందార్ రూపొందించిన విప్లవ పంథా వైపు ఆయన అడుగులు వేశాడు. తన రాజకీయ కార్యాచరణకు కుటుంబం అడ్డంకి అని నమ్మి, ఒంటరిగా జీవితాన్ని కొనసాగించాడు. చదివింది న్యాయవాద వృత్తి అయినా, ప్రజల మధ్య రాజకీయ కార్యకర్తగా పనిచేశాడు. ముస్లిం అస్తిత్వానికి దూరం జరిగాడు. మానవ సమాజంలో మనుషులందరూ కలిసి ఉండాలనే భావనను జీవితమంతా కొనసాగించాడు. విప్లవాన్ని చూసే దృష్టి కోణంలో అనేక అవగాహనలను, అభిప్రాయాలను గౌరవిస్తూనే... ఏకైక మార్గం నక్సల్బరీ పంథా అని నమ్మాడు.

భిన్న వర్గాల ప్రజలు నూతన భారతదేశ నిర్మాణం కోసం పనిచేయాలనే భావన రవూఫ్‌కు ఉండేది. ప్రజలే చరిత్ర నిర్మాతలనే మావో ఆలోచనను అన్వయించుకున్నాడు. భారతదేశంలో కోట్లాది రైతులు భూమి ఆధారంగా జీవిస్తున్నారు. రైతుల ఉన్నతే ఈ దేశ భవిష్యత్తు అని నమ్మాడు. అదే సమయంలో కార్మికవర్గ పోరాటాలను గమనిస్తూ, వాటిని తన రాజకీయ కార్యాచరణలో భాగం చేశాడు. తొంభై ఏళ్ల జీవితంలో అన్ని వర్గాల ప్రజలకు భరోసాగా నిలిచాడు. భారతదేశ పునర్నిర్మాణం అన్ని రంగాలలో జరగాలంటే నిజాయితీ, పోరాటరూపం ఉంటేనే సాధ్యపడుతుందని విశ్వసించాడు. పదమూడేళ్ల జైలు జీవితాన్ని రాజకీయ పాఠశాలగా మార్చుకున్నాడు. వివిధ ప్రాంతాల విప్లవకారులును జైల్లోనే కలుసుకున్నాడు. అది విప్లవ మార్గానికి బీజాలు వేసింది. భారత విప్లవోద్యమం ఆపరేషన్ కగార్ మధ్య తన మార్గాన్ని వెతుకుతోంది. అనేక మంది విప్లవకారులు అమరులయ్యారు. కొందరు లొంగిపోయారు, ఇంకొందరు విప్లవ ప్రతీఘాతక దారిని ఎంచుకున్నారు. రవూఫ్ జీవించి ఉంటే తన విప్లవ స్వప్నం పట్ల ఎలా ఆలోచన చేసి ఉండేవారో!

– అరసవిల్లి కృష్ణ (విరసం)

(ఫిబ్రవరి 9న అనంతపురంలో రవూఫ్ వర్ధంతి సభ)



- సందర్శకుల కోసం హెలిరైడ్, హార్స్ రైడింగ్
- ఆకట్టుకునేలా ఫ్లవర్, లేజర్ షోలకు ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదికలు
- హాజరు కానున్న అధికారులు, కేంద్ర రాష్ట్ర మంత్రులు

నేటి నుంచి కొండవీడు ఫెస్ట్

ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు

యడ్లపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన కొండలు.. చూపురులను కట్టిపడేసే పచ్చదనం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన కట్టడాలు.. విజ్ఞాన.. వినోదదాయకమైన సోయగాల మధ్య.. కొలువైన కొండవీడుకోట కొండవీడు ఫెస్ట్-2026కు సిద్ధమైంది. బౌద్ధులు తిరుగాడిన శాంతివనం, ఎందరో రాజులు, చక్రవర్తులు మోహించిన శత్రు దుర్భేధ్యమైన సామ్రాజ్యం సందర్శకుల మనసు పులకింపచేయడానికి వేదికగా మారింది. శని, ఆదివారాల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ఉత్సవాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వివిధ శాఖల అధికారులు రెండు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉత్సవాలకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. దీంతో ఎక్కడా ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా పర్యాటకులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. పర్యాటకులు ప్రత్యేక అనుభూతి పొందేలా కార్యక్రమాలకు అధికారులు రూపకల్పన చేశారు. వాహనాల పార్కింగ్, ఆర్టీసీ బస్సుల నిలుపు ప్రదేశాలు సిద్ధమయ్యాయి. కొండపైన, దిగువన సభావేదికలను సిద్ధం చేశారు. ఘాట్ మార్గం ప్రారంభంలో చెక్‌పోస్టు సమీపంలో హెలీరైడ్ కోసం హెలిప్యాడ్‌ను, హెలికాప్టర్‌ను సిద్ధం చేశారు. కొత్తపాలెం గ్రామంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఘాట్ రోడ్డుకు నేరుగా వెళ్లేందుకు చారిత్రక మట్టి కట్ట పక్కగా బైపాస్ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కొండవీడు నుంచి హౌస్ గణేష్ పాడు మీదగా ఫిరంగిపురం వరకు నిలిచిపోయిన రోడ్డును కూడా శరవేగంగా పూర్తి చేస్తున్నారు. కొండపైన గొలుసుకట్టు చెరువులకు వెళ్లే మార్గం పక్కగా శాండ్ ఆర్ట్, ఫ్లవర్‌షో గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇసుకతో ఏర్పాటు చేస్తున్న కొండవీడు ఉత్సవాల లోగో, బుద్ధుడు, అమరావతి స్తూపం ఆకృతులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీటికి పక్కనే వివిధ రకాల పుష్పాలతో ఫ్లవర్‌షోను రూపొందిస్తున్నారు. చిల్డ్రన్స్ పార్కు పక్కన డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఫుడ్ కోర్టు, వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ వంటకాలు అందు బాటులో ఉంచనున్నారు. రెండు రోజులపాటు (మిగతా 6వ పేజీలో)


హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కృతికా శుక్లా, జేసీ తదితరులు

పల్లెకు.. ఆపన్నహస్తం కావాలి



పంచాయతీల్లో పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 171.10 కోట్లు

- వసూలైంది రూ.54.66 కోట్లే..
- ఈ నెల 15 కల్లా నూరుశాతం సాధ్యమేనా?
- పాలకవర్గాలు సహకరిస్తేనే పురోగతి
- బ్లీచింగ్ చల్లించలేని దుస్థితిలో గ్రామాలు

పల్లెలు నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. ప్రగతి పనులు చేపట్టే పరిస్థితులు లేవు. ఆర్థిక సంఘం నిధులూ అంతంతమాత్రమే. చాలా పంచాయతీల్లో ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితి. ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో పంచాయతీలు చతికల పడుతున్నాయి. కొద్ది రోజుల్లోనే పాలక వర్గాల పదవీ కాలం కూడా ముగుస్తుంది. పన్నులు వసూలు లక్ష్యాలకు.. ఆచరణ సుదూరంగా ఉంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీల్లో ఇప్పటికి 31.94 శాతం మాత్రమే ఆస్తి, ఇతర పన్నులు వసూలయ్యాయి. ఈ నెల 15 కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని పంచాయతీలకు అధికారులు టార్గెట్‌లు ఇచ్చారు.

జిల్లాల వారీగా పన్ను వసూలు రూ కోట్లలో ఇలా..

జిల్లా	డిమాండ్	వసూలు	బకాయి
పల్నాడు	41.30	12.88	28.42
బాపట్ల	66.47	20.45	46.14
గుంటూరు	63.33	21.33	41.99

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

లక్ష్యం మేరకు పల్లెల్లో పన్ను వసూళ్ల పురోభివృద్ధి లేదు. మొత్తమ్మీద 14 పంచాయతీల్లో నూరు శాతం పన్ను వసూలు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ ప్రకటించింది. 36 పంచాయతీల్లో కనీసం 10 శాతం కూడా పన్ను వసూలు కాకపోవడం గమనార్హం.

పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కారం.. ప్రగతి పనులు చేపట్టేందుకు ఆస్తి పన్ను ప్రధాన ఆదాయం. యజమానులు ఆస్తి పన్ను చెల్లించకపోతుండ డంతో పంచాయతీలు (మిగతా 6వ పేజీలో)



క్వాంటం వ్యాలీకి.. నేడు భూమిపూజ

ఉద్దండ్రాయునిపాలెం సమీపంలో ఏర్పాట్లు ● హాజరుకానున్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని సిలికాన్‌వ్యాలీని తలపించేలా రాజధాని అమరావతిలో క్వాంటంవ్యాలీ ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ క్వాంటంవ్యాలీ ఏర్పాటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలో ఉద్దండ్రాయునిపాలెం సమీపంలో క్వాంటం వ్యాలీకి సీఎం చంద్రబాబు శనివారం భూమిపూజ చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 నిమిషాల మధ్య శంకుస్థాపన కార్యక్రమం జరగనున్నది. రాజధాని పరిధిలోని వీఐటీ, ఎస్ఆర్ఎం, అమృత విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 3000 వేల మందితో పాటు రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. వీవీఐపీలు, వీఐపీల భద్రతకు పటిష్ఠమైన ఏర్పాట్లు ఉండాలని ఏఎస్పీ రవికుమార్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

గ్లోబల్ క్వాంటం హబ్‌గా..

దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ అమరావతి కానున్నది. ప్రపంచంలోని టాప్- 5 గ్లోబల్ క్వాంటం హబ్‌లలో ఒకటిగా 'క్వాంటం వ్యాలీ- అమరావతి'ని తీర్చిదిద్దనున్నారు. రూ.100 కోట్లతో 90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకశైలిలో నిర్మించనున్నారు. 133 క్యూబిక్స్ సామర్థ్యంతో ఐబీఎం క్వాంటం సిస్టం-2ను ఇక్కడ ఇన్‌స్టాల్ చేయనున్నారు. దాంతోపాటు ప్రపంచంలోనే తొలి క్వాంటం బయో ఫౌండ్రీ, స్టార్టప్‌లకు ఓపెన్ క్యూచిప్ ఐఎన్ టెస్ట్ బెడ్, భారత దేశపు తొలి క్వాంటం రిఫరెన్స్ సౌకర్య కేంద్రం, అత్యాధునిక క్వాంటం సేఫ్ సొల్యూషన్స్ ప్రధాన కార్యాలయంతో పాటు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆల్గరిథమ్స్, పరిశోధన, డీప్‌టెక్ ఆవిష్కరణలకు అవసరమైన అన్ని వనరులు ఒకే వేదికపై ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ కేంద్రంతో చర్చలు జరిపి ఒప్పందాలను గతంలోనే కుదుర్చుకున్నారు. ఈ క్వాంటంవ్యాలీ ద్వారా 88 వేల మందికి అత్యున్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఊరూరా..ప్రభక్తులు

- కోటయ్య తిరునాళ్లకు 22 భారీ విద్యుత్ ప్రభలు
- పల్లెల్లో పోటాపోటీగా నిర్మాణం
- 1946 నుంచి కొండకు కావూరు ప్రభ
- ఆవిశాయంపాలెం ప్రభకు 69 ఏళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి పర్వదినం 15న అంగరంగ వైభవంగా తిరునాళ్ల జరుగనుంది. భారీ విద్యుత్ ప్రభలు కొలువుదీరనున్నాయి. ప్రభల పండగగా పేరొందిన తిరు నాళ్లలో.. చేదుకో కోటయ్యా... చేదుకోవయ్యా.. అని భక్తజన ఘోషతో కోటప్పకొండ ప్రతిధ్వనిస్తుంది. 22 భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. 90 నుంచి 100 అడుగుల ఎత్తులో వీటిని నిర్మిస్తున్నారు. కొండపై కొలువైన కోటయ్యస్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలని స్థల పురాణం చెబుతోంది. అందుకే కోటయ్య స్వామి తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రభల నిర్మాణాలు జరుగుతున్నాయి. భారీ విద్యుత్ ప్రభలతో పాటు సాధారణ ప్రభలను అధిక సంఖ్యలో భక్తులు నిర్మిస్తున్నారు.

80వ వసంతంలోకి కావూరు ప్రభ

చిలకలూరిపేట మండలం కావూరు ప్రభ 1946 నుంచి తిరునాళ్లల్లో కొలువుదీరుతోంది. ఈ ఏడాది ప్రభ నిర్మాణం 80వ వసంతంలోకి అడుగు పెట్టడం విశేషం. నాదెండ్ల మండలం అవిశాయపాలెం ప్రభ నిర్మాణం 69 వసంతాలను పూర్తి చేసుకుంటుంది. చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నంలో 6, గంగన్నపాలెంలో రెండు, బొప్పూడి గ్రామంలో రెండు భారీ విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, మద్దిరాల, కమ్మవారిపాలెం, నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్‌పాలెం (అవిశాయపాలెం), అప్పాపు రం, గణపవరం, నరసరావుపేట మండలం గురవాయపాలెం, కాకాని, ఉప్పలపాడు గ్రామాల్లో ఒక్కో ప్రభ నిర్మాణం జరుగుతోంది. నరసరావు పేట మునిసిపాల్టీ ప్రభను నిర్మిస్తోంది. ప్రభల వ్యయం రూ.కోట్లలో ఉంటుంది. సంస్కృతి, సంప్రదాయాలకు ఇవి అద్దం పడతాయి. ఊరంతా కలసి కట్టుగా ప్రభ పనుల్లో పాల్గొం టొంది. ఒక్కో ప్రభ ని ర్మాణవ్యయం రూ.30 లక్షల నుంచి రూ 40 లక్షల వరకు ఉంటుం దని నిర్వాహకులు చెబుతున్నారు. గతేడాది కంటే విద్యుత్ ప్రభల సంఖ్య ఈసారి పెర గనుంది.


గురవాయపాలెంలో 90 అడుగుల భారీ విద్యుత్ ప్రభ నిర్మాణం

పదిలో నూరు శాతం
ఉత్తీర్ణత సాధించాలి

వంద రోజుల ప్రణాళికపై సమీక్షలో కలెక్టర్ అన్సారియా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పది పరీక్షలకు వంద రోజుల ప్రణాళిక, తక్కువ పెర్ఫార్మెన్స్ విద్యార్థులను హాస్టళ్లలో ఉంచి వారికి ప్రత్యేక శిక్షణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, వసతిగృహాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో అధికారుల ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షలలో రైజింగ్ స్టార్స్ కేటగిరీలో వారిని షైనింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దాలన్నారు. తక్కువ సామర్థ్యంలో ఉన్న వారిని సబ్జెక్టుల వారీగా మార్కులు మెరుగుపర్చేలా ప్రధానో పాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు స్టడీ అవర్లు నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, డీఈవో సలీంబాషా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, సంక్షేమశాఖ అధికారులు మయూరి, మురళీధర్, జిల్లా పరీక్షల విభాగపు కార్యదర్శి తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, డీఈవో సలీం బాషా

నిత్యం ఆత్మవిమర్శే.. అసలైన విజయం

- చిత్ర దర్శకుడు ప్రదీప్ అద్వైతం
- ఉత్సాహంగా విజ్ఞాన్ మహోత్సవ్


6

మహిళలకు.. శుభవార్త

మహాశివరాత్రి స్పెషల్ సర్వీసుల్లోనూ స్త్రీ శక్తి


డీపీటీవో సాంబ్రాజ్యం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలకు రాకపోకలు సాగించే స్పెషల్ సర్వీసుల్లోనూ స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని జిల్లా ప్రజా రవాణాధికారి సాంబ్రాజ్యం తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో మహిళలు ఆర్టీసీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే రాబో యే మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా ప్రాం తాలకు ఏర్పాటు చేస్తున్న అదనపు బస్సుల్లోనూ మహిళలు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తున్నట్లు చెప్పారు. అమరావతి, గోవాడ, క్వారీతో పాటు కోటప్పకొండ, శ్రీశైలం వంటి క్షేత్రా లకు అదనపు సర్వీసుల ఏర్పాటుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ఈ ప్రత్యేక సర్వీసులకు స్త్రీ శక్తి పథకం అమల్లో ఉందా లేదా అనేది అధికారుల్లో సందిగ్ధత నెలకొన్నది. ఈ క్రమంలో మహాశివరాత్రి ప్రత్యేక సర్వీసుల్లోనూ స్త్రీశక్తి అమలుకు తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో కోటప్పకొండ ఎగువకు, దిగువకు రాకపోకలు సాగించే బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఉచిత ప్రయాణంతో రద్దీ పెరిగే అవకాశం ఉండే నేపథ్యంలో అందుకు అనుగుణంగా బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు నుంచి నరసరావుపేటకు గుంటూరు-1 డిపో నుంచి బస్సు లు ఏర్పాటు చేయనున్నారు. కోటప్పకొండ తిరునాళ్ల భక్తుల కోసం నరసరావుపేట, చిలక లూరిపేట డిపోల నుంచి బస్సులు సిద్ధం చేస్తున్నారు. కాగా మహాశివరాత్రి తిరునాళ్ల విధులకు జిల్లా ప్రజా రవాణాధికారి సాంబ్రాజ్యంను ప్రత్యేకంగా నియమించారు.

వ్యవసాయ వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

లాంఫాం(తాడికొండ)ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎంటీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరుధాన్యాలు - విలువ ఆధారిత ఉత్పత్తులు, వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, సేంద్రీయ సూత్రీకరణలపై రెండు నెలల పాటు ఆన్‌లైన్‌లో కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీ లోపు రూ.1,500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్ సైట్ లేదా 90632 19959, 94413 55595, 80960 85560 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

హలో..అనడమే పాపం
రూ.3.90 లక్షలు మాయం

ఈపూరు, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అపరిచిత ఫోన్ కాల్ తీయగానే నిమిషాల వ్యవధిలోనే లక్షల రూపాయలు మాయమైన ఘటన ఆంగలూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గణపర్తి ఉదయ భాస్కర్ శుక్రవారం రైస్ మిల్లు వద్ద ఉండగా.. తన మొబైలకు అపరిచిత ఫోన్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్.. హలో ఎవరు.. అంటుండగానే భాస్కర్ ఖాతా నుంచి రూ.49 వేలు విత్ డ్రా చేసినట్లు మెస్సేజ్ వచ్చింది. వెంటనే భాస్కర్ బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తుండగా రెండు నిమిషాల వ్యవధిలో రూ.3.90 లక్షలు మాయమయ్యాయి. తను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడినట్లు గ్రహించిన బాధితుడు ఈపూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగదు బదిలీ అయిన ఖాతాను పరిశీలించగా ఉత్తరప్రదేశ్‌లోని వ్యక్తికి చెందినదిగా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వేణుగోపాల్ తెలిపారు.

విద్యార్థుల సహనానికి పరీక్ష

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగం మిడ్ పరీక్షల నిర్వహణలో.. శుక్రవారం విద్యార్థుల సహనానికి పరీక్ష పెట్టారు. పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు గది తలుపు తాళాలు తీయడం ఆలస్యం కావడంతో.. అసహనానికి గురయ్యారు. ఈ నెల 5 నుంచి ఎల్ఎల్‌బీ రెండు, మూడో మిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష సమయం 9.30 గంటలకు తాళాలు తీయలేదు. ఈ విభాగంలో తాళాలు ఉంచడానికి అటెండర్లు ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరు సమయాన్ని కేటాయించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో పరీక్ష కొంత ఆలసమైంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 540.70 అడుగులు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 540.70 అడుగులు ఉంది. ఇది 189.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7828, ఎడమ కాలువ ద్వారా 7436, మొత్తం ఔట్‌ఫ్లో 21706 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 21706 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

5500 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి : నడికుడి యార్డుకు శుక్రవారం 5,900 మిర్చి టిక్కీలు రాగా.. 5,500 టిక్కీల అమ్మకాలు జరిగాయి. 334 రకం రూ.10వేలు నుంచి రూ.22,500, తేజా రూ.9వేలు నుంచి రూ 19500, మిర్చి తాలు కాయలు రూ.3వేలు నుంచి రూ.9వేలకు అమ్మకం జరిగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

త్రీడీ కాంక్రీటు ప్రింటింగ్ టెక్నాలజీతో గృహ నిర్మాణం

● స్థలం కోసం బుర్రిపాలెంలో బృందం పర్యటన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పేదల గృహాల నిర్మాణంలో త్రీడీ కాంక్రీటు ప్రింటింగ్ టెక్నాలజీ అమలు చేసేందుకు అధికారుల బృందం శుక్రవారం బుర్రిపాలెం గ్రామంలో పర్యటించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు ఆశీష్ కపూర్, అజయ్ చౌరాశ్య అవసరమైన స్థలాన్ని సేకరించే నిమిత్తం గ్రామస్తులతో చర్చించారు. నేల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి అమలు చేసేందుకు చర్చించారు. కాస్టింగ్, ప్రింటింగ్, యార్డు, శిక్షణ, స్టోరేజీ ఏరియా, మౌలిక వసతుల ఏర్పాటుకు స్థలం అవసరమని వారు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్, విశ్రాంత ఎస్ఈ జయరామాచారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భాస్కరరావు, ఎంపీడీవో దీప్తి, హౌసింగ్ ఏఈ గౌసిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బుర్రిపాలెంలో అధికారుల బృందం

షూటింగ్‌లో ముఖేష్, వంశికా ద్వయానికి స్వర్ణం

గుంటూరు(క్రీడలు) ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో శుక్రవారం జరిగిన పది మీటర్ల ఎయిర్ పిస్టల్ పది మీటర్ల మిక్స్‌డ్ జూనియర్ విభాగంలో నేలవల్లి ముఖేష్, వంశికాచౌదరితో కూడిన భారత్ బీ ద్వయం స్వర్ణ పతకం సాధించింది. ఢిల్లీలోని డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో ఈ నెల 2 నుంచి పోటీలు జరుగుతున్నాయి. క్వాలిఫై రౌండ్‌లో కూడా వీరిద్దరూ 600కు 579 పాయింట్లు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 24 షాట్ల ఫైనల్ పోరులో తొలి నుంచి ఆధిపత్యం కనబరిచారు. ఇండోనేసియా ద్వయం దర్మోయో అసిస్త పేర్థాను పుత్రి, రబ్బోవ్ మొహమ్మద్ ఇక్బాల్ రాజాలు రజతం, కజకిస్థాన్ ద్వయం జాకియా అస్లియుం, మిర్రెం బెక్ తమిర్లాన్‌కు కాంస్య పతకం లభించింది. ముఖేష్‌కు ఇది రెండవ స్వర్ణ పతకం. గత బుధవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జూనియర్ టీమ్ విభాగంలో కూడా స్వర్ణం లభించింది.



బంగారు పతకంతో ముఖేష్, వంశికా

నెయ్యి కల్తీతో వైసీపీ భూస్థాపితం: ఎమ్మెల్యే యరపతినేని

రెంటచింతల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరుడి మహా ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందనే విషయం బట్టబయలవడంతో వైసీపీ నేతల్లో వణుకు ప్రారంభమైందని.. ఈ అప్రతిష్ట నుంచి బయటపడడానికి బూతులు తిడుతూ డైవర్షన్ రాజకీయాలకు తెరతీశారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకన్న స్వామి కళ్లు తెరిస్తే వైసీపీ భూస్థాపితమవ్వడం ఖాయమని శుక్రవారం స్వగ్రామమైన మంచికల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పులు మీద తప్పులు చేస్తూ కేసులో ఇరుక్కున్నప్పుడు చివరి అస్త్రంగా కులం కార్డు ఉపయోగిస్తూ వైసీపీ చేస్తున్న చిల్లర రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తుండడం వల్లనే వైసీపీ నేతలు ప్రశాంతంగా తిరుగుతూ నోటికొచ్చినట్లు దూషిస్తున్నారన్నారు. వాళ్ల వన్ సైడ్ వ్యవహరిస్తే శ్రీకృష్ణుని జన్మస్థానానికి పోయేవారన్నారు. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్‌లో కల్తీ నెయ్యి విషయం వెల్లడైందని, ఈ అవినీతి కంపుతో భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చారని విమర్శించారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో వైసీపీ నేతలు తిట్లపురణాన్ని లంకించుకున్నారని, వారు ఎంత రెచ్చగొట్టినా టీడీపీ నేతలంతా సంయమనం పాటిస్తున్నారన్నారు. మరోసారి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను దూషిస్తే సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ జిల్లా నేత యరపతినేని వెంకటేశ్వర్లు, సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, పి.శివనాగు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, శీలంనేని శివ, సొసైటీ చైర్మన్ యరపతినేని మట్టయ్య, మాజీ చైర్మన్ నరశింహారావు, సుమంత్‌రెడ్డి, నల్లబిరుదు నరశింహారావు, బి.రామకృష్ణ, సర్పంచ్ మందలపు హనిమిరెడ్డి, మాజీ ఎంపీపీ నర్శిరెడ్డి పాల్గొన్నారు.



వసతి గృహాల్లో నిత్యం మెనూ పర్యవేక్షణ

● సాంఘిక సంక్షేమాధికారి యు.చెన్నయ్య

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి రోజూ మెనూ పర్యవేక్షణ జరుగుతోందని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి యు.చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మెనూలో కోత అధికారుల మేత శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మెనూ అమలులో ఎలాంటి లోపాలకు తావులేదన్నారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి మెనూ ఫొటోలు ప్రతి రోజు వసతి గృహ సంక్షేమ అధికారుల పోస్టు చేస్తున్నట్లు తెలిపారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. బయోమెట్రిక్ హాజరు ప్రకారం డైట్ బిల్లులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. మెనూ అమలులో ఎటువంటి లోటుపాట్లు అస్కారం లేదని పేర్కొన్నారు.

చురుగ్గా మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు

అమృతలూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో ఒకటైన గోవాడ శ్రీబాలకోటే శ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ ఉత్సవాలు 5 రోజులు జరగనున్నాయి. ఆలయ ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు హజరవుతారు. ఐరన్ బారికేడ్లు, క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో పిచ్చి చెట్లు తొలగించి, చలువ పందిళ్లు వేశారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సహకారం, జిల్లా పరిషత్ నిధులతో కొంత మేర తారురోడ్డు వేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పావులూరి రమేష్, ఈవో ఎంవీఎస్‌వర్మ, తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, చుండూరు సీఐ అనందరావు, అమృతలూరు ఎస్ఐ సుమన్ పర్యవేక్షిస్తున్నారు.

జూనియర్ విజేత అనంతపురం ఎడ్ల జత

నాదెండ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నాదెండ్ల గ్రామ సమీపంలో గల నందికుంట విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభాల బండ లాగుడు పోటీలు ఆహ్లాదకరంగా సాగుతున్నాయి. జూని యర్స్ విభాగంలో మొత్తం తొమ్మిది జతల ఎడ్లు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా సింగనమల మండలం చక్రాయపేటకు చెందిన ఎద్దుల రవీంద్రనాథ్‌రెడ్డి ఎడ్ల జత 3,156 అడుగులు బండ లాగి ప్రథమ బహుమతి సాధించింది. ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ళకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరికి చెందిన ఎడ్ల జత మూడు వేల అడుగులు బండ లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన ఎర్రసాని సుబ్బయ్య జత 2,758 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు పలువురికి ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు.

సాంకేతికతతో.. న్యాయ వృత్తిలో రాణింపు

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): న్యాయవృత్తిలో రాణించాలని అనుకునే విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవడం, సాంకేతిక సహాయంతో సరైన కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని ఎంజీఎం వర్సిటీ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.మాణిక్యాలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏఎన్‌యూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లీగల్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన న్యాయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సుమారు 40 ఏళ్ల తన సుదీర్ఘ న్యాయ బోధనలో ఎన్నో ఎత్తు పల్లాలను చూశానని, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్, అనేక రాష్ట్రాల్లో న్యాయ విద్యకు అధికారిగా పనిచేశానన్నారు. వాస్తవిక చట్టంవిధానపరమైన కేసులకు సంబందించి నియమాలను తెలియజేస్తుందన్నారు. అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, డాక్టర్ రామకోటిరెడ్డి, అభిలాష్ గోపీనాథన్, మనోజ్, దినకర్ పాల్గొన్నారు.

కొండవీడు ఉత్సవాలను విజయవంతం చేయాలి

● కలెక్టరు కృతికా శుక్లా

యడ్లపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కొండవీడు ఉత్సవాలను విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. శని, ఆదివారాల్లో జరగనున్న కొండవీడు ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సభా వేదిక, హెలీ రైడ్‌కోసం సిద్ధం చేసిన హెలీప్యాడ్, హెలీకాప్టర్‌ను, పార్కింగ్ సౌకర్యాలను సందర్శించారు. ఘాట్ మార్గం గుండా వెళుతూ విద్యుద్దీపాలను పరిశీలించారు. శాండ్ ఆర్ట్, ఫ్లవర్ షో గ్యాలరీలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయానికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో మధులత, డీఎఫ్‌వో కృష్ణప్రియ, పలు శాఖల అధికారులతోపాటు టీడీపీ నాయకులు ఉన్నారు. ఉదయం మున్సిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నేటి కార్యక్రమాలు

ఉదయం 7 గంటలకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం. 10 గంటలకు అధికారికంగా ఉత్సవాలు ప్రారంభం. సాయంత్రం 5 గంటల వరకు కొండపైన వివిధ క్రీడా, సాహస, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు కొండ దిగువన సాసంస్కృతిక కార్యక్రమాలకు లావణ్య యాంకర్‌గా వ్యవహరిస్తారు. లుక్స్ రాజశేఖర్ బృందం నృత్య ప్రదర్శన, జబర్దస్త్ బృందం కామెడీ స్కిట్స్, సమీరా భరద్వాజ్, ధనుంజయ్ సినీ గీతాలపన ప్రేక్షకులను అలరించనున్నాయి.

ప్రముఖుల హాజరు..

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు హాజరు కానున్నారు. రెండో రోజు మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు సూచించారు. గురువారం గుంటూరు జడ్పీ మీటింగ్ హాల్‌లో పంచాయతీ రాజ్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్ల పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు. కమిషనర్ ఓఎస్డీ ఆనంద్, డీపీఓ బీవీ నాగసాయికుమార్, డీడీఓ పిచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నాటక మహోత్సవం



నాటక ప్రారంభ మహోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన

● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా - ఢిల్లీ వేదిక (ఎన్ఎస్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షత వహించగా, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ) ప్రతినిధి వీణాశర్మ, ముత్తవరపు అరుణకుమారి, డాక్టర్ భార్గవి చౌదరి, రంగస్థల నటీ లహరి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ నాటక రంగానికి పునఃవైభవం తీసుకోచ్చేందుకు ఈ ఉత్సవాలను నిర్వహి స్తున్నట్లు చెప్పారు. వీణాశర్మ మాట్లాడుతూ మానవాళికి, కళలకు ఉన్న సంబంధం గొప్పవన్నారు. అవి సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని ఆవిష్కరించడంతో పాటు మానవుల జీవనాలను దశదిశా నిర్దేశిస్తాయ న్నారు. ఏఎన్‌యూ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఎల్వీ నాగభూషణం, ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి పి. రామచంద్రరాజు, డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. కళాపరిషత్‌లకు చెందిన 9మంది ఉద్దండులు, అతిథులను ఘనంగా సత్కరించారు.

వైవిధ్యంగా 'కనుప్రియ'

ధరమ్‌వీర్ భర్తీ రచనలో.. రతన్ థీయం దర్శకత్వం వహించిన కోరస్ రిపెర్టర్ థియేటర్ వారి 'కనుప్రియ' (మణిపూరి) నాటక ప్రదర్శన వైవిధ్యంగా సాగింది. ఈ నాటకంలో మహాభారత కాలపు ధర్మకర్తగా, కలియుగపు ఆధునిక మానవుడిగా ఈ రెండు కాలాల మధ్య కృష్ణుని ప్రయాణం, కీలక ఘట్టాలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. మంగళగిరి సుధాకర్ డప్పుబృందం, విద్యార్థుల కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన భద్రాద్రి రామ కోలాటం, కేజీబీవీ (నరసరావుపేట) రేపల్లె వాడలో చిన్ని కృష్ణుడు జానపద నృత్యం, ఈశ్వర్ ఇంజినీరింగ్ - ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ, జానపద నృత్యాలు వేదికపై నూతన వెలుగులునింపాయి.



నాటక మహోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ సురేష్ బాబు

మిర్చియార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	72,663
అమ్మకాలు	82,642
నిల్వ	14,687

రకం		
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23000
273	14000	22000
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15500	27000
ఆర్మూరు	13000	17500
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22000
నెంబరు. 5	13000	21500
273	----	----
341	14000	24000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	25000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7200	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజలు ఛీకొట్టినా మార్పు రాదా?

● లడ్డూ కల్తీ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే నాటకాలు

● వైసీపీ అధినేతపై తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఫైర్

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా పులివెందుల ఎమ్మెల్యే జగన్‌లో మార్పు రాలేదని, ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ సమస్యలపై మాట్లాడేందుకు కనీసం అసెంబ్లీకి కూడా రాని జగన్ ఇప్పుడు పరామర్శల పేరుతో రోడ్డెక్కడం చూస్తే ప్రతిఒక్కరూ అసహ్యించుకుంటున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని బాలాజీ నగర్, లక్ష్మీనగర్‌లలో శుక్రవారం ఆయన రూ.3.73 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అభివృద్ధికి దూరమైన అన్ని ప్రాంతాల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. కాగా జగన్ పరామర్శల పర్యటనలపై మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దాడులకు తెగబడినప్పుడు జగన్మోహన్‌రెడ్డి ఎక్కడకి వెళ్లారని ప్రశ్నించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూల తయారీలో కల్తీ నిజమని తేలడంతో వైసీపీ నాయకులే రాష్ట్రంలో అల్లర్లకు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తుతో మాట్లాడుతున్నావా రోజా!

● జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అంబటి కుటుంబం పరామర్శ పేరిట గుంటూరు వచ్చిన మాజీ మంత్రి ఆర్కే రోజా.. మద్యం మత్తు తలకెక్కి కూటమి నేతలపై అవాకులు చెవాకులు పేలుతున్నట్లు అనుమానం వస్తోందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. అమరావతి రోడ్డులోని జనసేన పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబటి కుటుంబాన్ని పరామర్శించి వెళ్లకుండా తగుదునమ్మా అంటూ నీతి నిజాయతీ మారుపేరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై నోరు పారేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గాదె తెలిపారు. గతంలో పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరిట ఆమె భారీ అవినీతికి పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు జరిపి ఆమెను శిక్షించాలని కోరుతూ ప్రభుత్వానికి జనసేన పార్టీ తరఫున లేఖ రాస్తున్నట్టు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు, మిర్చియార్డు వైస్ చైర్‌పర్సన్ బిట్రగుంట మల్లిక, డైరెక్టర్ కటకంశెట్టి విజయలక్ష్మి, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, నాయకులు ఆడపా మాణిక్యాలరావు, శిఖ బాలు, చట్టాల త్రినాథ్ పాల్గొన్నారు.

పరామర్శలు.. ఓదార్పు రాజకీయాలు : మేయర్

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పరామర్శలు, ఓదార్పులపైనే రాజకీయాలు చేయడం జగన్ నైజం అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. గుంటూరులో జరిగిన జగన్ పర్యటనను దృష్టిలో ఉంచుకుని స్పందిస్తూ జగన్ రప్ప.. రప్ప.. ట్రైలర్ అంటూ వారి క్యాడర్‌ను రెచ్చగొడుతున్నారన్నారు. వచ్చేది ప్రజాకోర్టు నెయ్యి వ్యవహారంతో పాటు అమరావతి పునర్నిర్మాణ ప్రక్రియ వేగ వంతం.., కేంద్ర బడ్జెట్, రాబోయే రాష్ట్ర బడ్జెట్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తున్నారన్నారు. పిల్లో బాగుంటారని కొంతమంది ట్రిగ్గర్లు ఎయిమ్‌ని జనజీవనంలో తిరిగి వ్యక్తుల శ్రీవృద్ధ జన్మస్థానానికి పంపివేయాలని నిశ్చయించుకున్నారని ఎద్దేవా చేశారు. తన సొంత కుటుంబంలో తల్లి, చెల్లిని గౌరవించని జగన్ ఇతర కుటుంబాలను పరామర్శకు రావడం ఆయన విజ్ఞతకే వదిలేయాలన్నారు. జగన్‌కు, ఆయన బ్యాచ్‌కు జైలు అంటే ఆత్మారింకి దూరి చందంగా తయారైందన్నారు.

నూతన భవన సముదాయానికి రూ.10 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవా సమితి(కేజేఎస్ఎస్) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి కృష్ణా జిల్లాకు చెందిన సూరపనేని వెంకట రమణారావు రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని దాత భవన నిర్మాణ ఆకౌంట్ ఖాతాకు పంపారు. ఈ సందర్భంగా కేజేఎస్ఎస్ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ భవన నిర్మాణంలో దాతల సహకారం మరవలేనిది అన్నారు. దాతలు సాయంతో త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. వచ్చే ఏడాది నాటికి 500 మంది విద్యార్థులకు వసతి కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 2 వేల మందికి వసతి కల్పించేందుకు రూ.50 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణానికి దాతలు ముందుకురావాలని కోరారు. సమితి లైఫ్ టైమ్ చైర్మన్ నూతక్కి రామకృష్ణ ప్రసాదు ప్రోత్సాహంతో ఈ నిధులు అందజేసిన సూరపనేని వెంకట రమణారావును సమితి పాలకవర్గ సభ్యులు అభినందించారు.



వెంకట రమణారావు

జిల్లా కోర్టు పీపీగా చుక్కపల్లి రమేష్

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది చుక్కపల్లి రమేష్ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ ఆ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం అభ్యసించిన రమేష్ 1994 నుంచి గుంటూరు జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. 2006లో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భారీ మెజారిటీతో గెలిచారు. 9 సంవత్సరాలుగా గుంటూరు జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారు. జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సందర్భంగా చుక్కపల్లి రమేష్‌ను పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, మాజీ ఏపీపీలు శ్రీనివాస రావు, రాజేష్‌ఆనంద్, కట్ట కాళిదాసు, బాబురావు, గుంటూరు కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ కోటేశ్వరరావు తదితరులు, న్యాయవాదులు అభినందించారు. రమేష్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రవాణా రంగ కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు కార్మికులు యూనియన్ పెట్టుకునే అవకాశం లేకుండా లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తలపెట్టిన సమ్మెలో రవాణా రంగ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, మేకల రవి, నాగేశ్వరరావు, ఎ.సాంబశివరావు, షేక్ నాగులు, కిషోర్, వెంకట బంగారుబాబు పాల్గొన్నారు.

నీటి నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో నీటి నాణ్యతను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కేంద్ర భూగర్భ జలాల బోర్డు (సీజీడబ్ల్యూబీ), దక్షిణ ప్రాంతం, హైదరాబాద్ ఆధ్వర్యంలో అక్విఫర్ మ్యాపింగ్ నిర్వహణ ప్రణాళిక - డేటా ప్రచారం వినియోగం అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల వల్ల భూగర్భ జలాల లభ్యత, నాణ్యతకు సంబంధించిన సవాళ్లు పెరుగుతున్నాయని తెలిపారు. గుంటూరు, అమరావతి పట్టణ సముదాయాల్లో కేంద్ర భూగర్భ జలాల బోర్డు చేపట్టిన సమగ్ర అధ్యయనాన్ని కలెక్టర్ అభినందించారు. కేంద్ర భూగర్భ జలాల బోర్డు రూపొందించిన సమగ్ర నివేదికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ వర్క్‌షాప్‌లో కేంద్ర భూగర్భ జలాల బోర్డు శాస్త్రవేత్త పెరిక యాదయ్య, వాటర్ ఆడిట్ శాఖ డీడీ డి.వందనం తదితరులు పాల్గొన్నారు.

● అక్షర ఆంధ్ర అభ్యాసకులను యాప్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపై కలెక్టరేట్‌లో శుక్రవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నాటికి యాప్‌లో నమోదు పూర్తి కావాలన్నారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రీ ఫైనల్ పరీక్షలు, మార్చి 29వ తేదీన ఫైనల్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

● ర్యాంప్ (రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్) శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగా విడుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (డీ.ఐ.ఈ.పీ.సీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. జిల్లా పరిశ్రమల జీఎం జయలక్ష్మి మాట్లాడుతూ జనవరి 22వ తేదీ నుంచి నేటి వరకు 862 దరఖాస్తులు సింగిల్ విండోలో అందగా 798 దరఖాస్తులకు మంజూరు ఇచ్చారన్నారు.

● యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండలాల్లో ఎంపీడీవోలు వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలని అన్నారు. హడావిడిగా సర్వే చేసి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారని, నాణ్యత ప్రధానమని అన్నారు.

● జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించేలా, పరిసరాలు శుభ్రంగా ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీఈవో సలీం బాషా, డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీసీ పీడీలు వి.విజయలక్ష్మి, వి.శంకర్, పి.ప్రసూన, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి నజీం బేగం, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల్నాయుడు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను నెలాఖరుకు పరిష్కరించాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో లే అవుట్ రెగ్యులేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)లకు అందిన దరఖాస్తులను ఈ నెలాఖరులోపు అన్ని స్థాయిల్లో పరిష్కారం చేసేలా సిటి ప్లానర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఏసీపీలు రెహ్మాన్, జకీరా, టీపీఎస్‌లు, టీబీపీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



టౌన్ ప్లానింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మయూర్ అశోక్

కమిషనర్‌కు ప్రజాసంఘాల అభినందనలు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్‌కు ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. ఏపీ రజక జన సేవాసంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, భాస్కర్, హనుమాన్‌నాయక్, డి.ప్రకాష్ పలువురు నాయకులు పుష్పగుచ్ఛంతో కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. నగరాభివృద్ధికి సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగాలని, సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

మోహన్‌బాబు యూనివర్సిటీని సీజ్ చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఫీజుల దోపిడీపై నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులపై దాడులకు పాల్పడిన మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణుపై చర్యలు తీసుకుని, తక్షణమే యూనివర్సిటిని సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద శుక్రవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్ రూపంలో 26 కోట్ల రూపాయలు అధికంగా యాజమాన్యం వసూలు చేశారని అన్నారు. ఫీజులు వెనక్కి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విచారణ జరిపించి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో షేక్ సమీర్, బండారపు యశ్వంత్, అమర్నాథ్, సాయి, అజయ్, దుర్గా ప్రసాద్, రాజేంద్ర, కిరణ్, సౌమ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమానికి ఏక్తా మంచ్ యూనియన్ కృషి అభినందనీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల సంక్షేమానికి ది రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ ట్రేడ్ యూనియన్ చేస్తున్న కృషి అభినందనీయమని డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం డ్రైవర్స్ డే పురస్కరించుకుని గుంటూరులోని జాతీయ కార్యాలయంలో డ్రైవర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ప్రజా హక్కుల జేఏసీ చైర్మన్ ఫౌండర్ జొన్నలగడ్డ వెంకటరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. యూనియన్ చైర్మన్ హబీబ్ షేక్ మాట్లాడుతూ డ్రైవర్స్ దినోత్సవం అధికారికంగా ప్రభుత్వం నిర్వహించేలా కృషితో పాటు, డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జాన్ షేక్, కాలిశెట్టి చంద్రశేఖర్, షేక్ మహబూబ్ బాషా, పూజారి మారుతీకుమార్, విజయ చందర్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలి : ఈశ్వరయ్య

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో నియమితులై, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కొనసాగుతున్న.. ఏపీ, తెలంగాణ స్థానికత కల్గిన హోంగార్డులను వారి సొంత రాష్ట్రాలకు తక్షణమే బదిలీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పటికి, ఆయా ప్రభుత్వాలు వారి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హోంగార్డులకు పూర్తి వేతనాలు చెల్లించాలని, రోజువారీ వేతనాన్ని రూ.1,124గా నిర్ణయించాలన్నారు. రాష్ట్రంలో హోంగార్డులకు పేస్కేల్ విధానం అమలుచేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.77 ప్రకారం మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా హోంగార్డులను రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి

● ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘ ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనల్లో భాగంగా స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు శుక్రవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. భిక్షాటన చేస్తూ ఉద్యోగులు తమ నిరసనను తెలిపారు. ఏఐటీయూసీ ఉప కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల నిరసనలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. 13న కార్యాలయాల ముట్టడిలో ఉద్యోగులతో పాటు యూనియన్ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ నిరసనల్లో అనకాపల్లి, కాకినాడ జిల్లా నాయకులు లక్ష్మణరావు, రమణ, ఆదినారాయణ, నరసరాజు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వేదికపైన లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

పాలకులు మంచి వాళ్లయితేనే రాజ్యాంగ ఫలాలు దక్కుతాయి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పేర్కొన్నట్లుగా రాజ్యాంగం ఎంత గొప్పదైనా అమలు చేసే పాలకులు నిజాయితీ పరులైతేనే రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందుతాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం రాజ్యాంగ చర్చావేదిక ఆధ్వర్యంలో అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేఎస్.లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ నిర్మాణం-రాజ్యాంగ పీఠిక, పుస్తకాన్ని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, భారత రాజ్యాంగం-ముఖ్యాంశాలు పుస్తకాన్ని నర్రా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ నేడు కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే విధంగా, ఫెడరలిజాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఈ పెనుముప్పు నుంచి కాపాడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థదే అని పేర్కొన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఇండియన్ లాయర్స్ యూనియన్ కార్యదర్శి, హైకోర్టు సీనియర్ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, సంయుక్త కార్యదర్శి టి.సేవకుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, అవగాహన సంస్థ వ్యవస్థాపకులు కొండా శివరామిరెడ్డి, ప్రోగ్రెస్ ఫోరం కార్యదర్శి పీవీ మల్లికార్జునరావు, బీసీ మహా జనసభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, ఎల్ఎస్ భార్గవి, స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ ఆశిష్ పాల్గొని ప్రసంగించారు.

ఆరోగ్య శాఖలో టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు ఉన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1100కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. ఈ ఫిర్యాదులను ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుందని, వాటి పరిష్కారంపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందని ఆమె వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో పాటు ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం, అన్ని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రదర్శించాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు.

పోలీస్ బలగాల యుద్ధ సన్నద్ధతను పటిష్టం చేయడమే లక్ష్యం

● వార్షిక ఫైరింగ్ శిక్షణలో ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సాయుధ బలగాల యుద్ధ సన్నద్ధతను పటిష్టం చేయడమే వార్షిక ఫైరింగ్ శిక్షణ ముఖ్య ఉద్దేశమని అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు పర్యవేక్షణలో మేడికొండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేరేచర్ల ఫైరింగ్ రేంజ్‌లో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ బలగాలకు వరుసగా రెండో రోజు వార్షిక ఫైరింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ స్వయంగా ఫైరింగ్ సాధనలో పాల్గొని విధి నిర్వహణలో ధైర్యం, నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఇలాంటి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన, భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ సంకురయ్య, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీ వెంకట కృష్ణయ్య బదిలీ

గుంటూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.వెంకట కృష్ణయ్యను బదిలీ చేశారు. ఆయన స్థానంలో సాంబశివరావును నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకట కృష్ణయ్యను పల్నాడు జిల్లా ఉడాకు బదిలీ చేశారు. ఉడా సెక్రటరీగా పనిచేస్తున్న సాంబశివరావును డీసీగా నియమించారు.

కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటి అగ్రహారం ఒకటో లైన్‌లో కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొని శుక్రవారం అదే ప్రాంతానికి చెందిన వేముల శివరామకృష్ణ శర్మ (64) మృతి చెందాడు. వెస్ట్ ట్రాఫిక్ సిఐ సింగయ్య కథనం మేరకు శివరామకృష్ణ శర్మ ఏటీ అగ్రహారం ఒకటవ లైనులో రోడ్డు దాటుతుండగా అదేసమయంలో ఒకటో లైన్ వైపు నుంచి నాలుగో లైన్ వైపు కాంక్రీట్ మిక్సింగ్ తీసుకెళ్తున్న మిక్సర్ వాహనం ఢీ కొట్టింది. రామకృష్ణ శర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని అన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రజల విజ్ఞప్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. సత్వర పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజల అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారన్నారు.

● గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్‌గా నియమితులైన కె.శ్రావణ కుమారి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ వెల్ఫేర్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్‌లు ఎమ్మెల్యే మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ పరామర్శ యాత్రలను నిషేధించాలి

● టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ పరామర్శ యాత్రలను నిషేధించాలని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటికి పరామర్శకు వెళ్తున్న జగన్ కాన్వాయిలో ఒక యువకుడు బండిని ఇష్టానుసారంగా నడుపుతూ పోలీస్ కాన్వాయిని గుద్ది చనిపోవడం, ఒక వ్యక్తి వీళ్ళ హంగామాలో ఇరుక్కుపోయి గుండె ఆగి మరణించడం దారుణమైన సంఘటనలన్నారు. ఎవరిని ప్రశ్నిస్తున్నాం అనేది గొప్ప విషయం కాదు.. ఎవరిని నిందిస్తున్నామనేది బాధాకరమైన విషయమని.. వైసీపీ నాయకులు గుర్తించి మాట్లాడితే మంచిదన్నారు. గుంటూరులో అంబటి రాంబాబు కావాలనే ఫ్లెక్సీ గొడవ పెట్టుకొని చంద్ర బాబు మీద నోరు పారేసుకున్నాడన్నారు. జోగి రమేష్ అసందర్భ ప్రేలాపనకుపోయి నారా లోకేశ్‌పై విషం కక్కాడని, ఇద్దరి ఇళ్ళకి నిప్పు పెట్టిన వాళ్ళు వైసీపీ కార్యకర్తలేనని ఆయన ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో పరామర్శల పేరుతో తిరిగే అర్హత లేదన్నారు. గుంటూరు మహిళా ఎమ్మెల్యే గల్లా మాధవిని జుట్టు పట్టుకుని లాగుతానన్న వెధవ జక్కంపూడి రాజా అనే వాడిని గుంటూరు వస్తే టీడీపీ కార్యకర్తల తడాఖా చూపిస్తారని హెచ్చరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకుమానువారితోటలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. శుక్రవారం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ నిందితుడిని హాజరుపరచి వివరాలు వెల్లడించారు. నిందితుడు చిమిటికంటి చరణ్ కొంతకాలంగా తాగుడుకు బానిసై పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తనకు డబ్బు అవసరమైనప్పుడు ఇళ్లల్లో వస్తువులను చోరి చేసి వాటిని అమ్మేవాడు. ఈ క్రమంలో గత నెల 29న తెల్లవారుఝామున కాకుమానువారితోట, 8వ లైన్‌కు చెందిన నల్లమల్లి సాయి పవన్ కుమార్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో నిందితుడు ఇంట్లోకి చొరబడి బెడ్ రూమ్‌లో ఉన్న డెస్క్‌లో ఉన్న బంగారపు వస్తువులు, ఒక సెల్‌ఫోన్, రూ.2 వేల నగదును దొంగలించుకొని పోయినట్లుగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. చోరి సొత్తు విలువ మొత్తం 7.05 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఈ నెల 14న ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు కేటాయింపులు జరగాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు కోరారు. బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాదు, లేళ్ల అప్పి రెడ్డి, మురుగుడు హనుమంతరావులకు వారు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు టీవీ రామిరెడ్డి మాట్లాడుతూ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, పెండింగ్ డీఏలు, మధ్యంతర భృతి తదితర ఆర్థికపరమైన అంశాలలో కేటాయింపులు జరగాలని కోరారు. సమస్యలను శాసన మండలిలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని వారుహామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వై నాగేశ్వర రావు, లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, వజ్జా పెద్దరత్తయ్య, ఈశ్వరప్రసాదు, కరీముల్లా పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, దాసరి రాజామాస్టారు - గుంటూరు (ఆంధ్రజ్యోతి).



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, అధికారులు

నేటి నుంచి కొండవీడు ఫెస్ట్

(3వ పేజీ తరువాయి)

పాఠశాలలు, కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో కొండవీడుకు విద్యార్థులను తరలించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లుచేస్తోంది. వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచేందుకు వివిధ రకాల పోటీలను, కార్యక్రమాలను అధికారులు ఏర్పాటుచేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొండపైన, సాయంత్రం 5 నుంచి 10గంటల వరకు కొండ దిగువన చిల్డ్రన్స్ ప్లే ఎగ్జిబిష న్, డ్యాన్స్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వీటితోపాటు ప్రధానవేదిక సమీపంలో లేజర్‌షో, ఫైర్ క్రాకర్స్‌షో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అంతేగాకుండా జబర్దస్త్ కళాకారులు, సినీగాయకులతో మ్యూజికల్‌నైట్, డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నారు. సాహస ప్రియులకోసం హార్స్ రైడింగ్, రాక్ క్లైంబింగ్, బోటింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం అటవీశాఖ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది.

పటిష్ఠ బందోబస్తు..

ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, ఘాట్‌మార్గంలో ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ కృష్ణారావు పర్యవేక్షణలో డీఎస్పీ హనుమంతరా వు, ట్రైనీ డీఎస్పీ జయకృష్ణతోపాటు ముగ్గురు సీఐలు, 15మం ది ఎస్ఐలు, 180మంది సిబ్బందిని బందోబస్తుకు కేటాయించారు.

పల్లెకు.. ఆపన్నహస్తం కావాలి

(3వ పేజీ తరువాయి)

ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. బ్లీచింగ్ చల్లేందుకు కూడా నిధులు ఉండని పరిస్థితి చాలా పంచాయతీల్లో ఉంది. కనీసం మురుగు కాలువలు శుభ్రం చేసేందుకు నిధుల కొరత నెలకొంది. సొంతంగా నిధులు సమకూర్చుకునే పరిస్థితి లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై ఆధారపడాల్సి వస్తోంది. ఉద్యోగులు, పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో పన్ను చెల్లింపులు జరగడం లేదు. బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేయడంలో రాజకీయ నేతలు కొన్ని పంచాయతీల్లో అడ్డుతగులుతున్నారన్న విమర్శలున్నాయి. పంచాయతీల పాలక వర్గాలు పంచాయతీల ఉద్యోగులకు సహకరించి ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేసేందుకు కృషి చేయాల్సి ఉంది.

బాపట్ల జిల్లాలోని బొడ్డపాడు, కూచిపూడి, వామనగుంటపాలెం, కన్నెగంటివారిపాలెం, జిల్లేపల్లి, వెనిగళ్లవారిపాలెం, కొత్తపాలెం, బండ్లగరువు, వడ్డివారిపాలెం, గుంటూరు జిల్లాలోని అట్లూరివారిపాలెం, మునగపాడు, పల్నాడు జిల్లాలోని కాకిరాల, గుండ్లపాడు, కొప్పుకొండతండా పంచాయతీల్లో నూరు శాతం పన్ను వసూలైనట్టు పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది. బాపట్ల జిల్లాలోని వైదన, కోనంకి, వెస్ట్ బాపట్ల, గుంటూరు జిల్లాలోని పుసులూరు, కొవెలమూడి, పల్నాడు జిల్లాలోని చిట్టాపురం, మిట్టపాలెం, ఒర్వకల్లు, గండిగనమ, ఇర్లపాడు పంచాయతీల్లో ఐదు శాతం లోపే పన్ను వసూలు అయినట్టు పంచాయతీరాజ్ శాఖ తెలిపింది.

రాష్ట్ర రహదారిగా ఎన్‌హెచ్-16

- ● వెస్ట్ బైపాస్ పూర్తయితే.. అదే జాతీయ రహదారి
- ● పాత రహదారిని రాష్ట్రానికి అప్పగించనున్న కేంద్ర ప్రభుత్వం
- ● అందులో భాగంగా వన్ టైమ్ ఇంప్రూవ్‌మెంట్ ద్వారా రహదారి అభివృద్ధి
- ● వారధి సహా ఆర్వోబీలు, రోడ్డును అభివృద్ధి చేయనున్న ఎన్‌హెచ్‌ఏఐ
- ● ఆ తరువాతే రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్డు అప్పగింత
- ● ఏప్రిల్ నుంచి పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక



రాష్ట్ర రహదారిగా మారనున్న జాతీయ రహదారి

మంగళగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ జాతీయ రహదారి హోదాలో ప్రజలకు రవాణా సేవలందించిన ఎన్‌హెచ్- 16 మార్చి తరువాత రాష్ట్ర రహదారిగా మారిపోనుంది. ప్రస్తుతం విజయవాడ వెస్ట్ బైపాస్ పేరుతో నిర్మిస్తున్న ఎన్‌హెచ్- 16 నిర్మాణం మార్చి నాటికి పూర్తయ్యి.. అందుబాటులోకి వస్తే దానినే ఎన్‌హెచ్- 16గా పరిగణిస్తారు. అప్పటి నుంచి ఎన్టీఆర్ జిల్లా చిన్న అవుటుపల్లి దగ్గర ఉన్న పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా కాజ టోల్ ప్లాజా వరకూ 45 కిలోమీటర్ల మేర ఉన్న ప్రస్తుత ఎన్‌హెచ్- 16 రాష్ట్ర రహదారిగా మారుతుంది. దీనికి సంబంధించి జాతీయ రహదారులు, రవాణ మంత్రిత్వ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మరో 15 రోజుల్లో దీనికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది.

● వేగంగా వెస్ట్ బైపాస్ రెండో వైపు పనులు

వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే చెన్నై- కోల్‌కతా మూడు లేన్ల రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఆ రోడ్డును అందుబాటులోకి తెచ్చిన అధికారులు రెండో వైపు పనుల్లో కూడా వేగం పెంచారు. కాజ జంక్షన్ వద్ద అనుసంధాన పనులకు పదును పెడుతూనే, ఇతర ప్రాంతాల్లో పెండింగులో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నారు. మార్చి నెలాఖరుకల్లా రోడ్డును పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. అనంతరం అదే జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16గా వ్యవహరిస్తారని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జాతీయ రహదారిగా ఉన్న రోడ్డును రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తారని చెబుతున్నారు.

● వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ పనులు

మార్చి నెలాఖరులోగా వెస్ట్ బైపాస్ పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రస్తుత రహదారి రాష్ట్ర రహదారిగా మారుతుంది. దీనికి ముందు ఎన్‌హెచ్‌ఏఐ ప్రస్తుత రహదారిని అభివృద్ధి చేసి అప్పగించాల్సి ఉంటుంది. ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రస్తుతం ఉన్న ఎన్‌హెచ్-16 రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి. దీనినే 'వన్ టైమ్ ఇంప్రూవ్‌మెంటు' అంటారు. వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ పేరుతో ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఈ రహదారిని చిన్న అవుటుపల్లి నుంచి కాజ జంక్షన్ వరకూ అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. మూడు వరుసల్లో ఉన్న ఈ రోడ్డులో మరమ్మతులకు గురైన కనకదుర్గమ్మ వారధిని కూడా పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి. బ్రిడ్జి కింద ఉన్న బేరింగ్ లైన్లను మార్చి కొత్త బేరింగులు వేయడంతో పాటు, జాయింట్లను కూడా సరిచేస్తారు. దీంతోపాటు మిగిలిన రోడ్డు మొత్తం బీటీ లేయర్ వేసి మళ్లీ రోడ్డు వేసి పూర్తిగా సిద్ధం చేసి, పేవ్‌మెంట్ మార్కింగ్ చేసి నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తారు. విజయవాడ వైపు నున్న వారధి హద్దు నుంచి కాజ జంక్షన్ వరకూ ఆర్ అండ్ బీ గుంటూరు డివిజన్‌కు, విజయవాడ నుంచి చిన్న అవుటుపల్లి వరకూ ఆర్ అండ్ బీ విజయవాడ డివిజన్‌కు అప్పగిస్తారు. రోడ్డు అభివృద్ధిలో భాగంగా కుంచనపల్లి వద్దనున్న ఆర్వోబీని కూడా విస్తరించనున్నారు. ప్రస్తుతం అక్కడ రెండు లేన్ల ఆర్వోబీ ఉండగా, మూడో లేన్ ఆర్వోబీని నిర్మించనున్నారు. దీనికి సంబంధించి ప్రాథమిక స్థాయి పనులు మొదలయ్యాయి. ఈ వంతెనను కూడా పూర్తి చేసే బాధ్యత ఎన్‌హెచ్‌ఏఐదే!

● డీనోటిఫికేషన్ తరువాత రాష్ట్రపరం

ఏప్రిల్ నుంచి ప్రస్తుత హైవే నిర్వహణ బాధ్యత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమిస్తుంది. అయితే రోడ్డుకోసం సేకరించిన భూమి మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించదు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఎన్‌హెచ్‌ఏఐలోని ఆ భాగాన్ని డీ నోటిఫై చేయాలి. ఆ ప్రక్రియ మొత్తం పూర్తయిన తరువాత ఆ రోడ్డు పరిధిలో ఉన్న భూములు కూడా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తాయి.

నిత్యం ఆత్మవిమర్శే.. అసలైన విజయం

- ● చిత్ర దర్శకుడు ప్రదీప్ అద్వైతం
- ● ఉత్సాహంగా విజ్ఞాన్ మహోత్సవ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యంగా.. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న విజ్ఞాన్ మహోత్సవ్ ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగుతోంది. శుక్రవారం విద్యార్థులు క్రీడా, సాంస్కృతి సంబరాలతో హోరెత్తించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్ త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన ఇలా అనేక క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత పాల్గొంది. ముఖ్య అతిథి ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం (చాంపియన్ మూవీ) మాట్లాడుతూ ప్రారంభ దశలో ఉన్నవారైనా, అనుభవజ్ఞులైనా తప్పులు చేయడం సహజమన్నారు. మంచి విమర్శలను అంగీకరించడం ద్వారా మాత్రమే వ్యక్తి ఎదుగుదల సాధ్యమని వివరించారు. విజయానికి స్పష్టమైన నిర్వచనం లేదని, జీవితం ఎలా ప్రవహిస్తుందో అలా ముందుకు సాగాలన్నారు. సినిమా గురించి లోతుగా అధ్యయనం చేస్తే మంచి స్క్రీన్‌ప్లే రాయగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎప్పుడూ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ అన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఆటలో కొన్ని సార్లు ఆటంకాలు, వైఫల్యాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. విజ్ఞాన మహోత్సవ్‌లో అథ్లెటిక్స్ 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. శాస్త్రీయ, జానపద, ఆధునిక నృత్యాలతో విద్యార్థులు హోరెత్తించారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ తదితరులు పాల్గొన్నారు. మహోత్సవ్ వేదికపై చైనా పీస్ చిత్ర బృందం సందడి చేసింది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హీరో నిహాల్ కొదాటి, నటి శిరీష, దర్శకుడు అక్కి విశ్వనాథరెడ్డి విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసి ఉర్రూతలూగించారు.



కబడ్డీలో నువ్వా నేనా అంటూ...



శాస్త్రీయ నృత్యాల హోరు....



వేడుకల్ని తిలకిస్తున్న ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం



స్టెప్పులేస్తున్న చైనాపీస్ చిత్ర బృందం...

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



భారీ మొత్తంతో 'టాక్సిక్' హక్కులు కొన్న దిల్‌రాజు

కన్నడ హీరో యశ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన హక్కుల్ని రూ. 120 కోట్లకు (అడ్వాన్స్ ఆన్ కమిషన్ బేసిస్) సొంతం చేసుకోవడం విశేషం. ఒక నాన్ తెలుగు సినిమాకు ఇంత భారీ మొత్తంలో హక్కులు కొనడం ఇదే ప్రథమం. తెలుగు రాష్ట్రాల హక్కుల కోసం మూడు అగ్ర సంస్థలు పోటీ పడినప్పటికీ దిల్ రాజు సొంతం చేసుకోగలిగారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'భారతీయ చిత్ర పరిశ్రమలోని పెద్ద స్టార్స్‌ల లో యశ్ ఒకరు. 'కేజీఎఫ్ 2' చిత్రం తర్వాత ఆయన మార్కెట్ బాగా పెరిగింది. ఆయన కొత్త సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'టాక్సిక్' మీద భారీ అంచనాలు ఉన్నాయి. ఇలాంటి ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. యశ్, గీతూ మోహన్‌దాస్ కలసి రాసిన కథను గీతూ మోహన్‌దాస్ అద్భుతంగా తెరపైకి మలుస్తున్నారు.

అవార్డుల ఎంపిక పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఉండాలి

మల్లు భట్టి విక్రమార్క



ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డు'ల ప్రదానోత్సవాన్ని వచ్చే ఉగాది పర్వదినాన 'న భూతో న భవిష్యతి' అన్న రీతిలో నిర్వహిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రపంచ చలన చిత్ర పరిశ్రమ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గద్దర్ ఫిల్మ్ అవార్డుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియను విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవార్డుల నిర్వహణ బాధ్యతను ఎఫ్‌డీసీ(ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్, నిర్మాత దిల్‌రాజు చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారని అభినందించారు. మణిశర్మ నేతృత్వంలోని జ్యూరీ బృందం ఎటువంటి పక్షపాతం లేకుండా, పారదర్శకంగా అర్హులైన వారికే అవార్డులు దక్కేలా చూడాలని సూచించారు. హైదరాబాద్‌ను వరల్డ్ సినిమా హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక బ్లూప్రింట్‌తో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తన గళంతో సమాజాన్ని చైతన్యపరిచి, ప్రజల కోసం జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు, మణిశర్మ, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ కేసులో విజయ్‌కి షాక్

● రూ.1.50 కోట్లు జరిమానా విధింపు సమంజసమే ● హైకోర్టు తీర్పు



'పులి' చిత్రంలో నటించినందుకు తీసుకున్న పారితోషికంలో రూ.15కోట్లు తగ్గించి చూపించినందుకు ఆదాయపు పన్ను శాఖ నటుడు విజయ్‌కి రూ.1.50 కోట్ల మేరకు జరిమానా విధించడం సమంజసమేనని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. ఆ జరిమానా విధింపును వ్యతిరేకిస్తూ విజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. 2015లో విజయ్ నివాసగృహంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టి కీలకమైన దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించినప్పుడు విజయ్ 'పులి' చిత్రానికి తీసుకున్న పారితోషికంలో రూ.15 కోట్లదాకా తగ్గించి చూపినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో 2022లో విజయ్‌కు ఆదాయాన్ని దాచిన నేరానికి ఐటీ శాఖ రూ.1.5 కోట్లమేరకు జరిమానా విధించింది. ఆ జరిమానాను వ్యతిరేకిస్తూ విజయ్ మద్రాసు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆదాయపు పన్ను శాఖ ఆ జరిమానాను 2019 జూన్ 30కి ముందు విధించి ఉండాలని, మూడేళ్ల తర్వాత 2022లో ఉత్తర్వులు జారీ చేయటం చట్ట ప్రకారం తప్పిదమని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ అనంతరం విజయ్‌పై ఆదాయపు పన్ను శాఖ జరిమాన విధించడంలో ఎలాంటి చట్ట ఉల్లంఘనలు జరగలేదని హైకోర్టు శుక్రవారం వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. విజయ్ పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించింది. ఈ తీర్పుపై విజయ్ అప్పీలుకు వెళ్లేందుకు షరతులతో కూడిన వెసులుబాటు కల్పించింది.

చెన్నై(ఆంధ్రజ్యోతి)



'ఘూస్కోర్ పండత్' టైటిల్‌పై వివాదం.. విమర్శలు!

'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న నటుడు మనోజ్ వాజ్‌పేయి తాజాగా నటించిన 'ఘూస్కోర్ పండత్' చిత్రం త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. నీరజ్ పాండే నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఇటీవల నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసింది. అదుగో సరిగ్గా అప్పటినుంచే సినిమా టైటిల్ మీద నిరసనలు మొదలయ్యాయి. 'ఘూస్కోర్ పండత్' అంటే లంచగొండి పండితుడు అని అర్థం. ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఈ టైటిల్ పెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సమాజంలో గౌరవప్రదమైన కులాన్ని కించపరిచేలా ఈ చిత్రం టైటిల్ ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచేలా ఈ సినిమా టైటిల్ ఉందనీ, వెంటనే ఆ సినిమాను బ్యాన్ చేయాలని బీఎస్పీ నేత మాయావతి డిమాండ్ చేశారు.

'ఇదంతా మామూలే' అని నెట్‌ఫ్లిక్స్ మొదట్లో పట్టించుకోలేదు కానీ వ్యవహారం కేసులు, కోర్టుల వరకూ వెళ్లేసరికి ఇప్పుడు ఆ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, ట్రైలర్‌ని తొలిగించింది.

'లంచాలకు అలవాటు పడిన ఓ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ఇందులో ఒక వర్గాన్ని కానీ, కులాన్ని కానీ కించపరిచే సన్నివేశాలు లేవు. అయితే మా టైటిల్ కొందరి మనోభావాలను దెబ్బతీసిందని తెలిసింది. అది అర్థం చేసుకుంటూ ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ మెటీరియల్‌ను ఆపేస్తున్నాం' అని శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నీరజ్ పాండే, మనోజ్ వాజ్‌పాయ్ స్పష్టం చేశారు. మరో పక్క ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలపై లక్నో పోలీసులు చిత్ర దర్శకుడు రితీశ్ షాపై కేసు నమోదు చేశారు.

పోరాటాల కంటే తల్లి సంకల్పబలమే గొప్ప



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను 'మా వందే' పేరుతో రూపొందిస్తున్నారు వీర్‌రెడ్డి. మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ మోదీ పాత్ర పోషిస్తున్నారు.ఎన్నో పోరాటాలకంటే తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్ని అందిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ సంఘటనల ఆధారంగా అన్ని వర్గాల వారికి నచ్చేలా దర్శకుడు క్రాంతికుమార్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. పలు కీలక సన్నివేశాల చిత్రీకరణతో తొలి షెడ్యూల్ పూర్తయింది. రెండో షెడ్యూల్‌ను కశ్మీర్‌లో చిత్రీకరించనున్నారు. రూ. 400 కోట్లతో 'మా వందే' చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాత చెప్పారు. హాలీవుడ్ నటుడు జేనన్ మమొవా కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో రవీనా టాండన్, జగపతిబాబు, శరత్‌కుమార్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

బాలీవుడ్‌లో పెళ్లి ఒక జోక్

- 'హిట్ 3' విలన్



బాలీవుడ్‌లో జరుగుతున్న వివాహాల్లో 90 శాతం ఫేక్ అని తెలుగు సినిమా 'హిట్-3'లో విలన్‌గా నటించిన ప్రతీక్ స్మిత పాటిల్ వ్యాఖ్యానించారు. ప్రతీక్.. రాజ్ బబ్బర్- స్మితా పాటిల్ దంపతుల కుమారుడు. కుటుంబంలో నెలకొన్న సమస్యల కారణంగా తండ్రికి దూరంగా ఉంటున్నారు. గతేడాది ప్రియా బెనర్జీతో ప్రతీక్ వివాహం జరిగింది. ఈ పెళ్లికి తన తండ్రి రాజ్ బబ్బర్‌ని ఆహ్వానించలేదు. తాజాగా తన సతీమణితో కలసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు ప్రతీక్. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో జరుగుతున్న వివాహాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'బాలీవుడ్‌లో 90 శాతం వివాహ బంధాలు ముసుగుతోనే ఉంటాయి. వారందరూ పెళ్లిని ఒక జోక్‌గా చూస్తారు. మేము ఇండస్ట్రీలో ఉన్నాం కాబట్టి మాకు తెలుసు' అని ప్రతీక్ అన్నారు. పెళ్లికి ముందు తాము ఎన్నో బాధలు అనుభవించామని, ఎన్నో సమస్యలను ఎదుర్కొని ఇక్కడి వరకు వచ్చామని ప్రియా బెనర్జీ తెలిపారు. ప్రస్తుతం వీరి వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

'ఇట్లు అర్జున' అంటున్న వెంకీ కుడుముల



దర్శకుడు వెంకీ కుడుముల చిత్ర నిర్మాణరంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఆయన నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'తో అనిష్ హీరోగా పరిచయమవుతున్నారు. మహేశ్ ఉప్పల దర్శకుడు. అనస్వర రాజన్ హీరోయిన్. హీరో పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ సినిమాలో అనిష్ మూగవాడిగా నటిస్తున్నారు. ఒక కొత్త నటుడికి ఇది పెద్ద సవాలే. ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాటోగ్రఫీ రాజా మహదేవన్.

అడివి శేష్ అభినందనలు



జీవీ నాయుడు, వీజే బాలు, లావణ్య, కల్యాణి ప్రధాన పాత్రలు పోషించిన 'క్యాట్' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. గొంగటి వీరాంజనేయులు నాయుడు దర్శకత్వంలో రజని గొంగటి నిర్మించారు. ఈ సినిమా పోస్టర్ హీరో అడివి శేష్ రిలీజ్ చేసి థ్రిల్లర్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమా విజయం సాధించాలి. యూనిట్‌కు నా అభినందనలు' అని చెప్పారు.

ముగ్గురు తండ్రుల వ్యథ



రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో మహేశ్ చంద్ర తెరకెక్కిస్తోన్న చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది దీని ఉపశీర్షిక. మహేశ్ చంద్ర సినిమా టీమ్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్.ఎం.మురళీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన నిర్మాణాంతర పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు మహేశ్ చంద్ర మాట్లాడుతూ 'ఇది ముగ్గురు అమ్మాయిల కథలా అనిపించే ముగ్గురు తండ్రుల వ్యథ. ఈ ఇంటర్నెట్ తరం తెలుసుకోవలసిన అసలైన కథ ఇది' అని అన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కారం పొందిన రాజేంద్రప్రసాద్‌ను చిత్రబృందం అభినందించింది.

కుటుంబ ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



భూమికా చావ్లా, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో గుణశేఖర్ తెరకెక్కించిన యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'. శుక్రవారం విడుదలైన సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. "యుఫోరియా' టైటిల్ చూసి యూత్ మాత్రమే వస్తారని అనుకున్నాం. కుటుంబ ప్రేక్షకుల నుంచి కూడా గొప్ప స్పందన వస్తోంది" అని తెలిపారు. 'అమ్మాయిలు, అమ్మలు ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారు, తల్లీ కొడుకుల మధ్య ఉన్న సంఘర్షణను చాలా బాగా చూపించారు అని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు' అని నిర్మాత నీలిమ గుణ తెలిపారు.



రంగనాయక మండపంలో ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రవిచంద్ర

టీటీడీ ఈవోగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం సాంప్రదాయ వస్త్రధారణతో ముందుగా వరాహస్వామిని దర్శించున్న అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకున్న రవిచంద్రకు అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. తర్వాత క్యూలైన్ ద్వారా రవిచంద్ర ఆలయంలోకి వెళ్లారు. రంగనాయక మండపంలో ఈవోగా, టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దేవుడిపై భక్తివిశ్వాసాలు సన్నగిల్లకుండా, అందరి మనోభావాలు నిలబెట్టేలా ప్రయత్నిస్తానన్నారు. కల్తీ నెయ్యి అంశంపై బదులిస్తూ, టీటీడీ అధికారులు ఇచ్చిన నోట్స్ చదివానని, ముందే ఒక భావనతో కాకుండా ఉన్నది ఉన్నట్టుగా చూసి ఏం చేయాలో ఆలోచిస్తామని బదులిచ్చారు. తనకంటే ముందు పనిచేసిన అధికారుల సూచనలు, సలహాలు, చాలా ఏళ్లుగా తిరుమలలో పనిచేస్తూ అనుభవం పొందిన వారితో ఒక టీంగా ఏర్పడి పనిచేస్తామన్నారు. అనంతరం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు.

ఒత్తిడి నుంచి విముక్తి కల్పించండి

▸▸ గ్రామ, వార్డు సచివాలయాల ఫెడరేషన్ వినతి

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పనిఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జానీబాషా, బత్తుల అంకమ్మరావు రాష్ట్ర సచివాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకీకృత కుటుంబ సర్వేలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని వినతిపత్రంలో ప్రస్తావించారు. తమకు న్యాయబద్ధంగా రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని, పండుగ, ఆదివారం సెలవుల్లో అత్యవసరం మినహా ఇతర విధులను కేటాయించవద్దని, పనివేళల్లో మాత్రమే టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని కోరారు.

డీఏ బకాయిలపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: ఏపీసీపీఎస్ఈఏ

విజయవాడ అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2008 నుంచి 2018 వరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీపటాన్, కరిమి రాజేశ్వరరావు తెలిపారు. ఏపీలో 2018 నుంచి డీఏ బకాయిలు ఆగిపోవటానికి కారణం గత ప్రభుత్వానికి కొందరు సహకరించటమేనన్నారు.

డీఏ బకాయిల చెల్లింపులకు కమిటీ వేయాలి

▸▸ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పెన్షనర్ల డీఏ బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఎంత, చెల్లింపునకు ఒక ప్రణాళిక, కాలపట్టికను బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించాలని లేదా ప్రత్యామ్నాయ చెల్లింపు ప్రతిపాదనను అధ్యయనం చేయడానికి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెడతాం: బొప్పరాజు

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి నాల్గవ రాష్ట్ర మహాసభను విజయవంతం చేసిన ప్రతి ఉద్యోగికి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో మీడియాతో మాటాడుతూ ఉద్యోగులు జేఏసీపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా పని చేస్తామన్నారు.

ఒకటికి రెండు.. విజయపథంలో 'గ్రూప్' వీరులు

▸▸ 15 మందికి గ్రూప్ 1,2 రెండిటిలోనూ కొలువులు

▸▸ గ్రూప్-2 వదిలేసి గ్రూప్-1 పోస్టులో చేరే యోచన

▸▸ ఖాళీ పోస్టులు మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలనే విజ్ఞప్తులు

▸▸ కొద్ది మందికి తెలంగాణ, ఏపీల్లోనూ కొలువులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగం చాలా మంది కల..! దీనికోసం ఏళ్ల తరబడి కష్టపడి చదువుతారు..! అలా కష్టపడిన వారిలో కొందరికి ఉద్యోగాల పంట పండింది.! పలువురు అభ్యర్థులు అటు గ్రూప్-2 ఇటు గ్రూప్-1 రెండిట్లోనూ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం ఉద్యోగం వస్తే చాలు.. అనే పరిస్థితి నుంచి ఇప్పుడు ఏ ఉద్యోగం కావాలో ఎంపిక చేసుకునే స్థాయికి చేరుకున్నారు. కాగా.. వారిలో కొందరు ఇప్పటికే ఇతరత్రా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న వాళ్లు కూడా ఉన్నారు. కొద్ది మంది అభ్యర్థులైతే ఇటీవల విడుదలైన తెలంగాణ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి.. ఇప్పుడు ఏపీలోనూ కొలువులకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1, గ్రూప్-2 రెండు నోటిఫికేషన్లలోనూ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు 15 మంది ఉన్నారు. గత వారం గ్రూప్-1 ఫలితాలు విడుదల కాగా, అంతకముందు గ్రూప్-2 ఫలితాలు వచ్చాయి. రోజుల వ్యవధిలోనే రెండు నోటిఫికేషన్ల ఫలితాలు రావడంతో రెండిటికీ ఎంపికైన అభ్యర్థులు గ్రూప్-2 ఉద్యోగాలను వదిలేయనున్నారు. అలాగే రెండు రాష్ట్రాల్లోనూ ఉద్యోగాలు సాధించినవారిలో ఒకరిద్దరు తెలంగాణలోనే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. కాగా రెండిట్లో ఎంపికైన నేపథ్యంలో ఖాళీ అయ్యే గ్రూప్-2 ఉద్యోగాలను తర్వాత మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలని సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు కోరుతున్నారు. దానివల్ల పోస్టులను క్యారీ ఫార్వార్డ్ చేసే అవసరం ఉండదని, అలాగే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.

రెండు నోటిఫికేషన్లలో ఎంపిక

ఓ అభ్యర్థికి గ్రూప్-2లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. ఆ వెంటనే గ్రూప్-1 ఫలితాల్లో ఆర్టీవో ఉద్యోగం సాధించారు. మరో అభ్యర్థి గ్రూప్-2లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎంపికవగా, గ్రూప్-1లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ ఉద్యోగం వచ్చింది. ఓ అభ్యర్థికి గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్, గ్రూప్-1లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఉద్యోగాలు వచ్చాయి. కాగా.. వ్యక్తిగత కారణాలతో ఆయన గ్రూప్-2 ఉద్యోగంలోనే చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. మరో అభ్యర్థికి గ్రూప్-2లో డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగం, గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చాయి. ఇంకో అభ్యర్థికి గ్రూప్-లో జూనియర్ అసిస్టెంట్ వస్తే, గ్రూప్-1లో డిప్యూటీ రిజిస్ట్రార్ వచ్చింది. మరో అభ్యర్థికి గ్రూప్-2లో జూనియర్ అసిస్టెంట్, గ్రూప్-1లో ఏసీటీవో ఉద్యోగాలొచ్చాయి. ఇలా 15 మందికి రెండు నోటిఫికేషన్లలోనూ ఉద్యోగాలొచ్చాయి. వీరిలో ఒకరిద్దరు మినహా అందరూ గ్రూప్-2 ఉద్యోగాలను వదిలేయనున్నారు. మరోవైపు సుదర్శన్ అనే అభ్యర్థి ఇటీవల విడుదలైన తెలంగాణ గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగం సాధించగా, ఇప్పుడు ఏపీ గ్రూప్-1లోనూ ఉద్యోగం సాధించారు. లక్ష్మీ దీపిక అనే అభ్యర్థికి రెండు రాష్ట్రాల్లోనూ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాలు వచ్చాయి. ఏపీలో గ్రూప్-1లో సంక్షేమ శాఖలో ఉద్యోగం సాధించిన ఓ అభ్యర్థి ఆ ఉద్యోగంలో చేరేందుకు విముఖంగా ఉన్నట్లు తెలిసింది.


ఏపీపీఎస్సీ ఇదే చెప్పింది

తొలుత గ్రూప్-2 ఫలితాలు ఇస్తే గ్రూప్-1 ఫలితాల అనంతరం పలు పోస్టులు ఖాళీ అవుతాయని ఏపీపీఎస్సీ ముందే అభిప్రాయపడింది. అందుకే గ్రూప్-2 ఫలితాలు ఇవ్వాలని అభ్యర్థులు పదే పదే కోరినా కొంత ఆలస్యం చేస్తూ వచ్చింది. చివరికి గ్రూప్-1 కేసు ఎంతకీ తేలకపోవడం, గ్రూప్-2 ఫలితాల కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత ఆ ఫలితాలు ఇచ్చింది. అయితే రెండు నోటిఫికేషన్ల ఫలితాల మధ్య సమయం చాలా తక్కువగా ఉన్నందున గ్రూప్-1 ఫలితాలు ముందుగా ఇచ్చినా పెద్దగా మార్పులేం ఉండేవి కావు. గ్రూప్-1కు ఎంపికైనవారు గ్రూప్-2 ఉద్యోగాల్లో చేరకుండానే వదిలేసే పరిస్థితి వచ్చినందున ఆ పోస్టులను తర్వాత మెరిట్ అభ్యర్థులకు కేటాయించాలని సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికై చివరి దశలో ఉద్యోగాలు రాని అభ్యర్థులు కోరుతున్నారు. 2016కు ముందు ఇలా తర్వాత మెరిట్ అభ్యర్థులకు పోస్టులు కేటాయించే విధానం ఉండేది. చాలాకాలం నుంచి మిగిలిపోయిన పోస్టులను క్యారీ ఫార్వార్డ్ చేసి తర్వాత నోటిఫికేషన్లలో గుర్తిస్తున్నారు. అయితే రెండు నోటిఫికేషన్ల ఫలితాలు రోజుల వ్యవధిలోనే రావడం వల్ల గ్రూప్-2 ఉద్యోగాల్లో అభ్యర్థులు చేరనందున తర్వాత వారికి అవకాశం ఇస్తే వారికి మేలు జరుగుతుందని అభ్యర్థులు అంటున్నారు.

శ్రీశైల పాదయాత్రికులకు తీపికబురు

▸▸ అటవీ మార్గంలో ప్రారంభమైన పాదయాత్ర

▸▸ ముందస్తు అనుమతులపై భక్తుల హర్షం



శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తున్న భక్తులు (ఫైల్)

ఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాలినడకన శ్రీశైలం తరలివెళ్లే భక్తులకు అటవీశాఖ తీపికబురు చెప్పింది. ఈ నెల 15 వరకు అటవీ మార్గం గుండా మల్లన్న క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్స్-2026లో భాగంగా నాగార్జునసాగర్- శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో జనవరి 3 నుంచి మే 31 వరకు మూడు దశల్లో పులుల లెక్కింపు చేపడుతున్నారు. తొలిదశలో భాగంగా ఈ నెల 10 వరకు మార్కాపురం, నంద్యాల, గిద్దలూరు, ఆత్మకూరు అటవీ డివిజన్ల పరిధిలోని పలు రేంజ్‌ల్లో ఫేజ్-3 కింద కెమెరా ట్రాప్స్ ఆధారంగా పులుల గణాంకాలను సేకరించనున్నారు. ఈ కారణంగా శ్రీశైలానికి నడిచి వెళ్లే భక్తులపై అటవీ శాఖ ఆంక్షలు విధించింది. ఫిబ్రవరి 8 నుంచి 15 వరకు మాత్రమే అటవీ మార్గంలో నడిచి వెళ్లేందుకు అవకాశం కల్పించింది. అయితే చాలా మంది భక్తులు, శివదీక్షాపరులు అంతకంటే ముందుగానే వస్తుండటంపై అటవీ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. వారిని ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి మీదుగా దోర్నాలకు వెళ్లి అక్కడినుంచి శ్రీశైలానికి వెళ్లాలని అధికారులు సూచించారు. ఇది ప్రయాసతో కూడిన ప్రయాణం కావడంతో భక్తులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 2న శ్రీశైలంలో జరిగిన మంత్రుల సమావేశంలో చర్చించారు. అనంతరం అటవీశాఖ ఉన్నతాధికారులు సమీక్షించి ఫిబ్రవరి 6 నుంచి 15 వరకు అటవీ మార్గంలో నడిచి వెళ్లేందుకు అనుమతించారు. దీంతో శుక్రవారం నుంచి పాదయాత్రికులు వెంకటాపురం నుంచి శ్రీశైలానికి బయలుదేరారు. అటవీశాఖ తీసుకున్న నిర్ణయంతో మల్లన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎన్‌సీఐఎస్ఎం చైర్‌పర్సన్ డాక్టర్ మనీషా కొటేకర్ (కుడి వైపు)

భారతీయ ఆయుర్వేదానికి ప్రపంచవ్యాప్త ఆదరణ

▸▸ వాప్‌కాన్ సదస్సులో ఎన్‌సీఐఎస్ఎం చైర్మన్ డాక్టర్ మనీషా

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆయుర్వేదానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్ఎం) చైర్‌పర్సన్ డాక్టర్ మనీషా కొటేకర్ పేర్కొన్నారు. ఆయుష్ శాఖ సహకారంతో విశ్వ ఆయుర్వేద పరిషత్, డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం (ఏయూ) సంయుక్తంగా నిర్వహిస్తున్న తొలి జాతీయ మహిళా ఆయుర్వేద పరిషత్ కాన్ఫరెన్స్(వాప్‌కాన్-2026)ను ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తొలిసారిగా మహిళల కోసం జాతీయ సదస్సు నిర్వహించడం, అందులో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. ఎన్‌సీఐఎస్ఎం ఆధ్వర్యంలో గురుకుల కేంద్రాలు, మహిళా గురుకుల కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయుర్వేద విద్యను అభ్యసించిన మహిళలంతా ప్రాక్టీస్ ప్రారంభించాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ... ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయుర్వేదం మరింత బలోపేతమైందన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ.. భారతీయ జ్ఞాన వ్యవస్థల్లో ఒకటిగా ఆయుర్వేదం నిలుస్తుందన్నారు.

విశ్రాంత తహసీల్దారుకు జైలు, జరిమానా

భీమునిపట్నం రూరల్(విశాఖపట్నం జిల్లా), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్ పుస్తకం జారీకి లంచం కేసులో అప్పటి భీమిలి తహసీల్దార్ ఎస్.సిద్ధయ్యకు ఏసీబీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. భీమిలి తహసీల్దార్‌గా సిద్ధయ్య 2014లో బాధ్యతలు చేపట్టారు. కృష్ణంరాజుపేట గ్రామానికి చెందిన సోదరులు ఎస్.వెంకటరావు, ఎస్.సత్యనారాయణ మజ్జివలస గ్రామంలో 33 సెంట్ల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. దానికి పట్టాదారు పుస్తకం కావాలని దరఖాస్తు చేశారు. తహసీల్దార్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సోదరులు ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు 2015 ఫిబ్రవరి 9న తహసీల్దార్ కార్యాలయానికి డబ్బుతో వెళ్లారు. లంచం తీసుకుంటుండగా సిద్ధయ్యను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

వైఫల్యాన్ని సవాలు చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. భారత ఆర్మీలో 'రుద్ర' యుద్ధ హెలికాప్టర్‌ను నడిపే తొలి మహిళా పైలట్‌గా జమ్మూ అమ్మాయి కెప్టెన్ హంసజ శర్మ రికార్డు సృష్టించారు.

భారత ఆర్మీ ధీర



రుద్ర ప్రత్యేకతలివి...

విధ్వంసక ఆయుధాలు: ఇందులో 20 ఎంఎం గన్, 70 ఎంఎం రాకెట్లతో పాటు శత్రు ట్యాంకులను నేల మట్టం చేసే 'హెలీనా' క్షిపణులు ఉంటాయి.

అధునాతన సెన్సార్లు: చీకట్లోనైనా, మంచు కురుస్తున్నప్పుడైనా శత్రువులను కనిపెట్టే థర్మల్ ఇమేజింగ్ వ్యవస్థ దీని సొంతం.

రక్షణ కవచం: పైలట్ కూర్చునే సీటు నుంచి ఇంధన ట్యాంకుల వరకు అన్నీ బుల్లెట్ ప్రూఫ్ సౌకర్యంతో ఉంటాయి. శత్రువుల క్షిపణి వస్తోందని ముందుగానే హెచ్చరించే వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

భారత సైన్యంలో మహిళలు కేవలం నిర్వహణ పరమైన పనులకే పరిమితం కాదని, యుద్ధరంగంలో శత్రువుల పని పట్టడంలోనూ సిద్ధమేనని మరోమారు నిరూపితమైంది. జమ్మూకు చెందిన 27 ఏళ్ల కెప్టెన్ హంసజ శర్మ భారత ఆర్మీలో 'రుద్ర' సాయుధ హెలికాప్టర్‌ను నడిపే అర్హత సాధించిన తొలి మహిళా పైలట్‌గా చరిత్ర సృష్టించారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన 2026 ఆర్మీ పరేడ్ డేలో ఆమె నేతృత్వంలోని 251 ఆర్మీ ఏవియేషన్ స్క్వాడ్రన్ ప్రదర్శించిన విన్యాసాలు దేశం గర్వించేలా చేశాయి.



వైఫల్యం నుంచి విజయానికి

హంసజ ప్రయాణం పూలబాట ఏమీ కాదు. ఆర్మీ ఎంపిక ప్రక్రియలో మొదట వైద్య కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యారు. చాలా మంది ఇక్కడే నిరాశ చెందుతారు. కానీ హంసజ పట్టు వదలలేదు. తన గది గోడపై 'నీపట్ల నువ్వు కఠినంగా ఉండు' అని రాసుకుని, కఠోర శ్రమతో తన లోపాలను సరిదిద్దుకున్నారు. ఏ కోచింగ్ లేకుండానే ఆర్మీ ప్రమాణాలను అందుకుని నాసిక్‌లోని ట్రైనింగ్ స్కూల్‌లో టాపర్‌గా నిలిచారు. ఉత్తమ యుద్ధ విమాన పైలట్‌కు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'సిల్వర్ చీతా' ట్రోఫీని అందుకున్న తొలి మహిళా అధికారిగా ఆమె రికార్డు సృష్టించారు.

శత్రు భయంకర... రుద్ర

హంసజ నడిపే ఈ రుద్ర హెలికాప్టర్ సామాన్యమైనది కాదు. ఇది మన దేశీయ సాంకేతికతతో తయారైన అద్భుతం. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) రూపొందించిన ఈ హెలికాప్టర్ భూమికి దగ్గరగా ఉంటూ శత్రువుల ట్యాంకులను, స్థావరాలను ధ్వంసం చేయగలదు. ముఖ్యంగా హిమాలయాల వంటి ఎత్తయిన ప్రాంతాల్లో, గడ్డకట్టే చలిలో కూడా ఇది అత్యంత సమర్థవంతంగా పని చేస్తుంది.

ఆకాశమే హద్దుగా

ఒకప్పుడు కేవలం పురుషులకే పరిమితమైన యుద్ధ విమాన పైలట్ బాధ్యతల్లోకి హంసజ వంటివారు రావడం భారత సైన్యంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు సంకేతం. ఇక్కడ ప్రతిభకు తప్ప మరివేటికీ ప్రాధాన్యం లేదని ఆమె నిరూపించారు. జమ్మూ వీధుల నుంచి యుద్ధ విమాన కాక్‌పిట్ వరకు ఆమె సాగించిన పయనం దేశంలోని లక్షలాదిమంది యువతులకు స్ఫూర్తిదాయకం. నింగిలో రుద్ర గర్జిస్తుంటే, ఆ స్టీరింగ్‌ను ఒక భారతీయ మహిళ ధైర్యంగా నడపడం మనందరికీ గర్వకారణం.

రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం... చేపల వంటకాలు. అయితే చేప రకాన్ని బట్టి వండే విధానం కూడా విభిన్నంగా ఉండాలి. అప్పుడే చేపల వంటకం రుచి అమోఘంగా ఉంటుంది. వేర్వేరు చేపలతో వండే వీలున్న వేర్వేరు వంటకాలు ఈ వారం మీకోసం...



వంటిల్లు

నోరూరించే చేపల కూరలు

వంజరం వేపుడు

కావలసిన పదార్థాలు:

కరివేపాకు - 2 రెమ్మలు
నెయ్యి లేదా నూనె - 2 టేబుల్ స్పూన్లు
చేప ముక్కలు - పావు కిలో
అల్లంవెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూను
పసుపు, ఉప్పు - తగినంత
నిమ్మరసం - అర చెక్క
కారం - అర టీస్పూను
గరం మసాలా - అర టీస్పూను

తయారీ విధానం:

- పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో వేసి, వాటిలో చేప ముక్కలు నానబెట్టాలి
- బాండీలో నూనె వేడిచేసి, ముందుగా కరివేపాకు వేయించి, తర్వాత చేప ముక్కలు వేయాలి
- చిన్న మంట మీద మూత ఉంచి చేప ముక్కలు మగ్గించుకోవాలి
- రెండు వైపులా సమంగా వేగేలా గరిటతో తిప్పుతూ ఉండాలి
- ఇలా పది నిమిషాల్లో చేప ముక్కలు పూర్తిగా ఉడికిపోతాయి
- తర్వాత వేడిగా వడ్డించాలి.

బొమ్మిడాయల ఇగురు



కావలసిన పదార్థాలు:

చేప ముక్కలు - 12
ఉప్పు - తగినంత
నూనె - 4 టేబుల్ స్పూన్లు
ఉల్లి ముక్కలు - 1 కప్పు
పచ్చిమిర్చి - 5
పసుపు - అర టీస్పూను
కారం - 2 టీస్పూన్లు
ధనియాల పొడి - 2 టే.స్పూన్లు
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూను
కొబ్బరి పేస్ట్ - అర కప్పు
గరం మసాలా - 1 టీస్పూను
కొత్తిమీర - కొద్దిగా
నీళ్లు - 3 కప్పులు

తయారీ విధానం:

- ఒక వెడల్పాటి గిన్నెలో చేప ముక్కలు, ఉప్పు, పసుపు, కారం, అల్లంవెల్లుల్లి ముద్ద, గరం మసాలా, ఉల్లి ముక్కలు, పచ్చిమిర్చి వేసి కలిపి పక్కనుంచాలి
- మందపాటి గిన్నెలో నూనె పోసి, మరిగిన తర్వాత చేప ముక్కల మిశ్రమం వేసి కలుపుకోవాలి
- పావు గంట పాటు చిన్న మంట మీద మూత పెట్టి చేప ముక్కలను మగ్గించుకోవాలి
- తర్వాత కొబ్బరి పేస్ట్, కొత్తిమీర, నీళ్లు వేసి నెమ్మదిగా కలపాలి
- మూత ఉంచి చిన్న మంట మీద 15 - 20 నిమిషాలపాటు కూర చిక్కబడేవరకూ ఉడికించి వేడిగా వడ్డించాలి.

సొర చేప పిట్టు

కావలసిన పదార్థాలు:

సొర చేపలు - 2
ఉల్లి ముక్కలు - 1 కప్పు
పచ్చిమిర్చి - 4
ఆవాలు, మినపప్పు - చెరొక స్పూను
జీలకర్ర - 1 టీస్పూను
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టీస్పూన్లు
గరం మసాలా - 1 టీస్పూను



పసుపు - 1 టీస్పూను
ఉప్పు - తగినంత
కొత్తిమీర - 1 కట్ట
నూనె - 2 టే.స్పూన్లు

తయారీ విధానం:

- గిన్నెలో చేప ముక్కలు, ఉప్పు, పసుపు, చేపలు మునిగేటన్ని నీళ్లు పోసి 10 నిమిషాలు ఉడికించాలి
- ఉడికిన తర్వాత ముక్కలు చిదిమి పక్కనుంచాలి
- బాండీలో నూనె పోసి మినపప్పు, ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి
- తర్వాత ఉల్లి ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించాలి
- తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేవరకూ వేయించాలి
- పసుపు, గరం మసాలా, ఉప్పు వేసి కలపాలి.
- తర్వాత కొత్తిమీర తరుగు వేసి కలిపి చేప పొడి వేయాలి.
- బాగా కలిపి చిన్న మంట మీద 5 నిమిషాలు మగ్గనివ్వాలి.

బిజినెస్

మార్కెట్‌కు ఆర్‌బీఐ బూస్ట్

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన ద్రవ్య విధానంశుక్రవారం మార్కెట్లలో ఉత్సాహం నింపింది. చివరి క్షణంలో లభించిన కొనుగోళ్ల మద్దతు మార్కెట్‌ను లాభాల బాటలో నడిపించింది. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 266.47 పాయింట్లు లాభపడి 83,580.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 82,925.35 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 50.90 పాయింట్ల లాభంతో 25,693.70 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 2,857.46 పాయింట్లు, నిఫ్టీ 868.25 పాయింట్లు లాభపడ్డాయి.

బంగారం, వెండి మరింత దిగువకు: లాభాల స్వీకారంతో బులియన్ మార్కెట్ మరింతగా పతనాలు చవి చూస్తూనే ఉంది. ఢిల్లీ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరింతగా దిగజారాయి. శుక్రవారం కిలో వెండి ధర రూ.13,000 దిగజారి రూ.2.55 లక్షల వద్ద స్థిరపడింది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర సైతం రూ.3,400 తగ్గి రూ.1,57,200 పలికింది.

ఎన్ఎస్ఈ ఐపీఓకు గ్రీన్‌సిగ్నల్: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఇష్యూ జారీ చేసేందుకు రంగం సిద్ధం అవుతోంది. తాజా షేర్ల జారీ జోలికి పోకుండా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఇష్యూ జారీ చేసేందుకు ఎన్ఎస్ఈ బోర్డు శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇష్యూ జారీ చేసుకునేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ సెబీ ఇప్పటికే ఒక సర్టిఫికెట్ జారీ చేసింది. ఐపీఓ ప్రక్రియ ఎలాంటి అవరోధాలు లేకుండా సాగిపోయేందుకు వీలుగా ఐపీఓ కమిటీని పునర్నిర్మించేందుకు కూడా ఆమోదం తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	515
వరంగల్	497	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	135	విజయవాడ	133
వరంగల్	135	గుంటూరు	133
కరీంనగర్	135	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	108
కర్నూలు	135	నెల్లూరు	113
విశాఖపట్నం	125	అనంతపురం	113
గోదావరి	133		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,52,350 ▼	1,39,650 ▼	2,70,000 ▼
విజయవాడ	1,58,500 ▲	1,46,500 ▲	2,52,000 ▼
విశాఖపట్నం	1,57,150 ▼	1,39,650 ▼	2,80,000 ▼
రాజమండ్రి	1,53,710 ▼	1,40,900 ▼	2,50,000 ▼
ప్రొద్దుటూరు	1,57,500 ▼	1,44,900 ▼	2,52,000 ▼
ముంబై	1,52,078 ▼	1,39,303 ▼	2,44,929 ▼

రెపో.. లేదు మార్పు

5.25 శాతంగా కొనసాగింపు.. రేట్లపై తటస్థ వైఖరి అలాగే..

- ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- ఏప్రిల్ 6-8 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: బ్యాంకు రుణాలకు ప్రామాణికమైన రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. దాంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం లేకుండా పోయింది. ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సమావేశమైన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. అంతేకాదు, పరపతి విధానంపై తటస్థ వైఖరిని కూడా కొనసాగించాలని ఎంపీసీ నిర్ణయించింది. తద్వారా కమిటీ వడ్డీ రేట్లు మరికొంత కాలం కనిష్ఠ స్థాయిలోనే కొనసాగనున్నాయని సంకేతాలిచ్చింది.

వాణిజ్య ఒప్పందాలతో ఆర్థికానికి ఊతం: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టాక ఆర్‌బీఐ నిర్వహించిన మొదటి పరపతి సమీక్ష ఇది. అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో వాణిజ్య ఒప్పందాలు కుదిరిన తర్వాత జరిగిన తొలి సమీక్ష కూడా. అంతర్జాతీయ ప్రతికూలతలు మరింత పెరిగినప్పటికీ, అమెరికా, ఈయూతో వాణిజ్య ఒప్పందాలు కుదరడం మన ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా పరిణమించనుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు.

క్యూ1, క్యూ2 వృద్ధి అంచనాలు పెంపు: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, పంట దిగుబడి భారీగా పెరగడంతో పాటు అమెరికా, ఈయూతో వాణిజ్య ఒప్పందాలు కుదరిన నేపథ్యంలో ఆర్‌బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో మొదటి త్రైమాసికం (క్యూ1) జీడీపీ వృద్ధి అంచనాను 6.7 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. రెండో త్రైమాసిక (క్యూ2) వృద్ధి అంచనాను కూడా 6.8% నుంచి 7 శాతానికి పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.4 శాతంగా నమోదు కావచ్చని అంచనా.

ద్రవ్యోల్బణం అంచనా కూడా పైకి: బంగారం, వెండి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ ఆర్థిక సంవత్సరాని (2025-26)కి రిటైల్ ధరల ద్రవ్యోల్బణం అంచనాను డిసెంబరులో ప్రకటించిన 2 శాతం నుంచి 2.1 శాతానికి పెంచింది. ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి (క్యూ1) అంచనాను 3.9 శాతం నుంచి 4 శాతానికి, రెండో త్రైమాసికానికి (క్యూ2) అంచనాను 4 శాతం నుంచి 4.2 శాతానికి పెంచింది.

రీట్స్‌కు బ్యాంక్ రుణాలు: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు కూడా బ్యాంక్‌లు రుణాలిచ్చేందుకు అనుమతించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇది రీట్స్ నిర్వహణ సంస్థలకు నిధుల సమీకరణ అవకాశాలను మరింత విస్తృతం చేయనుంది. తాము దీర్ఘకాలిక మూలధన నిధుల సమీకరించేందుకు ఆర్‌బీఐ తాజా ప్రతిపాదన దోహదపడనుందని రీట్స్ నిర్వహణ సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి.

చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు ఊరట: రూ.1,000 కోట్లలోపు ఆస్తులు, ప్రజా నిధులు లేని చిన్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ)ను తప్పనిసరి రిజిస్ట్రేషన్ నుంచి మినహాయించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఈ నిర్ణయం చిన్న ఎన్‌బీఎఫ్‌సీలపై నిబంధనల భారాన్ని తగ్గించనుంది. సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు మార్గదర్శకాల సవరణ ముసాయిదాను త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపింది. అంతేకాదు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలకు 1,000కి పైగా శాఖల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధనను తొలగించనున్నట్లు తెలిపింది.

బంగారం రుణాలపై ఆందోళన అక్కర్లేదు..

గడిచిన కొన్ని రోజులుగా విలువైన లోహాల ధరలు తీవ్ర ఊగిసలాటలకు లోనవుతున్నప్పటికీ, బంగారం తనఖా రుణ బకాయిల విషయంలో ఆందోళన అక్కర్లేదని మల్హోత్రా అన్నారు. బంగారం ధరలు శరవేగంగా పెరుగుతూ వచ్చిన సమయంలో గోల్డ్ లోన్స్ వ్యాపారం అదే స్థాయిలో వృద్ధి చెందుతూ వచ్చింది. 2025 నవంబరుతో ముగిసిన రెండేళ్లలో బంగారం తనఖారుణాల బకాయిలు దాదాపు రెండింతలయ్యాయి.

ఎంఎస్ఎంఈలకు రూ.20 లక్షల తనఖా రహిత రుణం

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు తనఖా రహిత రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా ప్రకటించారు. ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు 2026 ఏప్రిల్ 1న లేదా ఆ తర్వాత మంజూరైన లేదా పునరుద్ధరించబడిన అన్ని రుణాలకు ఇది వర్తిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.



దీర్ఘకాలంపాటు చవక రేట్లే..!

రెపో రేటు దీర్ఘకాలం పాటు కనిష్ఠ స్థాయిలోనే కొనసాగనుంది. భవిష్యత్‌లో మరింత తగ్గేందుకూ అవకాశం ఉంది. అయితే, రెపో రేటు సవరణపై మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. అమెరికా, ఈయూతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలతో పాటు ఇతర సానుకూల అంశాలు 0.20 శాతం అదనపు జీడీపీ వృద్ధికి దోహదపడవచ్చు.

- సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ గవర్నర్

డిజిటల్ మోసాల బాధితులకు రూ.25,000 వరకు పరిహారం

దేశంలో డిజిటల్ మోసాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. మోసపూరిత లావాదేవీ బాధిత బ్యాంక్ కస్టమరుకు రూ.25,000 వరకు పరిహారం చెల్లించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. మోసగాళ్లతో ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్) పంచుకున్న బాధిత కస్టమర్లకూ పరిహారం చెల్లించడం జరుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. రూ.85,000 కోట్ల డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ నుంచి ఈ పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. డిజిటల్ మోసాల బాధితులకు జీవితంలో ఒక్కసారే ఈ పరిహారం లభిస్తుందని, ఇందులో ఎలాంటి దురుద్దేశం కనబడని పక్షంలోనే పరిహారానికి అర్హులని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేశారు. మెజారిటీ డిజిటల్ మోసాల బాధితులు ఈ ప్రతిపాదనతో లబ్ధి పొందనున్నారని ఆర్‌బీఐ అంటోంది. ఎందుకంటే, మూడింట రెండొంతుల డిజిటల్ మోసాల విలువ రూ.50,000 లోపేనని పేర్కొంది. ఒకవేళ మోసపోయిన మొత్తం రూ.25,000 లోపే అయినప్పటికీ, అందులో 15 శాతం బ్యాంక్ ఖాతాదారే భరించాల్సి ఉంటుందని, అధిక మొత్తంలో మోసపోయిన వారికి మాత్రం గరిష్ఠంగా రూ.25,000 పరిహారం చెల్లించడం జరుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాల ముసాయిదాను త్వరలోనే విడుదల చేసి, ప్రజాభిప్రాయాలను కోరనున్నట్లు ఆయన చెప్పారు. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు అదనపు భద్రత సాధనాలను ప్రవేశపెట్టనున్నట్లు మల్హోత్రా తెలిపారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నెమ్మదిగా నగదు జమ చేయడం, సీనియర్ సిటిజన్లు ఈ మోసాల బారిన పడకుండా ఉండేందుకు వీరు బ్యాంక్ లావాదేవీలు నెరిపే సమయంలో అదనపు ధ్రువీకరణను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

కార్ల ధరలు పెరుగుతాయ్..

- రూపాయి పతనమే కారణం.. ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా.. సమీప భవిష్యత్తులో కార్ల ధరలు పెంచే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. శుక్రవారం నాడిక్కడ హైదరాబాద్‌లో ఆడి రెండో షోరూమ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ.. గడిచిన కొంత కాలంగా రూపాయి దాదాపు 19 శాతం మేర పతనం కావటం ధరల పెంపునకు కారణంగా ఉండనుందన్నారు. ఇప్పటికే రూపాయి పతనంతో రెండు దఫాలు ధరలు 3-4 శాతం వరకు పెంచామని, త్వరలోనే మరోసారి ధరలు పెంచాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ధరల పెంపు ఎంత మేరకు ఉంటుందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఈయూతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ అది అమల్లోకి రావటానికి సమయం పడుతుందన్నారు. ఒప్పందం పూర్తి గా అమల్లోకి వచ్చిన తర్వాతే ధరల తగ్గింపు వంటి అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని బల్బీర్ తెలిపారు. కాగా ఆడి గ్లోబల్ ప్రోగ్రెసివ్ షోరూమ్ కాన్సెప్ట్‌తో వీవీసీ మోటార్స్‌తో కలిసి హైదరాబాద్‌లో రెండో షోరూమ్‌ను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. కాగా వచ్చే నెలలో మార్కెట్లోకి కొత్త స్పోర్ట్స్ మోడల్ కారును విడుదల చేయనున్నట్లు బల్బీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవీసీ మోటార్స్ గ్రూప్ ఎండీ వీవీ రాజేంద్ర ప్రసాద్, ఆడి హైదరాబాద్ సెంట్రల్ డీలర్ ప్రిన్సిపల్ వికాస్ చౌదరి పాల్గొన్నారు.



వరల్డ్ ఫేవరేట్ జువెలర్ జోయాలుక్కాస్.. విశాఖపట్నంలో 'బ్రిలియన్స్ డైమండ్ జువెలరీ షో'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని జోయాలుక్కాస్ రిటైల్ హెడ్ రాజేశ్ కృష్ణన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కస్టమర్లు పాల్గొన్నారు.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.1,003 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,003 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.52 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 26.9% పెరగగా లాభం 44% క్షీణించింది. డిసెంబరు త్రైమాసికంలో నిలకడైన పనితీరును కనబరిచామని, అన్ని హాస్పిటల్స్‌లో పేషంట్ల సంఖ్య పెరుగుతూ వచ్చిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంచి వృద్ధిని సాధించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర్ రావు తెలిపారు.

కోడర్లూ.. వేరే దారి చూసుకోండి!



- కోడింగ్ చేసే టెకీలకు జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ సూచన
- ఏఐతో ఒక వ్యక్తి భగవద్గీత యాప్‌ను అభివృద్ధి చేయడంపై పోస్ట్

చెన్నై, ఫిబ్రవరి 6: నానాటికీ వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ కోడింగ్ సామర్థ్యం నేపథ్యంలో.. కోడింగ్ చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంతా వేరే బతుకుతెరువు చూసుకోవాల్సిందేనని 'జోహో' వ్యవస్థాపకుడు, ప్రముఖ ఐటీ నిపుణుడు శ్రీధర్ వెంబు సూచించారు. ఎలాంటి ఒకోడింగ్ సామర్థ్యమూ లేకుండా క్లాడ్ ఏఐ సాయంతో భగవద్గీత యాప్‌ను రూపొందించిన ఒక యూజర్ పోస్టును శ్రీధర్.. తన 'ఎక్స్' ఖాతాలో రీపోస్ట్ చేశారు. "ఈ పోస్ట్ భగవద్గీత యాప్ గురించి. ఆంత్రోపిక్ సంస్థ తన క్లాడ్ ఏఐ సహాయంతో పూర్తి 'సి' కంపైలర్‌ను అభివృద్ధి చేసింది. సామాన్యమైన ఇంజినీరింగ్ విజయం కాదిది. ఈ తరుణంలో.. జీవనోపాధి కోసం కోడింగ్‌పై ఆధారపడుతున్నవారంతా ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు వెతుక్కోవడం మంచిది... నాతో సహా. ఈ మాట నేను భయాందోళనలతో చెబుతున్నది కాదు. ప్రశాంతమైన అంగీకారంతో, మార్పును స్వీకరించాలనే ఉద్దేశంతో చెబుతున్న మాట ఇది" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. ఏఐ విప్లవం నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏవిధంగా రూపాంతరం చెందుతోందనే అంశంపై తాను గూగుల్ జెమినై చాట్‌బాట్‌తో సవివర చర్చ జరిపానని తెలుపుతూ.. ఆ వివరాలను తన పోస్ట్‌లో షేర్ చేశారు. అందులో ఆయన జెమినై చాట్‌బాట్‌తో.. 'పోస్ట్ లేబర్ ఎకానమీ (శ్రమ లేని ఆర్థిక వ్యవస్థ)'లో సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందనే అంశంపై చర్చించడం గమనార్హం. దాంతో తాను చర్చిస్తుంటే.. అత్యంత తెలివైన ఆర్థిక తత్వవేత్తతో చర్చిస్తున్నట్టు అనిపించిందని.. తన పని గురించి తననే విమర్శించుకోవాల్సిందిగా తాను సూచిస్తే, ఏఐ ఆ పనిని అద్భుతంగా చేసిందని వెంబు వివరించారు. దాంతో జరిపిన సంభాషణ ఆధారంగా.. ఈ సాంకేతికత ఎవరి అధీనంలో ఉంటుంది? దీని ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చెందుతుందనే అంశాలను బట్టి భవిష్యత్తును రెండు రకాలుగా ఊహించారాయన. అందులో ఒకటి ఆశావహ దృక్పథం కాగా.. మరొకటి నిరాశావాదంతో కూడినది. మొదటి తరహా భవిష్యత్తులో అయితే.. ఈ టెక్నాలజీ మనందరి జీవితాల్లో భాగమైపోయి, మనం పని గురించి ఆలోచించాల్సిన అవసరం లేకుండా జీవితంపైన, కుటుంబం, ప్రకృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలు, క్రీడలు, పండుగలు, విశ్వాసాల వంటివాటిపై హాయిగా దృష్టి కేంద్రీకరించవచ్చని పేర్కొన్నారు. నిరాశావాద దృక్పథంతో ఆలోచిస్తే.. టెక్నాలజీ కొందరి చేతుల్లోకి వెళ్లి కేంద్రీకృత నియంత్రణకు దారితీస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. అయితే.. ఆయన అభిప్రాయాలతో పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు విభేదించారు. ఏఐ ఎంత వేగంగా కోడింగ్ చేసినా అందులో ఏవైనా తప్పులు వస్తే అది బాధ్యత వహించదని, ఆ కోడ్ సరిగా ఉందీ లేనిదీ చూడాల్సింది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లేనని అభిప్రాయపడ్డారు.

నేడు ఓలా, ఊబర్, ర్యాపిడో డ్రైవర్ల సమ్మె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఓలా, ఊబర్, ర్యాపిడో తదితర ప్లాట్‌ఫాంలలో పనిచేస్తున్న బైకులు, ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లు 7వ తేదీ, శనివారం దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఆయా యాప్‌ల ఆధారంగా పని చేస్తున్న డ్రైవర్లు కనీసం ఆరు గంటలపాటు తమ సేవలను బహిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన ఈ దేశవ్యాప్త సమ్మెకు పలు కార్మిక సంఘాలు మద్దతు పలికాయి. కనీస చార్జీలు, మెరుగైన పని పరిస్థితులు, ప్రైవేటు వాహనాలను వాణిజ్య అవసరాలకు వాడడాన్ని నిరోధించాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె ప్రభావం ఒక్కో నగరంలో ఒక్కో విధంగా ఉంటుంది. ఆటోలు, క్యాబ్‌లపై ఎక్కువగా ఆధారపడిన నగరాల్లో ఈ ప్రభావం విస్తృతంగా ఉండవచ్చు. ఆయా యాప్‌లపై ఆధారపడి నిత్యం ప్రయాణించేవారు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టకపోతే ఇబ్బంది పడే అవకాశముంది.

రష్యా మిలిటరీ ఉన్నతాధికారిపై కాల్పులు

మాస్కో, ఫిబ్రవరి 6: రష్యా సైనిక నిఘా విభాగం (జీఆర్‌యూ) లక్ష్యంగా మరోసారి దాడి జరిగింది. రష్యా మిలిటరీ ఇంటెలిజెన్స్ ఫస్ట్ డిప్యూటీ హెడ్ లెఫ్టినెంట్ జనరల్ వ్లాదిమిర్ అలెక్సీవ్ (64)పై శుక్రవారం గుర్తుతెలియని దుండగుడు కాల్పులు జరిపాడు. మాస్కోలోని వాయువ్య ప్రాంతంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అలెక్సీవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యాలోని సీనియర్ సైనిక అధికారులే లక్ష్యంగా జరుగుతున్న వరుస దాడుల్లో భాగంగానే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అలెక్సీవ్ 2011 నుంచి రష్యా మిలిటరీ ఇంటెలిజెన్స్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అబుదాబిలో రష్యా, ఉక్రెయిన్, అమెరికా దేశాల మధ్య రెండు రోజుల చర్చలు ముగిసిన మరుసటి రోజే ఈ దాడి జరగడం గమనార్హం.

ఢిల్లీలో గుంతలో పడి యువకుడి మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఢిల్లీలో బైక్ నడుపుతూ కమల్ ధయానీ(25) అనే యువకుడు రోడ్డు మధ్యలో తవ్విన 15 అడుగుల గొయ్యిలో పడి చనిపోయాడు. ఢిల్లీలోని జానకిపురి ప్రాంతంలో గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. కమల్ కైలాస్‌పురిలో నివాసం ఉంటున్నాడు. ప్రైవేటు బ్యాంకు కాల్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తూ గుంతలో పడిపోయాడు. ఢిల్లీ జల్ బోర్డు ఈ గొయ్యిని తవ్వింది. అయితే, కమల్ ప్రయాణించిన రోడ్డును ఐదు రోజులుగా మూసివేశారని, గొయ్యిని గురువారమే తవ్వారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ముగ్గురు జల్ బోర్డు ఇంజనీర్లను సస్పెండ్ చేసింది.



కమల్ పడిపోయిన గుంత

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి.. దగ్ధమైన బస్సు

- 40 మంది ప్రయాణికులు క్షేమం

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారులో, 48వ నంబరు జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన వెంటనే మొత్తం 40 మంది ప్రయాణికులు కిందకు దిగిపోగా, కాసేపటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు నుంచి కలబురిగికి వెళుతున్న సంజనా ట్రావెల్స్ బస్సు నెలమంగల సమీపంలోని హనుమంతపుర గేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పి మొదట డ్రైనేజీ స్లాబ్‌ను ఢీకొంది. ఆ తరువాత పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పరుగున వెళ్లి ప్రయాణికులు బయట పడేందుకు సహకరించారు.


పరీక్ష కేంద్రం ఎంపికలో దివ్యాంగులకు సౌలభ్యం: యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దివ్యాంగ అభ్యర్థుల (పీడబ్ల్యూబీడీ) కోసం యూపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. వీరికి పరీక్ష కేంద్రాల కేటాయింపు విధానాన్ని సవరించింది. కొత్త విధానం ప్రకారం బెంచ్ మార్క్ వైకల్యాలు ఉన్న దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష కేంద్రం సామర్థ్యంపై ఎలాంటి పరిమితి ఉండదు. సదరు కేంద్రం గరిష్ఠ సామర్థ్యాన్ని చేరుకున్న తర్వాత కూడా ఈ విభాగంలోని వారు దాన్ని ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. అదే సమయంలో నాన్ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు మాత్రం ఈ అవకాశం ఉండదని యూపీఎస్సీ తెలిపింది. పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు వారు కోరుకున్న కేంద్రాన్ని కేటాయించడంలో భాగంగా అవసరమైనచోట దాని సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొంది.

పరీక్షలు పండుగల్లాంటివి.. వాటిని ఉత్సవంలా జరుపుకోవాలి

- 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: "అందరూ చెప్పే సలహాలు వినండి. వాటిలో మీకు సరిపోయేవి ఎంచుకోండి. మీకు నచ్చిన విధంగా మీ జీవనశైలిని మార్చుకోండి. చదువు ఒక భారంగా అనిపించకూడదు. కేవలం మార్కులపైనే కాకుండా జీవితాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టండి" అని విద్యార్థులకు ప్రధాని మోదీ సూచించారు. పరీక్షలకు ముందు విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో శుక్రవారం నిర్వహించిన 'ప్రధానితో పరీక్షా పే చర్చ-2026' తొమ్మిదో ఎడిషన్‌లో భాగంగా ఆయన వారితో సంభాషించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మోదీ పలు సూచనలు చేశారు. పరీక్షలు పండుగల్లాంటివని, వాటిని ఉత్సవాల తరహాలో జరుపుకోవాలని చెప్పారు. "మనం ఎంచుకున్న లక్ష్యం చేరుకోగలిగేలా ఉండాలి. కానీ సులభంగా సాధించగలిగేదిగా ఉండకూడదు. ముందుగా పూర్తి ఏకాగ్రతతో మనసును అదుపులో పెట్టుకోండి. తర్వాత చదవాల్సిన అంశాలపై దృష్టి నిలిపితే విజయం ఎప్పుడూ మీ వెంటే ఉంటుంది" అని దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తన నివాసానికి వచ్చిన విద్యార్థుల బృందానికి మోదీ సూచించారు.



సోషల్ మీడియాకు వయో పరిమితి?



త్వరలో ప్రభుత్వ నిర్ణయం.. కేంద్ర ఐటీ కార్యదర్శి వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: చిన్న పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు వయో పరిమితులు విధించే విషయంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వయసు ఆధారంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగానికి అనుమతి ఇచ్చే విషయంలో ఇటీవల ఆర్థిక సర్వే పలు సూచనలు చేసిందని, ఆ సర్వే అభిప్రాయాలన్నింటిని ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. వయసు పరిమితి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నెట్ కార్పొరేషన్ ఫర్ అసైన్డ్ నేమ్స్ అండ్ నంబర్స్ (ఐసీఏఎన్ఎన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలు ఇంటర్నెట్‌ను వినియోగించే విషయంలో ఆస్ట్రేలియా తరహా చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు వయసు నిబంధనలతో పాటు డిజిటల్ వ్యసనాన్ని తగ్గించడానికి ఆన్‌లైన్ టీచింగ్‌ను కూడా తగ్గించాలని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణను చేయాలని, డిజిటల్ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు వీలుగా పిల్లలకు విద్యా విషయాలను అందించే సులువైన పరికరాలను ప్రోత్సహించాలని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. హానికరమైన కంటెంట్‌కు పిల్లలు ప్రభావితమవుతారని, వయసు ధ్రువీకరణ బాధ్యతను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లే వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ సర్వే విడుదల సందర్భంగా చీఫ్ ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వినియోగానికి వయసు నిబంధనలు తెచ్చే ఆలోచనలో ఆంధ్రప్రదేశ్, గోవా ప్రభుత్వాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇటీవల ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం, కొరియా కల్చర్ మోజుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆన్‌లైన్ కంటెంట్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.


ఐదో రోజూ అదే తీరు

లోక్‌సభలో సాగని కార్యకలాపాలు



- బడ్జెట్‌పై ప్రారంభం కాని చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో వరుసగా ఐదో రోజు కూడా లోక్‌సభలో అదే గందరగోళం నెలకొంది. ఆర్మీ మాజీ అధ్యక్షుడు ఎంఎం నరవణె ఆత్మకథ గ్రంథంలోని అంశాలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రస్తావించగా, అధికార పక్షం అడ్డుకోవటంతో మొదలైన రభస శుక్రవారం కూడా కొనసాగింది. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ, సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. సభ నిర్వహణకు సహకరించాలని స్పీకర్ ఓంబిర్లా పదే పదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి అనుమతి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సభ ప్రారంభమైన 5 నిమిషాలకే వాయిదా పడింది. నిరసల మధ్య చివరికి సభను సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని సమాధానం లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించిన విషయం తెలిసిందే. శుక్రవారం సాధారణ బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కావాల్సి ఉన్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో చర్చ చేపట్టలేదు. కాంగ్రెస్‌తోపాటు ఇతర విపక్ష ఎంపీలు మకర ధ్వజం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ఒక 'ట్రాప్ డీల్' అని ఆరోపించారు. రాజ్యసభలో కూడా శుక్రవారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రాజ్యసభలో గురువారం ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తాము అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ము, ధైర్యం ఆయనకు లేవన్నారు. అసత్యాలు వల్లెవేయడమే ఆయన పని అని ఎద్దేవాచేశారు. ఖర్గే శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. '97 నిమిషాల ప్రసంగంలో మోదీ అవసరం, ముఖ్యమైనదేదీ చెప్పలేదు. ఎంతసేపూ వందేళ్లు.. 75 ఏళ్లు.. 50 ఏళ్లు అని మాట్లాడతారు" అని ఎద్దేవా చేశారు.



అమెరికాలో 25 వేల మంది 'విదేశీ నేరగాళ్ల' అరెస్టు

వీరిలో భారత సంతతికి చెందిన 89 మంది

న్యూయార్క్, ఫిబ్రవరి 6: అక్రమ పద్ధతుల్లో అమెరికాకు చేరుకుని చట్టవ్యతిరేక, నేర పూరిత చర్యలకు పాల్పడుతున్న విదేశీయుల జాబితాను ట్రంప్ ప్రభుత్వం విడుదల చేసింది. హత్యలు, లైంగిక నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా తదితర తీవ్ర నేరాలకు పాల్పడ్డారంటూ 25 వేలమందిని ఈ జాబితాలో చేర్చారు. భారత్ సంతతికి చెందిన 89 మంది కూడా ఆ జాబితాలో ఉన్నారు. 'అక్రమ నేర పూరిత విదేశీయుల' లిస్టులో వీరిని చేర్చారు. వీరందరినీ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అరెస్టు చేసింది. అరెస్టు చేసిన వ్యక్తి పేరు, దేశం, నేర చరిత్ర వంటి వివరాలను ఫొటోతో సహా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తూ, విస్తృత ప్రచారం కల్పిస్తోంది. దీనివల్ల నేరాలకు పాల్పడుతున్న విదేశీయుల వివరాలు అమెరికా పౌరులు తెలుసుకుంటారని 'డీహెచ్ఎస్' అధికారులు తెలిపారు. చివరి విదేశీ నేరగాడిని ఏరివేసేవరకు తనిఖీలు కొనసాగుతాయని డీహెచ్ఎస్ స్పష్టం చేసింది.

అణ్వాయుధాల అగ్ని-3 పరీక్ష సక్సెస్

బాలాసోర్ (ఒడిశా), ఫిబ్రవరి 6: విజయాలతో భారత రక్షణ శాఖ దూసుకెళ్తోంది. అణ్వాయుధాలను తీసుకెళ్లే అగ్ని-3 బాలిస్టిక్ క్షిపణిని శుక్రవారం విజయవంతంగా ప్రయోగించింది. 17 మీటర్ల పొడవు ఉండే ఈ క్షిపణికి 1.5 టన్నుల బరువున్న ఆయుధాలను తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. 3వేల కి.మీ.కిపైగా దూరంలో ఉన్న లక్ష్యాన్ని గురితప్పకుండా ఛేదించగలగడం దీని ప్రత్యేకత. నేలపై నుంచి నేలపైకి దాడి చేసే ఈ క్షిపణిని సంచార లాంచర్ ద్వారా ఒడిశాలోని చండీపూర్ తీరంలో ప్రయోగించారు. ఆటో లాంచ్ కమాండ్ ఇవ్వగానే నిర్ణీత మార్గంలో వెళ్లి బంగాళాఖాతంలో నిర్దేశించిన లక్ష్యాన్ని అగ్ని-3 క్షిపణి చాలా కచ్చితత్వంతో ఛేదించిందని డీఆర్‌డీఓ వర్గాలు తెలిపాయి.

ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

- 69 మంది మృతి.. 169 మందికి గాయాలు
- షియాలకు చెందిన మసీదులో భారీ పేలుడు
- ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు పాక్ పర్యటనలో ఉండగానే ఘటన

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ శుక్రవారం భీకర ఆత్మాహుతి దాడితో దద్దరిల్లింది. తర్లై ప్రాంతంలో షియా ముస్లింలకు చెందిన ఖదీజ తుల్ కుబ్రా మసీదు, ఇమాంబర్గా(అషూర్‌ఖానా)లో గుర్తుతెలియని ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చేసుకోవటంతో 69 మంది మరణించారు. 169 మంది గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో మసీదులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆత్మాహుతి బాంబర్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవటంతో గేటువద్ద అతడు ఈ దాడికి పాల్పడ్డాడు. తనను తాను పేల్చేసుకోవటానికి ముందు అతడు కాల్పులు కూడా జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ పాకిస్థానీ జియో న్యూస్ టీవీ తెలిపింది. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)తోపాటు ఇతర ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకావం ఉందని అధికారులు తెలిపారు. నగరం మొత్తం అత్యవసర పరిస్థితి ప్రకటించారు. పేలుడు తీవ్రత అధికంగా ఉండటంతో ఘటనా స్థలంలో పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. ఘటనా స్థలంలో చెల్లాచెదరుగా పడి ఉన్న మృతదేహాలు, శరీర భాగాల వీడియోలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. ఈ దాడికి బాధ్యత వహిస్తూ వెంటనే ఎవరూ ప్రకటన చేయలేదు. అయితే, ఇది తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ) పని అయి ఉండొచ్చని పోలీస్ వర్గాలు తెలిపాయి. రెండు రోజుల పర్యటన కోసం పాకిస్థాన్‌కు వచ్చిన ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఇస్లామాబాద్‌లో ఉండగానే ఈ దాడి జరగటం సంచలనం సృష్టించింది.

ప్రజలు తిరస్కరించినా ప్రచారం కోసం ప్రయత్నమా?

- జన్‌సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టు చురకలు
- 'అసెంబ్లీ ఎన్నికల రద్దు' పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్‌సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ ఆ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. 'మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు. అయినా మీరు ప్రచారం కోసం న్యాయ వేదికను వాడుకోవాలనుకుంటున్నారా..?' అంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన జన్‌సురాజ్ పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత.. ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున నగదు బదిలీ చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిందని జన్‌సురాజ్ ఆరోపించింది. ఎన్నికలు చెల్లవంటూ ప్రకటించాలని కోరింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బిహార్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

ఇటు చర్చలు.. అటు ఆంక్షలు!

ఇరాన్‌పై ఒత్తిడి పెంచిన అమెరికా

- ఇరాన్ చమురు సరఫరా చేసే 15 సంస్థలు, ఇద్దరు వ్యక్తులు, 14 ట్యాంకర్లపై ఆంక్షలు

వాషింగ్టన్/టెహ్రాన్/మస్కట్, ఫిబ్రవరి 6: ఇరాన్‌లో ఖొమైనీ నేతృత్వంలోని ప్రభుత్వంపై అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచింది. శుక్రవారం మధ్యాహ్నం కువైట్‌లో ఒమన్ మధ్యవర్తిత్వంతో చర్చలు జరిపింది. కొన్ని గంటల్లోనే ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. అదే సమయంలో పశ్చిమాసియాకు సైనిక బలగాల తరలింపునూ కొనసాగించింది. ఇరాన్‌తో చర్చలు విఫలమైతే బలప్రయోగానికి వెనుకాడబోమని అమెరికా అధ్యక్ష కార్యాలయం ప్రతినిధి కరోలిన్ లీవిట్ ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం ఒమన్ రాజధాని కువైట్‌లో.. ఒమన్ మధ్యవర్తిత్వంలో అమెరికా, ఇరాన్ మధ్య పరోక్ష చర్చలు జరిగాయి. తొలుత ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, అధికారులతో ఒమన్ విదేశాంగ మంత్రి అల్బుసైది చర్చించారు. తర్వాత అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, కుష్నర్‌లతో భేటీ అయి చర్చించారు. అణు అంశాలు, ప్రాంతీయ భద్రతపై ఇరువర్గాల వాదనలు, సానుకూల అంశాల సమాచారాన్ని పరస్పరం అందించారు. ఈ చర్చలు సానుకూలంగా సాగాయని, మంచి ప్రారంభమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. కానీ రాత్రి కల్లా ఇరాన్‌పై అమెరికా ఆంక్షల ప్రకటన చేసింది.



మస్కట్‌లో చర్చల కోసం వెళ్లిన ఇరాన్ ప్రతినిధులు

భారత సంస్థ, భారతీయ డైరెక్టర్‌పైన కూడా

ఇరాన్ నుంచి చమురు తరలింపుపై ఆంక్షలు ఉన్నా.. తప్పుడు గుర్తింపుతో దొంగచాటుగా చమురు సరఫరా చేస్తున్నారంటూ.. 15 సంస్థలు, 14 భారీ రవాణా ట్యాంకర్లపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. ఆ సంస్థలు, ట్యాంకర్లు ఇరాన్ నుంచి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, పెట్రో రసాయనాలను తరలిస్తున్నట్టు గుర్తించామని పేర్కొంది. చమురు, సంబంధిత ఉత్పత్తుల విక్రయాలతో వచ్చే సొమ్మును ఇరాన్ ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులను ఎగదోయడానికి వినియోగిస్తోందని ఆరోపించింది. కాగా, అమెరికా ఆంక్షలు విధించిన సంస్థలు, వ్యక్తుల్లో భారత్‌కు చెందిన ఎలివేట్ మెరైన్ మేనేజ్‌మెంట్ కంపెనీతోపాటు ఈ సంస్థ డైరెక్టర్ ఆకాశ్ అనంత్ షిండే ఉన్నారు.


భారత్-అమెరికా ఒప్పందం.. చైనాకు 'చమురు' లాభం!

- ఒక్కో బ్యారెల్‌కు 12 డాలర్ల డిస్కౌంట్

న్యూఢిల్లీ/మాస్కో, ఫిబ్రవరి 6: అమెరికా చెబుతున్నట్టుగానే రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు భారీగా తగ్గిపోతున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే.. గత ఏడాది డిసెంబరులో దిగుమతులు 27.5శాతం తగ్గిపోయాయి. దీనితో రష్యా చమురు అమ్ముకోవడానికి చైనాపై ఫోకస్ చేసింది. ఏకంగా బ్యారెల్‌కు 12 డాలర్ల డిస్కౌంట్ ఆఫర్ చేసింది. మొత్తానికి భారత్-అమెరికా ఒప్పందం షరతుల నుంచి లాభం చైనా ప్రయోజనం పొందుతోంది. గత ఏడాది ఆగస్టులో భారత్‌పై సుంకాలను 50శాతానికి పెంచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేస్తే సుంకాలు తగ్గిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై ప్రకటన చేసిన సందర్భంగా రష్యా నుంచి చమురు దిగుమతులను పూర్తిగా నిలిపివేస్తామని ప్రధాని మోదీ మాటిచ్చారని పేర్కొన్నారు. ట్రంప్ చెప్పినట్టుగా భారత్ ఇప్పటికే రష్యా చమురు కొనుగోళ్లను బాగా తగ్గించేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారత మొత్తం చమురు కొనుగోళ్లలో రష్యా చమురు వాటా గత ఏడాది ఫిబ్రవరిలో 34శాతంగా ఉంటే.. డిసెంబరులో 24శాతానికి తగ్గిపోయింది. జనవరిలో కొనుగోళ్లు ఇంకా తక్కువగా ఉంటాయని, తుది గణాంకాలు రావాల్సి ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు 2024 డిసెంబరుతో పోలిస్తే గత డిసెంబరులో 58శాతం పెరిగినట్టు వెల్లడించాయి. దీంతో, రష్యా చైనా వైపు ఫోకస్ చేసింది. రష్యా మొత్తం చమురులో చైనా ఇప్పటికే 47శాతం కొంటోంది.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు మృతి

మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి, కామారెడ్డి జిల్లాకు చెందిన లోకేటి చందర్‌రావు



చందర్‌రావు(ఫైల్)

గడ్చిరోలి/భువనేశ్వర్/కామారెడ్డి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి, తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన లోకేటి చందర్‌రావు అలియాస్ సహా ఏడుగురు మావోయిస్టులు, ఒక జవాను మృతి చెందారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు గడ్చిరోలి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు మూడు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించగా, శుక్రవారం ఉదయం మరో నలుగురి మృతదేహాలు లభ్యమైనట్టు గడ్చిరోలి పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో దీపక్ చిన్నా మడావి, జోగా మడావి అనే ఇద్దరు జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వారిని హెలికాప్టర్‌లో భమ్రాగడ్‌లోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో దీపక్ చనిపోయారు. ఘటనా స్థలంలో మూడు ఏకే-47 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. కాగా, ఒడిశా మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు నిరంజన్ రౌత్ అలియాస్ నిఖిల్, ఆయన భార్య రష్మీరా లెంక అలియాస్ ఇందుతోపాటు 19 మంది మావోయిస్టులు శుక్రవారం ఆ రాష్ట్ర పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిరంజన్‌రౌత్, రష్మీరా దంపతులపై రూ.55లక్షల చొప్పున రివార్డు ఉంది.

మూడున్నర దశాబ్దాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లి..

గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి, పశ్చిమ సబ్‌జోనల్ బ్యూరో సభ్యుడు లోకేటి చందర్‌రావు(61) స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడి గ్రామం. మూడున్నర దశాబ్దాల క్రితం అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరిన ఆయన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దళ కమాండర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత దండకారణ్యానికి వెళ్లారు. చందర్ భార్య సులోచన కూడా భర్తతో కలిసి అడవి బాట పట్టారు. వారి కుమారుడు రమేశ్, కూతురు లావణ్య కూడా 2009లో మావోయిస్టు పార్టీలో చేరారు. సులోచన 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో దండకారణ్యంలో మరణించారు. కుమారుడు రమేశ్ ఇటీవల లొంగిపోగా, కుమార్తె లావణ్య ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయ్యారు.

ప్రతి భక్తుడికీ ధార్మిక బాధ్యత ఉంది

» మనమంతా ధర్మ పరిరక్షకులుగా మారాలి

» ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు



అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతి భక్తుడికీ ధార్మిక బాధ్యత ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భగవంతుడి పట్ల భయం, భక్తి ఉన్నా.. ధర్మం అవమానానికి గురైనప్పుడు మౌనంగా ఉండే సగటు హిందూ మనస్తత్వం నుంచి మేల్కొనాల్సిన సమయం వచ్చిందన్నారు. తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం నేపథ్యంలో శుక్రవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మన దేవుళ్లను అవమానించినప్పుడు లేదా మన ధర్మాన్ని దూషించినప్పుడు బాధపడతాం, కానీ ఆ బాధను మనలోనే దాచుకొని 'కర్మ చూసుకుంటుంది' అనుకుంటూ మౌనంగా ముందుకు సాగిపోతున్నాం. ఈ విధానం కచ్చితంగా మారాలి. కులం, ప్రాంతం, భాషల ద్వారా మనం విడిపోయినట్లు కనిపించినా, మనందరి ధర్మం ఒక్కటే. మన హిందూ విశ్వాసాన్ని దురుద్దేశంతో అవమానించినప్పుడు మన ఆవేదనను వ్యక్తీకరించడం అసహనం కాదు, ఆత్మగౌరవం. ఇలాంటి సందర్భాల్లో మౌనం పాటించడం మన సహనాన్ని బలహీనంగా చూపిస్తుంది. మనం ధర్మ పరిరక్షకులుగా మారాలి. హిందూ ధర్మాన్ని కాపాడటం అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదు. కేవలం మన ధర్మాన్ని మనం రక్షించుకోవడమే" అని పవన్ పేర్కొన్నారు.

బీజేపీనే జగన్‌ను కాపాడుతోంది

» సింఘాల్‌ను బదిలీ చేయడం కాదు... శిక్షించాలి: నారాయణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగన్‌ను కాపాడుతున్నది బీజేపీనే అని సీపీఐ జాతీయ నేత కే.నారాయణ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో మాట్లాడారు. 'టీటీడీ మాజీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయడం కాదు.. శిక్షించాలి. జగన్ తప్పులు చేశారనే చంద్రబాబును ప్రజలు గెలిపించారు. కానీ, అటువంటి తప్పులే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. అంబటి రాంబాబు నోరు చిన్నదేమీ కాదు. అలాగని ఇంటిపై దాడి చేయడం సరికాదు. టీటీడీ వ్యవహారంలో సిట్ నివేదికపై రెండు పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. అలాగే, తెలంగాణలో తిట్ల పురాణం కొనసాగుతోంది. కాంగ్రెస్ లిబరల్‌గా లేదు. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తోందని తెలిపారు.' అని నారాయణ అన్నారు.

లడ్డూ దోషులపై కఠిన చర్యలు తీసుకోండి: రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులపై కఠిన చర్యలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై ప్రధాన రాజకీయ పార్టీల నేతలు వాదోపవాదాలకు స్వస్తి చెప్పి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకి శుక్రవారం ఆయన లేఖ రాశారు.

టెక్నాలజీపై చంద్రబాబు ఆసక్తి ఆకట్టుకుంది!

» మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి టేకుచి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలో 4 అత్యాధునిక ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల(ఏడీటీటీ)ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ వాహన తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. 'సీఎం చంద్రబాబుకు సాంకేతికతపై ఉన్న ఆసక్తి, విజన్ మమ్మల్ని ఆకట్టుకున్నాయి. వారి విజన్‌కు అనుగుణంగా ఏపీలో ఈ అత్యాధునిక ట్రాక్‌లను తీసుకురావడం మాకు గర్వకారణం' అని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి టేకుచి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లిలోని ప్రాంతీయ రవాణా కార్యాలయ ప్రాంగణాల్లో ఈ ఆటోమేటెడ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు.

గడ్కరీజీ.. మీ సహకారానికి ధన్యవాదాలు: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ అభివృద్ధికి నిరంతరాయంగా సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు గడ్కరీజీ' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈమేరకు ఎక్స్‌లో స్పందించారు. 'ఇప్పటికే ఉన్న పోర్టులతోపాటు కొత్తగా వస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల కనెక్టివిటీపైనా కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించడం ఆనందదాయకం. హింటర్ ల్యాండ్‌ను(మారుమూల ప్రాంతాన్ని) పోర్టుతో అనుసంధానించడంలో మచిలీపట్నం పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టు కీలకం. దీని వల్ల రవాణా ఖర్చు భారీగా తగ్గుతుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి మేం అన్ని విధాలా సహకరిస్తాం' అని సీఎం పేర్కొన్నారు.

జగన్.. రాష్ట్రాన్ని కల్తీకి కేరాఫ్‌గా మార్చారు: అనిత

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి ఓ పీడకల. కల్తీకి రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారు' అని మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. "రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులా జగన్... 'కల్తీ రిక్రూట్‌మెంట్ బోర్డు'ను స్థాపించి దానికి తానే అధ్యక్షుడిగా వ్యవహరించారు. కొవిడ్ సమయంలో ప్రాణాపాయ స్థితిలో ప్రజలకు కల్తీ మందుల సరఫరాతో మొదలైన కల్తీ దందా.. కల్తీ లిక్కర్, చివరికి శ్రీవారి నెయ్యిని కూడా కల్తీ చేసి జగన్ ప్రభుత్వం మహాపాపానికి పాల్పడింది. నిన్నటి వరకు నెయ్యి కల్తీ జరగలేదని బుకాయించిన వైవీ సుబ్బారెడ్డి ఈ రోజు మాట మార్చి కల్తీ జరిగిందని అంగీకరిస్తున్నారు. టీటీడీ పర్చేజ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి నెయ్యి కల్తీకి సూత్రధారి. జగన్ మళ్లీ పరామర్శ యాత్రల పేరుతో డ్రామాలు మొదలు పెట్టారు." అన్నారు.

పరామర్శల పేరుతో ఊరేగుతున్న జగన్

» జనాలకు డబ్బులిచ్చి తరలింపు: బుద్దా వెంకన్న



విజయవాడ అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'పరామర్శల పేరుతో పులివెందుల ఎమ్మెల్యే జగన్ రోడ్డు మీద ఊరేగారు. గంజాయి బ్యాచ్‌ను తీసుకువచ్చి నానా హంగామా చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం పర్యటనకు జనాలకు డబ్బులిచ్చి తరలించారు' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. జగన్ రెడ్డి ఇబ్రహీంపట్నం పర్యటనపై శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'జగన్ పరామర్శల పేరుతో అరాచకం చేస్తున్నాడు. జోగి రమేశ్ ఇంటి దగ్గర పెట్రోల్ బాంబ్‌లు వేసింది వైసీపీ నాయకులే. అధికారంలోకి వస్తే కూటమి నాయకులను లోపల వేయిస్తామంటున్న వైసీపీ నాయకు లు జీవితంలో అధికారంలోకి రారు. రాష్ట్రాన్ని నాశనం చేయటానికి జిల్లాకు ఒక వైసీపీ నాయకుడు తయారయ్యాడు. చంద్రబాబు ఇంటిమీద దాడి చేసినప్పుడే జోగి రమేశ్‌ను సస్పెండ్ చేసి ఉంటే ఈ రోజు ఇటువంటి పరిస్థితులు వచ్చేవి కావు' అని బుద్దా అన్నారు.

ఉనికిని చాటుకునేందుకే వైసీపీ చలో పోతిరెడ్డిపాడు: కాలువ శ్రీనివాసులు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు పచ్చి అబద్ధాలు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే జగన్ రెడ్డి 'చలో పోతిరెడ్డిపాడు' అనే సరికొత్త రాజకీయ నాటకానికి తెరలేపారు" అని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సీమలో ఉనికి కోల్పోయిన వైసీపీ, మళ్లీ తన ఉనికిని చాటుకోవడానికే ఇటువంటి పసలేని యాత్రలు చేస్తోంది. రాయలసీమ ఎత్తిపోతలను 2020లోనే ఎన్జీటీ నిలిపివేసింది. అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ఏం చేస్తున్నారు? సీమకు నీళ్లు అందించిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబుకు మాత్రమే దక్కుతుంది' అని కాలువ అన్నారు.

బడ్జెట్ భేటీకి ఎమ్మెల్యేలందరూ హాజరవ్వాలి

» ఆ బాధ్యత విప్‌లు తీసుకోవాలి: చీఫ్ విప్ జీవీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈనెల 11 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాలు అర్థవంతంగా జరిగేందుకు పార్టీ విప్‌లు బాధ్యత తీసుకోవాలి' అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని టీడీపీ లెజిస్లేచర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీవీ మాట్లాడుతూ... 'బడ్జెట్ సమావేశాలకు అధికార పార్టీల ఎమ్మెల్యేలు 100 శాతం హాజరయ్యేలా చూడాలి. సభకు వచ్చిన వారు సభ జరిగినంత సేపు సభలో ఉండేలా చూడాల్సిన బాధ్యత విప్‌లదే' అని స్పష్టం చేశారు.

ట్యాంపర్ చేస్తే జైలుకే!

నదుల అనుసంధానం చేసి రాయలసీమ సహా రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తాం. కరువుతో అల్లాడుతున్న రాయలసీమను ప్రపంచంలోనే నంబర్ వన్ హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. ఏటా 200 మెట్రిక్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తులు సీమ నుంచే వస్తున్నాయి.

\- సీఎం చంద్రబాబు





కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామ సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, సభకు తరలివచ్చిన రైతులు, ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. వాటిలో అన్ని వివరాలూ సక్రమంగా ఉన్నాయో లేదో వారినే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనివిధంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయని.. వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతం అవేనని చెప్పారు. భూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా 9వ తేదీన రైతుల వద్దకు వస్తానన్నారు. అధికారులు కూడా లంచాలకు స్వస్తి చెప్పి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పరామర్శల పేరిట జగన్ చేస్తున్న బలప్రదర్శనలపై మండిపడ్డారు. బల ప్రదర్శన ఎన్నికలప్పుడు చూపించాలని. మిగిలిన సమయాల్లో ప్రజా సేవకు అంకితం కావాలని అన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే తాటతీస్తానని వైసీపీ నేతలను ఘాటుగా హెచ్చరించారు. చిత్రగుప్తుడిలా అన్నీ రాసుకుంటుంటానని చెప్పారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

మీ భూమిపై ఆయన ఫొటోలా?

తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిపై ఫొటోలు వేసుకోవడానికి జగన్ ఎవరు? మీ భూమిపై వేరేవాళ్ల ఫొటోలెందుకు..? నువ్విచ్చావా...మీ నాన్న ఇచ్చాడా..? మీ తాత ఇచ్చాడా..? ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో.. వివాదాలు ఉన్న భూములపై పెత్తనం చేయడానికి పులివెందుల నుంచి తెచ్చుకున్న మనుషులతో పొలాలు, స్థలాలు కాజేసే కుట్రలు చేశారు. మీ జుట్టు జగన్ చేతుల్లో పెట్టుకుని పాలించాడు. సర్వే రాళ్లపై తన బొమ్మలు వేసుకోవడానికి రూ.700 కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం అత్యంత దుర్మార్గం. ప్రతి ఊరిలోనూ ఆ పార్టీ రౌడీలకు మీ భూములు తక్కువ ధరకు ఇస్తే సరేసరి.. లేదంటే 22-ఏలో పెట్టేశారు. లక్షల ఎకరాలు కాజేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. ఇక నుంచి మీ భూమిపై ఎవరూ కన్నేయకుండా క్యూఆర్ సెక్యూరిటీతో పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తున్నాం. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే భూమి వివరాలు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ భద్రంగా ఉంటాయి. ఎవరైనా తారుమారు చేసే ప్రయత్నం చేస్తే జైలుకు పంపించేలా నిబంధనలు పెట్టాం. పటిష్ఠంగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. ఈ నెలలో రాష్ట్రంలో 279 గ్రామాల్లో సర్వే చేసి 1.16 లక్షల మంది రైతులకు పాస్‌పుస్తకాలు జారీ చేశాం. ఏప్రిల్‌లోగా 18 లక్షల పాస్ పుస్తకాల జారీ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 37.40 లక్షలు సిద్ధమయ్యాయి. ఇంకా 9,500 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. 62 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాలి.

రాయలసీమ లిఫ్టు పేరిట డ్రామాలు

ముచ్చుమర్రి లిఫ్టు, పోతిరెడ్డిపాటు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు కృష్ణా జలాలను ఎత్తిపోస్తే కరువు నేల సస్యశ్యామలం అవుతుంది. ఈ ప్రాజెక్టున్నీ పెట్టుకుని.. వైసీపీ నేతలు రాయలసీమ లిఫ్టు పేరిట డ్రామాలు ఆడుతున్నారు. ఎలాంటి అనుమతులూ లేవని దానిని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆపేసింది. అయినా మళ్లీ డ్రామాలకు తెరతీశారు. కల్తీ నెయ్యిని వినియోగించి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రతిష్ఠను దెబ్బతీశారు. ఐదేళ్లు రసాయనాలతో తయారైన కల్తీనెయ్యితో ప్రసాదం తయారు చేయించారు. కానీ కల్తీ కాలేదంటూ సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చిందని జగన్ మాట్లాడుతున్నారు.. ఆయన బాబాయ్ వైవీ సుబ్బారెడ్డే కల్తీ జరిగిందని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. అప్పటి లడ్డూకు.. ఇప్పుడు అందిస్తున్న లడ్డుకు తేడా ఉందా.. లేదా తమ్ముళ్లూ (ఇప్పుడే బాగుందంటూ... టీడీపీ కార్యకర్తలు బిగ్గరగా నినాదాలు వేశారు)..! జగన్ హయాంలో శ్రీశైలం లడ్డూలో కూడా కల్తీ జరిగింది. శనీశ్వరుడిలా జగన్ పోలవరాన్ని గోదాట్లో ముంచేశాడు. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్లు దుర్వినియోగం చేశాడు. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో వాల్ నిర్మిస్తున్నాం. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తా. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తాం. కడప జిల్లాలో రాయలసీమ ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి తీరతాం.

కాకి లెక్కలు కాదు.. కరెక్టు లెక్కలు చెప్పండి


కలుగొట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు గ్రామ ప్రగతిని వివరిస్తూ.. గ్రామ తలసరి ఆదాయం రూ.26,800గా ఉన్నట్లు చెప్పారు. చంద్రబాబు జోక్యం చేసుకుని.. కర్నూలు జిల్లా తలసరి ఆదాయం రూ.1.85 లక్షలు, ఎమ్మిగనూరు నియోజకవర్గం తలసరి ఆదాయం రూ.1.25 లక్షలు, కలుగొట్ల తలసరి ఆదాయం రూ.26,800 అంటే ఎలా? కాకి లెక్కలు చెప్పకండి. కలెక్టర్, ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు సభకు వచ్చేటప్పుడు చదువుకుని రావాలి. లెక్కలు తెలియకుండా, తెలుసుకోకుండా సమావేశాలకు రావొద్దు' అని చురకలంటించారు.

తాడేపల్లి హెలిప్యాడ్ కోసం పదెకరాలు కాజేశారు!

జగన్ తాడేపల్లి వద్ద ఇల్లు కట్టుకున్నారు. అక్కడే హెలిప్యాడ్ కోసం పదెకరాలు బలవంతంగా కాజేశారు. 70 ఏళ్ల నుంచి రైతు అనుభవంలో ఉన్న ఆ భూమిని 22-ఏలో పెట్టేసి వివాదం సృష్టించారు. ఈ బాగోతం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. కేవలం హెలిప్యాడ్ నిర్మాణం కోసం ప్రైవేటు భూమిని దొంగతనంగా ప్రభుత్వ భూమిగా మార్చివేసి ఆయన తీసుకున్నారు.

మా ఆస్తిపై భరోసా వచ్చింది

గత వైసీపీ ప్రభుత్వం జగన్ ఫొటోతో పాస్ పుస్తకాలు ఇచ్చిందని.. అది తమకు నచ్చలేదని కలుగొట్లకు చెందిన రైతు బుడగ జంగాల నడిపన్న చెప్పారు. 'ఇప్పుడు ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. అది చూస్తే మా ఆస్తికి భద్రత, దానిపై భరోసా, నమ్మకం కలుగుతున్నాయి. బుడగ జంగాలకు కులం సర్టిఫికెట్ లేక పిల్లలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. మీరే ఆదుకోవాలి' అని సభాముఖంగా సీఎంను కోరారు. చంద్రబాబు స్పందిస్తూ.. బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చడంపై కేంద్రం చట్టం చేయాల్సి ఉందని.. చట్టం వచ్చే వరకు రిజర్వేషన్ తప్ప ఎస్సీలకు అందే పథకాలన్నీ వారికి అందించాలని ఆదేశించానని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, నిమ్మల రామానాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, కలెక్టర్ సిరి తదితరులు పాల్గొన్నారు.



కల్తీ నెయ్యిపై.. టీం-11 కెప్టెన్ దుష్ప్రచారం

» తిరుమల లడ్డూతో పాటు కల్తీలన్నిటికీ వారే బ్రాండ్ అంబాసిడర్లు: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి.. కల్తీ నెయ్యికి.. బాబాయ్ హత్యకు టీం-11(జగన్ అండ్ కో) బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తున్నారని మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మండిపడ్డారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారని.. పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ చేసింది కాక తమకు క్లీన్‌చిట్ వచ్చిందంటూ టీం-11 కెప్టెన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిని సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆ టీం-11 కెప్టెన్ ఏం చదివాడో తనకు అర్థం కావడం లేదని, చార్జిషీటు ఇంగ్లి‌ష్‌లో ఉందని, అసలాయనకు ఇంగ్లిష్ వచ్చా అని ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాపులో లోకేశ్ మాట్లాడారు. '2019లో బాబాయి వివేకానందరెడ్డిని హత్య చేసి గుండెపోటుగా ప్రచారం చేశారు. వివేకాని అవినాశ్‌రెడ్డి చంపాడని జగన్‌కు తెలుసు. అయినా చంద్రబాబుపై దుష్ప్రచారం చేశారు. అప్పట్లో సరైన సమయంలో దీనిని తిప్పికొట్టకపోవడంతో నష్టపోయాం' అని చెప్పారు. 'పార్టీ సొంతిల్లు. ప్రభుత్వం అద్దె ఇల్లు లాంటిది. సమాజంలో గానీ, ప్రభుత్వంలో గానీ మనకు గౌరవం దక్కుతుందంటే దానికి కారణం పార్టీయేనన్నది గుర్తు పెట్టుకోవాలి. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తాం. టీడీపీకి ఎన్నికల బూత్ గుండెకాయలాంటిది. 2024లో వేవ్ వచ్చినా కొన్ని కారణాల వల్ల కొన్ని బూత్‌లలో గెలవలేకపోయాం. దానికి కారణాలు అన్వేషించాలి. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మించాలనే లక్ష్యంతో ఈ వర్క్‌షాపును చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. దీనికి మంగళగిరి, గాజువాక నియోజకవర్గాలే ఉదాహరణ. రాబోయే రోజుల్లో బూత్ స్థాయిలో నేతల పనితీరు బేరీజు వేస్తాం. బూత్ స్థాయిలో బలోపేతం కావడం మీ బాధ్యత' అని స్పష్టంచేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమని.. గుజరాత్, ఒడిసా రాష్ట్రాలే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రం చాలా నష్టపోయిందని, పార్టీపరంగానూ చాలా కష్టనష్టాలను ఎదుర్కొన్నామన్నారు.

విడాకులు ఉండవు.. మిస్‌ఫైర్‌లూ ఉండవు

సమస్యలుంటే నాయకులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని టీడీపీ నేతలకు లోకేశ్ సూచించారు. అలిగితే నష్టపోయేది పార్టీ.. రాష్ట్రమేనని చెప్పారు. కూటమిలో విడాకులు ఉండవు.. మిస్ ఫైర్‌లూ ఉండవన్నారు. మిత్రుల నడుమ సమస్యలుంటే కూర్చుని పరిష్కరించుకోవాలని, గ్రామ స్థాయి వరకు ఇదే విధానాన్ని అనుసరించాలని తెలిపారు. మన మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

చెడు పదార్థాలు కలిపి స్వామికి తినిపించారు

» అసలు తప్పే జరగలేదని బొంకడం శోచనీయం

» తప్పు చేసిన వారిలో చిత్తశుద్ధి కనిపించలేదు

» డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే చేశారు

» తిరుమల శ్రీవారి ప్రసాదంలో కల్తీ నెయ్యిపై టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం



హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్ర జ్యోతి): "మనందరం అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారు.. చెడుపదార్థాలు కలిపి స్వామికి తినిపించారు. ఇప్పుడు అసలు తప్పే జరగలేదన్నట్లు బొంకడం శోచనీయం." అని టీటీడీ మాజీ ఈవో, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. శ్రీవారి సన్నిధిలో పనిచేస్తున్న కొంత మంది అధిక ధనం సంపాదించాలన్న ఆశతో అక్రమాలకు ఒడిగట్టి.. స్వామివారికి చెడుపదార్థాలు కలిపిన ప్రసాదాన్ని నివేదించడం మహాపాపమని తెలిపారు. అలాంటి వారు అసలు తప్పే జరగలేదని మాట్లాడటం శోచనీయమన్నారు. తన తప్పు తెలుసుకున్న ఓ అధికారి.. పోలీసులకు ఓ స్టేట్‌మెంట్ ఇచ్చి.. అక్రమంగా తాను పొందిన నగదును తిరిగి పోలీసులకు అప్పగించారన్నారు. అయితే, ప్రసాదాన్ని కల్తీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన కొందరిలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవారి సన్నిధిలో ఏ తప్పు చేసినా శిక్షలు పడవనే రీతిలో మాట్లాడటం చాలా బాధాకరమన్నారు. "టీటీడీలో రోజూ 13 వేల నుంచి 18 వేల కిలోల నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. తిరుమలకు వచ్చే భక్తులు స్వామి ప్రసాదాన్ని అపురూపంగా భావిస్తారు. దేశంలో ఎక్కడ స్వామి గురించి మాట్లాడినా ప్రసాదం గురించి చెబుతారు. టీటీడీకి అందిన నెయ్యి నాణ్యత లేదని తెలిసినప్పుడు ఆపేయాల్సిన వ్యక్తులు ఆపని చేయలేదు. ప్రొక్యూర్‌మెంట్ కమిటీకి నెయ్యి కొనుగోళ్లలో నాణ్యత పరిశీలించాల్సిన బాధ్యత ఉంది. నెయ్యి నాణ్యత పరిశీలించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ల్యాబులకు పంపుతారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు గంభీరమైన వార్తను మనముందు పెట్టారు. స్వామివారికి సరఫరా చేసే నెయ్యి కలుషితం అయిందని.. జంతువుల కొవ్వు కూడా కలిపినట్లు తెలుస్తోందని ప్రకటించారు. మన దైవానికి అలాంటి ప్రసాదం ఇచ్చారా.. ఇది క్షమించరాని తప్పిదమని అనుకున్నాం. ప్రభుత్వం వెంటనే డీఐజీ స్థాయి అధికారితో విచారణ చేపడితే.. తప్పు చేసిన వారు సుప్రీం కోర్టుకు వెళ్లి బొంకారు. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్ ఇచ్చిన నివేదికలో వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఇవాళ ఉన్న చైర్మన్, ధర్మకర్తల మండలి, తిరుమలలో పని చేసే అందరూ భవిష్యత్తులో ఇలాంటి అపచారం జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలి." అని ఎల్వీ సూచించారు.



అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్స్‌లో పాల్గొన్న జాతీయ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తదితరులు

క్వాంటమ్‌కు మనం రోడ్డు వేస్తున్నాం

» జాతీయ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించినప్పుడు ఈ టెక్నాలజీ గురించి ఏమాత్రం అవగాహన లేదు. కేవలం 150 మందితో ఈ మిషన్ ప్రారంభించాం. ఇప్పుడు గల్లీల్లోనూ దీని గురించే మాట్లాడుకుంటున్నారు. రాబోయే ఐదు, పదేళ్లలో ఈ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. మనమంతా క్వాంటమ్ టెక్నాలజీకి తొలితరంగా ఉంటూ రోడ్డు వేస్తున్నాం..' అని జాతీయ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి అన్నారు. విజయవాడలో ఉన్నత విద్యామండలి శుక్రవారం నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అల్గరిథమ్స్‌తో పాటు క్వాంటమ్ కంప్యూటర్ తయారీకి అవసరమయ్యే హార్డ్‌వేర్ సబ్‌సిస్టమ్స్‌ను కూడా మనమే తయారు చేసుకునే పరిస్థితి రావాలి. క్వాంటమ్‌కు అవసరమైన హార్డ్‌వేర్ ఉపకరణాలు తయారుచేసుకోగల సత్తా మనకు ఉంది' అన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ కె.మధుమూర్తి మాట్లాడుతూ.. 'భవిష్యత్తులో మీరంతా కీలక అవకాశాలు పొందుతారు. అంతర్జాతీయ స్థాయిలో భాగస్వామ్యం అయ్యే అవకాశాలు లభిస్తాయి. మొదటిసారి సీఎం చంద్రబాబు.. క్వాంటమ్‌లో ఎంతమందికి శిక్షణ ఇస్తారు..? అని అడిగితే మా వద్ద సరైన అంచనా లేదు. కానీ ఇప్పుడు జాతీయ క్వాంటమ్ మిషన్‌ను మనమే ముందుండి నడిపిస్తున్నాం. మన విద్యా విధానం మార్కులు, గ్రేడులు, సర్టిఫికెట్లకే ప్రాధాన్యత ఇస్తోంది. క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ మన కళ్లు తెరిపిస్తుంది. రాబోయే కాలంలో కంపెనీలు కూడా మార్కులు, గ్రేడులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వవు' అని అన్నారు. క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో రాష్ట్రం ప్రపంచ రికార్డు సాధించిందని అమరావతి క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ అన్నారు. ఐబీఎం- క్వాంటమ్ మాజీ హెడ్ ఎల్.వెంకట సుబ్రమణ్యం మాట్లాడుతూ.. అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. సిలికాన్ వ్యాలీని మించిపోతుందని అన్నారు.

విజేతలకు సీఎం చేతుల మీదుగా అవార్డులు

నాలుగు నెలల కిందట ప్రారంభమైన క్వాంటమ్ హ్యాకథాన్‌లో ఏపీతో పాటు ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కో బృందంలో ఆరుగురు విద్యార్థులున్నారు. ఫైనల్స్ అనంతరం మొత్తం పది బృందాలను విజేతలుగా ప్రకటించారు. తర్వాతి పది బృందాలు రన్నరప్‌గా నిలిచాయి. ఈ 120 మందికి అమరావతిలో శనివారం జరిగే క్వాంటమ్ భవనం శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అవార్డులు, సర్టిఫికెట్లు అందజేస్తారు. విజేతలకు రూ.50వేలు, రన్నర్‌లకు రూ.30 వేలు నగదు బహుమతులు ఇస్తారు.

లడ్డూ కల్తీ రాజకీయ అంశం కాదు

» శివశక్తి ఆధ్యాత్మిక చైతన్య వేదిక అధ్యక్షుడు కరుణాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమల కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి ప్రతీక అని శివశక్తి ఆధ్యాత్మిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. కరుణాకర్, హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్ కుమార్ అన్నారు. లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను రాజకీయ కోణంలో చూసి హిందువులు పార్టీల వారీగా విడిపోయి స్పందించకుండా మౌనంగా ఉండటం అత్యంత ఆందోళనకరమైన విషయమన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో వారు మాట్లాడారు. 'తిరుమల లడ్డూ వ్యవహారం రాజకీయాలకు సంబంధించిన అంశం కాదు. హిందువుల మనోభావాలకు చెందినది. క్లీన్ చిట్ ఇవ్వాల్సింది జగన్ మీడియా కాదు, విచారణ సంస్థలు. నెయ్యి కల్తీలో బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. దోషులను అరెస్టు చేయాలి' అని వారు డిమాండ్ చేశారు. హవాలా ద్వారా వెంకటేశ్వరస్వామి సొమ్మును దోచుకోవడం, కమీషన్ల కోసం స్వంత కంపెనీలకు టెండర్లు కేటాయించడం, చుక్క పాలు లేకుండా ప్రమాదకరమైన రసాయనాలతో నెయ్యి తయారు చేసి లక్షలాది మంది భక్తులు తినే లడ్డూల్లో కలపడం వంటి చర్యలు చట్టపరంగా ఎంత పెద్ద నేరమో అంతకన్నా మహాపాపం కూడా అని మండిపడ్డారు. రూ.250 కోట్ల కుంభకోణానికి పాల్పడిన వారిని ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు.

మహాపాపం గత పాలకులదే

» మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి/అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తులు పరమ పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం వెను క గత పాలకుల పాపాలు దాగి ఉన్నాయని, వీటి నుంచి ఎవరూ తప్పించుకోలేరని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి, అమరావతిలో ఆయన మాట్లాడారు. "వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు. అప్పటి టీటీడీ చైర్మన్ హోదాలో వైవీ సుబ్బారెడ్డి సోయిలేకుండానే సంతకాలు చేశారా?. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి కల్తీకి మా ర్గం చూపారు. ఆ రోజు లోతైన విచారణ లేకుండానే కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ప్రశ్నించాం. చుక్క పాలు లేకుండా మొత్తం రసాయనాలతో నెయ్యి తయారు చేసే కంపెనీలు వైసీపీ దృష్టిలో స్టార్టప్ కంపెనీలా?. నెయ్యిలో పాలు, వెన్నకు బదులు మోనోగ్లిజరైడ్ బీటీ కెరోటిన్, ఎసిటిక్ యాసిడ్, లాక్టిక్ యాసిడ్ వంటి రసాయన పదార్థాలు ఉపయోగించి మహాపాపానికి ఒడిగట్టారు. నిజ నిర్ధారణ తర్వాత బాధ్యులపై కఠినచర్యలు తప్పవు." అని మంత్రి హెచ్చరించారు.

యువత భవితకు పునాది..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ డిజైన్లు ఆకట్టుకున్నాయి. తొలిదశలో 45,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే భవనాన్ని ఏడాది జూన్ నాటికి పూర్తిచేస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి మొత్తం భవనాన్ని సిద్ధం చేసి.. డిసెంబరు నాటికి పూర్తిస్థాయిలో కంప్యూటర్లను తీసుకురావాలని.. లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాగా, అమెరికాలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న నాలు గు ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ మిషన్లను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కూడా కూ టమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ ఏపీతోపాటు దేశానికి కూడా మైలురాయిగా నిలువనుందని ఐటీ శాఖ అధికారులు చెబుతున్నారు. 133 క్యూబిక్స్ సామర్థ్యంతో కూడిన క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్ కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు క్వాంటమ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.



నెల్లూరు జిల్లా మనుబోలు మండలం యాచవరం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మా ఊళ్లో అన్యమత ప్రచారం చేయొద్దు!

» ఉల్లంఘిస్తే రూ.10 వేలు జరిమానా

'మా గ్రామంలో అందరూ హిందువులే. అన్యమత ప్రచారం చేసేందుకు ఎవరూ రాకండి. ఉల్లంఘించి వచ్చారంటే.. రూ.10 వేలు జరిమానా చెల్లించాలి.' అంటూ నెల్లూరు జిల్లాలోని ఓ గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది. మనుబోలు మండలం యాచవరంలో గ్రామస్థులంతా ఈ విషయంలో ఓ తీర్మానం చేసుకుని, ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇటీవల కొంత మంది గ్రామంలోకి వచ్చి ఇబ్బందులు పెట్టారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. విదేశీ మతాలు ప్రచారం చేసేందుకు వచ్చి,ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. - మనుబోలు, ఆంధ్రజ్యోతి

సీబీఐ క్లీన్‌చిట్ చూపిస్తే రాజీనామా: కొలుసు



గుడివాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'తిరుమల లడ్డూ కేసులో సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చినట్టు నిరూపిస్తే నా మంత్రి పదవికి రాజీనామా చేస్తా' అని మంత్రి కొలుసు పార్థసారథి సవాల్ చేశారు. శుక్రవారం కృష్ణా జిల్లా నిమ్మకూరులో ఎన్‌టీఆర్, బసవతారకం విగ్రహాల చెంత పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ అధ్యక్షతన టీడీపీ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. 'తిరుమల లడ్డూ విషయంలో క్లీన్ చిట్ ఎక్కడ నుంచి తెచ్చారో మాజీ మంత్రి పేర్ని నాని చెప్పాలి, చూపించాలి. ఆయన కోనేరు సెంటర్‌కు వస్తానన్నా... విజయవాడ సెంటర్‌కు వస్తానన్నా నేను సిద్ధం' అని సవాల్ విసిరారు.

మందలించాల్సింది పోయి పరామర్శలా: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బూతులు మాట్లాడే నేతలను మందలించాల్సింది పోయి వారిని పరామర్శించేందుకు జగన్ వెళ్లడం విడ్డూరంగా ఉందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఢిల్లీలో విమర్శించారు. సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడిన వ్యక్తుల ఇంటికి జగన్ వెళ్తుంటే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు. తిరుపతి లడ్డూపై ఢిల్లీలో చర్చ జరుగుతోందని.. ఎవరికైనా లడ్డూ ఇస్తే ఎవరి హయాంలో తయారైందని ప్రశ్నిస్తున్నారని చెప్పారు.

సీమ లిఫ్టుపై ఆందోళనా.. వైసీపీకి సిగ్గుండాలి

▸▸ బాబు, జగన్... ఇద్దరూ సీమ ద్రోహులే: షర్మిల



గంగాధరనెల్లూరు/పలమనేరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఆందోళనలు చేయడానికి వైసీపీకి సిగ్గుండాలి. అధికారంలో ఉన్న ఐదేళ్లూ మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్, కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేలేదు?' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. 'వైసీపీ అధికారంలో ఉండగా సీమ ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేదు? ఎన్జీటీ దగ్గర అనుమతుల కోసం వాదనలు ఎందుకు వినిపించలేదు? అనుమతులు వచ్చేలా కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేదు?' అంటూ ప్రశ్నలు సంధించారు. చంద్రబాబు, జగన్ ఇద్దరూ సీమ ద్రోహులేనన్నారు. నల్లగుట్టపల్లిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ,గాడ్సే ఆనాడు మహాత్మాగాంధీని ఎలా హత్య చేశాడో... నేడు పేదలకు ఉపయోగపడుతున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి మహాత్ముడి ఆశయాలను మోదీ తుంచివేశారు. ఆయన కూడా గాడ్సేతో సమానమే' అని విమర్శించారు.

జోగిపై తొందరపాటు చర్యలు వద్దు: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత జోగి రమేశ్‌పై నమోదు చేసిన కేసులలో తదుపరి విచారణ వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తిరుపతి రూరల్, ఇబ్రహీంపట్నం పోలీసులకు స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

అంబటికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి: హైకోర్టు

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో మంగళగిరి రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసులో వైసీపీ నేత అంబటి రాంబాబుకు నోటీసులిచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశించింది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తనపై టి.గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ అంబటి హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం పిటిషనర్‌కు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే దర్యాప్తునకు సహకరించాలని అంబటి రాంబాబుకు స్పష్టం చేశారు. ఫిర్యాదుదారు గంగాధర్‌కు నోటీసులు జారీ చేశారు. కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని మంగళగిరి రూరల్ పోలీసులను ఆదేశించారు.

అంబటి కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఎల్లుండి తీర్పు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన కేసులో అరెస్టయి రాజమండ్రి జైల్లో ఉన్న వైసీపీ నేత అంబటి రాంబాబుకు సంబంధించిన కస్టడీ, బెయిల్ పిటిషన్లపై సోమవారం తీర్పు వెలువడనుంది. ఈ రెండు పిటిషన్లపై శుక్రవారం గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టులో మేజిస్ట్రేట్ స్రవంతి సమక్షంలో ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరపున డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, స్పెషల్ పీపీ జగదీశ్, మొబైల్ కోర్టు ఏపీపీ శౌరి.. అంబటి తరపున పొన్నవోలు సుధాకర్ రెడ్డి, పక్కాల సూరిబాబుతో పాటు పలువురు వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులు హాజరయ్యారు. ఉద్దేశపూర్వకంగానే అంబటి ముఖ్యమంత్రిని దూషించి, వర్గ విభేదాలు, సమాజంలో శాంతి భద్రతల సమస్య సృష్టించారని దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని పీపీలు వాదించారు. కేసు దర్యాప్తు తొలి దశలోనే ఉందని ఈ సమయంలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. పోలీస్ కస్టడీ అవసరం లేదని, అంబటికి తక్షణం బెయిల్ మంజూరు చేయాలని పొన్నవోలు కోరారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు సెక్యూరిటీని పునరుద్ధరించండి

▸▸ హోం శాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డికి 1 ప్లస్ 1 సెక్యూరిటీని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పోలీసు భద్రత ప్రాథమిక హక్కు కానప్పటికీ... ప్రభుత్వ అధికారికి గతంలో ఉన్న భద్రతను తొలగించేటప్పుడు బలమైన కారణాలను చూపాలని కోర్టు స్పష్టం చేసింది. ప్రాణానికి ముప్పు లేదనే కారణంతో భద్రతను తొలగించడం సరికాదని పేర్కొంది. రెండు వారాల్లో పిటిషనర్‌కు భద్రతను పునరుద్ధరించాలని హోంశాఖ కార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల తీర్పు ఇచ్చారు. తనకు 1 ప్లస్ 1 సెక్యూరిటీని పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విజయ్‌ప్రతాప్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

జగన్‌పై హిందూత్వ వ్యతిరేక ముద్రకు కూటమి కుట్ర: భూమన

▸▸ రోజాతోపాటు అంబటి కుటుంబానికి పరామర్శ

గుంటూరు/విజయవాడ/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌ను హిందూత్వ వ్యతిరేకిగా ముద్ర వేసేందుకే కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేస్తున్నారని, దీనిలో భాగమే.. తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. సీఎం చంద్రబాబును బూతులతో దూషించిన కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి భూమన, మాజీ మంత్రి రోజా తదితరులు శుక్రవారం వచ్చారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూలో కల్తీ లేదని సిట్ పేర్కొందని భూమన తెలిపారు. దీంతో ఆత్మరక్షణలో పడ్డ కూటమి ప్రభుత్వం.. జగన్‌ను అభాసుపాల్జేయాలని పన్నాగం పన్నుతోందని విమర్శించారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కొవ్వు లేదని సిట్ నివేదికలో పేర్కొన్నా.. సీఎం చంద్రబాబు పదే పదే కల్తీ అంటున్నారని, ఆయనకు దేవుడు కల్లో కొచ్చి చెప్పాడేమో చెప్పాలని వ్యాఖ్యానించారు. మాజీమంత్రి జోగి రమేశ్, ఆయన కుటుంబంపై కక్ష కట్టి దాడి చేశారని ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్‌ను రోజా పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. "తిడితే దాడులు చేస్తారా?. మరి మేం అధికారంలో ఉండగా మీరు తిట్టారుగా.. అప్పుడు మేమేం చేయాలి?. విపక్ష నాయకులపై దాడులు చేస్తే భవిష్యత్‌లో మిమ్మల్ని కాపాడేందుకు కూటమి నేతలు రారన్న విషయాన్ని దాడులకు పాల్పడే వారు గుర్తుంచుకోవాలి." అని హెచ్చరించారు.

జగన్ 'బల ప్రదర్శన'కు

మరో ఇద్దరు బలి!



జగన్ పర్యటన సందర్భంగా ఇబ్రహీంపట్నంలో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



తన చేయికి గాయం చేసుకుని జగన్‌కు నెత్తుటి తిలకం అద్దుతున్న అభిమాని

గుండెపోటుతో ఒకరు.. ప్రమాదానికి గురై మరొకరు మృతి

అమరావతి, విజయవాడ (ఇబ్రహీంపట్నం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'లేని జనం' ఉన్నట్టు హడావుడి, భారీఎత్తున వాహనాలతో రోడ్ల దిగ్బంధనం, దారి క్లియర్‌గా ఉన్నా 5కిమీ కంటే తక్కువ వేగంతో కాన్వాయ్‌ల ప్రయాణం.. వెరసి పరామర్శ పేరిట సాగిన మాజీ సీఎం జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మంత్రి లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించారంటూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ శ్రేణులు పెట్రోల్ బాంబు విసిరిన నేపథ్యంలో ఆయన పరామర్శకు జగన్ బయలుదేరారు. తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నం గంట దూరంలోనే ఉంది. కానీ దండయాత్రను తలపించేలా జగన్ అండ్ కో 7గంటలకుపైగా ఈ మార్గంలో పర్యటించారు. తనకు లేని జనబలాన్ని.. ఉన్నట్టు చూపించుకుంటూ కలరింగ్ ఇవ్వడానికి గుంటూరు పర్యటనలో ఉపయోగించిన ట్రిక్‌నే ఇక్కడా ప్రయోగించారు. తన 'దీర్ఘ'యాత్రలతో కార్యకర్తలను, జనాలను యాతన పెట్టారు. వైసీపీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జోగి ఇంటికి జగన్ 10.30 గంటలకు చేరుకోవాలి. గంట ఆలస్యమైనా 11.30కు చేరుకుంటారు. జగన్ ఇంటి నుంచి 11.06గ భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. విజయవాడలో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని భావించిన పోలీసులు, ఆయన కాన్వాయ్ వేగంగా ముందుకు కదిలేందుకు వీలుగా పశ్చిమ బైపాస్‌ను కేటాయించారు. ఖాళీగా ఉండే ఈ దారిలో ప్రయాణానికి జగన్‌కు 4 గంటలకు పైగా పట్టడం గమనార్హం. ఆయన జోగి రమేశ్ ఇంటికి సాయంత్రం 5.06కు చేరుకున్నారు.

సొలుతున్న ప్రాణాలు..

జగ్గయ్యపేట నియోజకవర్గం చిల్లకల్లుకు చెందిన దొంగల రాంబాబు (41) జగన్‌ను చూసేందుకు 11 గంటలకు ఇబ్రహీంపట్నం వచ్చారు. జోగి ఇంటికి కొద్దిదూరంలో రోడ్డుపై పడిపోయారు. పాత పంచాయతీ కార్యాలయంలో ఉన్న వైద్య ఆరోగ్య సిబ్బంది ఆయనకు వైద్య సేవలందించి 108 అంబులెన్స్‌లో గొల్లపూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆయన అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇబ్రహీంపట్నం కొత్తగేటుకు చెందిన బండారు భార్గవ్ (17) ద్విచక్రవాహనంపై జగన్‌ను చూసేందుకు వెళుతూ, అదుపు తప్పి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు.

కారు చక్రాల కింద నలిగిన ప్రాణం



గత ఏడాది జూన్ 23న రెంటాళ్లకు జగన్ మందీ మార్బలంతో వెళ్లారు. ఈ పర్యటనలో వైసీపీ దళిత కార్యకర్త ఒకరు జగన్ కారు కింద పడి చనిపోయారు. అయినా ఆయన కారు దిగలేదు. దళితులపై వల్లమాలిన ప్రేమాభిమానాలు కురిపించే జగన్, ఆ కార్యకర్త కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శించలేదు. బాధితులే జగన్ ఇంటికి వచ్చారు. ఇలా జగన్ పర్యటనలో తరచూ నాయకులు, కార్యకర్తలు మృతి చెందుతున్నా, ఆయన యాత్రల తీరు మాత్రం మారడం లేదు. జడ్ ప్లస్ కేటగిరిలో ఉన్న నాయకుడు ఎవరైనా పోలీసుల మార్గదర్శకాలను పాటించాలి. యాత్ర సాగుతున్నప్పుడు కారు డోర్‌ను తీసేందుకుగానీ, డోర్ అద్దాలు కిందకు దించేందుకుగానీ వీల్లేదు. కానీ, జగన్ కారుడోర్ తీసి, భద్రతా నిబంధనలకు విరుద్ధంగా నిలబడుతున్నారు. ఒకవైపు తన ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ జగన్ 'సీఎం' తరహా భద్రతను కోరుతున్నారు. మరోవైపు పర్యటనల సమయంలో సొంత పార్టీ కార్యకర్తల భద్రతను ఏ మాత్రం లక్ష్యపెట్టడం లేదు.

అర గంట 'పరామర్శ'

80 కార్లు.. వందల ద్విచక్ర వాహనాలతో బయలుదేరినప్పటి నుంచీ కారులో నుంచి బయటకు రావడం, దండాలు పెట్టడం! జోగి ఇంటి వరకు జగన్‌ది ఇదే తీరు. దీంతో హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆగిపోయింది. ఇంతా చేస్తే అర గంట మాత్రమే జోగి ఇంట్లో గడిపారు. సాయంత్రం 6.30కు తిరిగి తాడేపల్లి పయనమయ్యారు.



విధ్వంసం కోసం ఎదురుచూస్తున్నాం అంటూ ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న యువతి

రప్పా రప్పా!

▸▸ 'మాకు విధ్వంసం కావాలి' అని రాసిన హ్యాండ్ ఫ్లెక్సీలతో పర్యటనలో వీరంగం

విజయవాడ (ఇబ్రహీంపట్నం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగన్ ఇబ్రహీంపట్నం యాత్రలో 'రప్పా రప్పా' నినాదాలతో వైసీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. '2029లో నువ్వు సృష్టించే విధ్వంసం కోసం ఎదురుచూస్తున్నాం 2.0' అని రాసిన హ్యాండ్ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. జనాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. కొంతమంది బ్లేడుతో చేతులు కోసుకుని జగన్ హ్యాండ్ ఫ్లెక్సీకి వీర తిలకం దిద్దారు. జోగి రమేశ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను పడేశారు. వారిస్తున్న పోలీసులపై గొడవకు దిగారు. జగన్ పర్యటనలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. సెల్‌ఫోన్లు, గోల్డ్ చెయిన్లు, పర్సులు కొట్టేశారు. జోగి ఇంటికి వెళుతున్న జగన్ కాన్వాయ్‌లో ఓ ప్రైవేటు అంబులెన్స్ ఇరుక్కుపోయింది. అయినా వైసీపీ శ్రేణులు ఏమాత్రం పట్టించుకోలేదు. జగన్ పర్యటన ఆ పార్టీ నేతలకు, కార్యకర్తలకు తిండి తిప్పలు లేకుండా చేసింది. మధ్యాహ్నం భోజనం లేకుండా చేయడంతో కంచికచర్లకు చెందిన ఓ మహిళ సొమ్మసిల్లిపడిపోయింది.

'కల్తీ' మాటలు ఎవరివి జగన్?

▸▸ చంద్రబాబు, 'ఆంధ్రజ్యోతి'లదే పాపమంటూ ఇబ్రహీంపట్నంలో జగన్ దుష్ప్రచారం

▸▸ ఏ నివేదికా 'కొవ్వు'ను నిర్ధారించలేదట!

▸▸ పందికొవ్వు కలిసిందని 'ఎన్‌డీడీబీ' స్పష్టీకరణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో జంతువులు, పంది మాంసం నుంచి తీసిన కొవ్వు కలిపారని చెప్పింది ఎవరండీ? సీబీఐ చెప్పిందా? ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పిందా? ఎన్‌డీఆర్ఐ రిపోర్టు చెప్పిందా? ఏ ల్యాబ్ రిపోర్టు చెప్పింది? ఈ మాటలు చెప్పిందెవరంటే చంద్రబాబు, ఆయనకు ఢంకా బజాయిస్తున్న ఆంధ్రజ్యోతి. లేని అబద్ధానికి రెక్కలు కట్టి దుష్ప్రచారం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకున్నారు. ఒక అబద్ధాన్ని తప్పుడు ప్రచారం చే శారు".. ఇదీ వైసీపీ అధినేత జగన్ తీరు. వైసీపీ నేత జోగి రమేశ్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఆయన శుక్రవారం ఇబ్రహీంపట్నంలో మాట్లాడారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని ఏ ల్యాబ్ చెప్పకపోయినా 'ఆంధ్రజ్యోతి' తప్పుడు ప్రచారం చేస్తోందని జగన్ నిరాధారణ ఆరోపణలు చేశారు. తిరుమల నెయ్యికల్తీ అంశంపై ఏకధాటిగా అబద్ధాలు, అసత్యాలు వల్లించారు. తను పచ్చి అబద్ధం చెప్పినా అది నిజమే అని జనం నమ్ముతారన్న భ్రమలో జగన్ ఉన్నట్లు ఆయన మాటలే చెబుతున్నాయి. వాస్తవాలను వక్రీకరించి, అబద్ధాలను పోగేసి మాట్లాడి అవే నిజాలుగా జనం నమ్మాలని తాపత్రయపడ్డారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో పందికొవ్వు కలిసిందని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) 'కాఫ్' నివేదిక చెప్పింది. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. అయితే, ఆ సంస్థ ఇలాంటి నివేదికే ఇవ్వలేదని వైసీపీ నేత చాలా సులువుగా అబద్ధాలు మాట్లాడేశారు. కానీ, ఆయన బాబాయి, నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ, ఎన్‌డీడీబీ నివేదికను నిర్ధారించారు. నెయ్యిలో పంది కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ కేవలం అనుమానం మాత్రమే వ్యక్తం చేసిందని ఆయన తెలిపారు. ఇలాంటి నిజాలను గుర్తించలేక జగన్ చాలా సులువుగా 'ఆంధ్రజ్యోతి'పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు.

ఎన్‌డీడీబీ నివేదిక ఇదిగో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతను పరీక్షించాలనుకుంది. ఆ నెయ్యి సరఫరా చేస్తున్న కంపెనీలకు టెండర్ వైసీపీ ప్రభుత్వంలో కట్టబెట్టారు. నిబంధనలను సడలించిన తర్వాతే ఆ కంపెనీలు టెండర్ దక్కించుకున్నాయి. కాబట్టి, ఆ కంపెనీలు కేజీకి 20 రూపాయల చొప్పున నష్టపోతూ, టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయని, అందులో అసలు నెయ్యే లేదన్న ఫిర్యాదులు రావడంతో 2024 జూలై 9న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ-కాఫ్) ల్యాబ్‌లో పరీక్షించాలని, రెండు శాంపిల్స్ పంపించారు. ఆ తర్వాత జూలై 17న మరో రెండు శాంపిల్స్ పరీక్ష కోసం పంపించారు. ఇలా రెండు దఫాలుగా పంపించిన నాలుగు శాంపిల్స్‌లో పందికొవ్వు మాంసం నుంచి తీసిన కొవ్వు ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ అయింది. ఇదే విషయాన్ని ఎన్‌డీడీబీ తన రెండు రిపోర్టుల్లోనూ పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగానే సీఎం చంద్రబాబు స్పందిస్తూ, నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నివేదిక ఆధారంగానే కల్తీ నెయ్యిపై పోలీసు కేసు తొలుత నమోదైంది. అసలు కేసుకు మూలాధారమే ఈ నివేదిక. తొలుత నాటి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఈ నివేదిక గురించి మాట్లాడేందుకు వెనుకంజ వేశారు. ఎప్పుడయితే ఈ నివేదికను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిందే తప్పనిసరి పరిస్థితుల్లో ఢిల్లీ వేదికగా మాట్లాడారు. జగన్‌కు ఈ విషయం తెలియదనుకోవాలా?

అబద్ధాలకు రెక్కలు..

నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని 'ఎన్‌డీఆర్ఐ' చెప్పిందా? అని జగన్ మరో ప్రశ్న వేస్తున్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందా? లేదా? చేప నూనె కలిసిందా? లేదా అని నిర్ధారించే సాంకేతికత, సామర్థ్యం తనకు లేదని ఎన్‌డీఆర్ఐ... సీబీఐ కోర్టుకు ఇచ్చిన రిపోర్టులో పేర్కొంది. సిట్ ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ ల్యాబ్‌ల్లో నెయ్యిని పరీక్షించిందని, అందులో జంతువుల కొవ్వు లేదని తేలిందని జగన్ మరో అబద్ధం చెప్పారు. వైసీపీ హయాంలో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉండగానే, 2022 ఆగస్టులో తిరుమల నెయ్యిని మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌లో పరీక్షించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా అవుతోందని ఆ సంస్థ నివేదిక ఇచ్చింది. ఈ విషయం గురించి జగన్ మాట్లాడరు. ఎందుకంటే, నాడు కల్తీ ఉన్నట్లు తేలినా, చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాల్సి ఉంటుంది మరి.

మా హయాంలో గొప్పగా లడ్డూ!

▸▸ భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారు

▸▸ ప్రసాదం ప్రతిష్ఠ బాబు దిగజార్చారు : జగన్

విజయవాడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎం కాకముందు తిరుమల లడ్డూను భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారని మాజీ సీఎం జగన్ అన్నారు. లడ్డూప్రసాదం ప్రతిష్ఠను చంద్రబాబు ప్రభుత్వం దిగజార్చిందని ఆరోపించారు. విజయవాడ ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. తిరుమల నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు కలవలేని సిట్ తన చార్జిషీట్‌లో స్పష్టం చేసిందని జగన్ అన్నారు. ఈ వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి ఏ తప్పు చేయలేదని నిర్ధారించిందని తెలిపారు. తప్పు చేస్తున్నదల్లా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లేనని వ్యాఖ్యానించారు. చంద్రబాబు చేసిన తప్పులను సీబీఐ ఏకంగా చార్జిషీటులో ప్రస్తావించిందని ఆరోపించారు. చంద్రబాబు వేంకటేశ్వరస్వామి వద్ద లెంపలు వేసుకుని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ పనిచేయని చంద్రబాబుకు మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. "వైవీ, భూమన ప్రమేయం లేదని సీబీఐ స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా కల్తీ నెయ్యి అంటూ ఫ్లెక్సీలు కట్టి ప్రచారం చేయడం ధర్మమేనా? ఆ ఫ్లెక్సీలపై ముద్రించిన అసత్యాలపై ప్రశ్నించినందుకు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు చేయించారు. ఇది హత్యాయత్నం కాకపోతే ఇంకేమిటి?" అని ప్రశ్నించారు. ఇదంతా చూస్తుంటే, నాగరిక ప్రపంచంలో ఉన్నామా, జంగిల్ రాజ్‌లో ఉన్నామా అన్నది అర్థం కావడం లేదన్నారు.

లంచం తీసుకుని..తిరుమలకు నెయ్యి ట్యాంకర్ల అనుమతి!

▸▸ తిరుచానూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి గుట్టు రట్టుచేసిన సిట్

తిరుచానూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి టి.జానకిరామ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. దానితోపాటు అతడిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. సెస్ వసూలు చేయకుండా లంచం తీసుకుని నెయ్యి ట్యాంకర్లను తిరుమలకు అనుమతించాడని సీబీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించింది. దీంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీ సంస్థలు నెయ్యి టాంకర్లను తిరుమలకు పంపిస్తుంటాయి. అలా వెళ్లే టాంకర్ల నుంచి అలిపిరి చెక్ పాయింట్ వద్ద తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది నిబంధనల మేరకు సెస్ వసూలు చేయాల్సి ఉంటుంది. ట్యాంకర్ల సామర్థ్యాన్ని బట్టి రూ.40 వేల నుంచి 70 వేల దాకా సెస్ కింద వసూలు చేయాలి. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీ సిబ్బంది సెస్ వసూలు చేయకుండా ఒక్కో ట్యాంకర్ నుంచి కనిష్ఠంగా 8 వేలు, గరిష్ఠంగా 15 వేల వరకు లంచాలు వసూలు చేసి వాటిని తిరుమలకు అనుమతించారు. భోలేబాబా డెయిరీకి కమీషన్ ఏజెంటుగా పనిచేసిన పీపీ శ్రీనివాసన్‌ను సిట్ విచారించిన క్రమంలో ఈ అంశం వెలుగు చూసింది. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న డెయిరీలో మార్కెట్ కమిటీ సిబ్బందికి చెల్లించిన లంచాల వివరాలు ఉన్నాయి. దీనిపై సిట్ అధికారులు గత నెల 24వ తేదీన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. సిట్ లేఖ ఆధారంగా కార్యదర్శి జానకిరామ్‌ను బాధ్యుడిగా గుర్తించిన వ్యవసాయ మార్కెట్‌శాఖ డైరెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. అలాగే సెస్ బదులు లంచం వసూలు చేసిన కాంట్రాక్టు కార్మికుడు రాధాకృష్ణను తొలగించేందుకు నోటీసు జారీ చేశారు.

కల్తీ కంపెనీల కంత్రీ కుట్ర

▸▸ నెయ్యి.. వైష్ణవి, మాల్ గంగా నుంచి శాంపిల్స్.. హెరిటేజ్, సంగం నుంచి

▸▸ రిపోర్టు కోసం వీటిని ఎన్ఏబీఎల్ ల్యాబ్‌కు

▸▸ ఈ 'నాణ్యమైన' నివేదికలు చూపి టీటీడీకి 'కల్తీ' నెయ్యి ట్యాంకర్ల సరఫరా

తిరుపతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో మరో కుట్ర కోణం బయటపడింది. టీటీడీకి రూ.250 కోట్లకు పైగా విలువైన 60 లక్షల కిలోలకు పైగా కల్తీ నెయ్యి సరఫరా చేయడంలో 'కంత్రీ' తెలివితేటలు వాడారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే ముందు ల్యాబ్ టెస్టింగ్ కోసం పొమిల్ జైన్ తదితర నిందితులు ఇతర నాణ్యమైన సంస్థల నుంచి అర లీటరు, కిలో టిన్నుల్లో నెయ్యి కొనుగోలు చేశారు. వాటి శాంపిల్స్‌ను పరీక్షలకు పంపి 'నాణ్యమైన' నివేదికలు తెప్పించుకున్నారు. టీటీడీకి మాత్రం భోలేబాబా డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేసి దాన్నే వైష్ణవి, మాల్‌గంగా తదితర డెయిరీల ద్వారా సరఫరా చేశారు. టీటీడీకి ప్రతీ కల్తీ నెయ్యి ట్యాంకర్‌తో పాటు ఇతర సంస్థల నెయ్యి శాంపిల్స్ 'నాణ్యమైన' నివేదికలు పంపారు. అంటే.. ట్యాంకర్‌లో ఉన్న నెయ్యి భోలేబాబా డెయిరీలో తయారు చేసిన కల్తీది. నివేదిక మాత్రం ఇతర కంపెనీల నాణ్యమైన నెయ్యి శాంపిల్‌ది. ఎన్ఏబీఎల్ (నేషనల్ ఎక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) రిపోర్టుల కోసం ఇతర డెయిరీల నుంచీ నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేసి దాన్ని శాంపిల్స్‌గా పంపించిన వైనం సిట్ దర్యాప్తులో వెలుగు చూసింది. ల్యాబ్ టెస్టింగ్ కోసం పొమిల్ జైన్ తదితర నిందితులు నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేసిన డెయిరీలలో హెరిటేజ్ సహా పలు ఇతర డెయిరీలు ఉండడం గమనార్హం. సిట్ దర్యాప్తులో భాగంగా వైష్ణవి తదితర డెయిరీలను తనిఖీ చేసిన సందర్భంలో ఇతర డెయిరీల నుంచీ నెయ్యి కొనుగోలు చేసిన రశీదులు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఆరా తీసిన సిట్ బృందానికి విస్తుపోయే వాస్తవాలు తెలిశాయి.

లోగుట్టు రట్టు

టీటీడీ నెయ్యి సరఫరా టెండరు నిబంధనల ప్రకారం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేసే డెయిరీ సంస్థలు ప్రతి ట్యాంకర్‌తో పాటు ఎన్ఏబీఎల్ ల్యాబ్ రిపోర్టు పంపించాలి. అయితే పొమిల్ జైన్ తదితరులు భోలేబాబా డెయిరీలోనే కల్తీ నెయ్యి తయారు చేసి దాన్నే వైష్ణవి, మాల్‌గంగా తదితర డెయిరీల ద్వారా టీటీడీకి సరఫరా చేశారు. ఆ క్రమంలో ప్రతి ట్యాంకర్‌కూ ఎన్ఏబీఎల్ ల్యాబ్ టెస్టింగ్ రిపోర్టు పంపాలి కాబట్టి శాంపిల్ నెయ్యి మాత్రం నాణ్యంగా ఉండేలా మాయ చేశారు. దానికోసం హెరిటేజ్, సంగం, హట్సన్, దొడ్ల వంటి డెయిరీల నుంచీ అర లీటరు, కిలో టిన్నుల్లో నెయ్యి కొనుగోలు చేస్తూ వచ్చారు. ఆ నెయ్యిని ఎన్ఏబీఎల్ ల్యాబ్‌కు పంపించారు. హెరిటేజ్, సంగం, హట్సన్, దొడ్ల డెయిరీల నెయ్యి నాణ్యమైనది కావడంతో నాణ్యతా ప్రమాణాల పరీక్షలో మంచి ఫలితాలు వచ్చేవి. నాణ్యమైన నెయ్యి అంటూ ఎన్ఏబీఎల్ ల్యాబ్ రిపోర్టులు ఇచ్చేది. ఆ రిపోర్టులను తమ కల్తీ నెయ్యితో కూడిన ట్యాంకర్ల వెంట పొమిల్‌జైన్ తదితరులు టీటీడీకి అందజేస్తూ వచ్చారు. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు వైష్ణవి డెయిరీని తనిఖీ చేసినపుడు వారికి హెరిటేజ్, సంగం, దొడ్ల, హట్సన్ తదితర డెయిరీల నుంచీ తక్కువ పరిమాణంలో నెయ్యి కొనుగోలు చేసిన రశీదులు లభించాయి.

నాణ్యమైన నెయ్యి ధరలు ఇలా..

పొమిల్ జైన్ తదితరులు ఎన్ఏబీఎల్ ల్యాబ్ రిపోర్టు కోసం ఇతర డెయిరీల నుంచీ కొనుగోలు చేసిన శాంపిల్ నెయ్యి ధరలు బహిరంగ మార్కెట్‌లో ఆయా డెయిరీల నాణ్యతను ప్రతిబింబిస్తున్నాయి. ఉదాహరణకు కిలో నెయ్యి హెరిటేజ్ నుంచి రూ.740తో, హట్సన్ నుంచి రూ.800, దొడ్ల నుంచి రూ.780 ధరతో కొన్నారు. సంగం నుంచీ సుమారు రూ.620 ధరతో కిలో నెయ్యి కొనుగోలు చేశారు. ఎన్ఏబీఎల్ ల్యాబ్ రిపోర్టుల కోసం ఇతర డెయిరీల నుంచీ ఇంత ధరతో నెయ్యి కొనుగోలు చేసిన పొమిల్ జైన్ తను మాత్రం వైష్ణవి డెయిరీ, మాల్ గంగా ద్వారా టీటీడీకి కిలో రూ.400 లోపు ధరతో 60 లక్షల కిలోలకు పైగా నెయ్యి సరఫరా చేయడం గమనార్హం.

ఇవిగో ఉదాహరణలు

సిట్ అధికారులకు లభ్యమైన పలు రశీదుల్లో పొమిల్ జైన్ తదితరులు పరీక్షలకు పంపేందుకు శాంపిల్స్ కోసం ప్రముఖ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేసిన వివరాలు మచ్చుకు కొన్ని..

- హెరిటేజ్ డెయిరీ నుంచి 2023 అక్టోబరు 31న రూ.1100 వెచ్చించి ఒకటిన్నర లీటరు నెయ్యి కొనుగోలు చేశారు. అదే ఏడాది నవంబరు 1న రూ.740 పెట్టి కిలో నెయ్యి కొన్నారు.
- హట్సన్ నుంచి 2023 అక్టోబరు 25న రూ.2,460 పెట్టి మూడు కిలోలు, డిసెంబరు 10న రూ. 9,600 వెచ్చించి 12కిలోల నెయ్యి కొన్నారు.
- 2023 జూన్ 12న దొడ్ల నుంచి రూ.780 పెట్టి కిలో నెయ్యి కొనుగోలు చేశారు.
- సంగం నుంచి 2023 జూన్ 27న రూ.310 ధరతో 500 మిల్లీలీటర్ల నెయ్యి బాటిళ్ళు రెండు కొన్నారు. దానికోసం రూ.620 చెల్లించారు.
- పొమిల్ జైన్ ద్వారా వైష్ణవి, మాల్‌గంగా తదితర డెయిరీల నుంచి టీటీడీకి సరఫరా అయిన ప్రతి ట్యాంకర్ వెనుకా ఈ 'శాంపిల్స్' కథే నడిచింది.

మద్యం కేసు నిందితుడు బాలాజీ యాదవ్ ఆస్తుల జప్తు

▸▸ కోర్టులో పిటిషన్ దాఖలుకు ప్రభుత్వ అనుమతి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ యాదవ్ (ఏ-35) స్థిర చరాస్తుల జప్తునకు రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. జప్తు కోసం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణాధికారి అయిన అదనపు ఎస్పీకి అనుమతి మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. బాలాజీ యాదవ్‌కు సంబంధించి తిరుపతి జిల్లా రేణిగుంట సబ్‌డివిజన్ సెట్టిపల్లి గ్రామ పంచాయతీలోని స్థలాలు.. తిరుపతి నగరం వైకుంఠపురం నివాసిత ప్రాంతాల్లోని ఇంటి స్థలం, రేణిగుంట మండలం తిమ్మాయగుంట, హరిజనవాడ, వెంకటాపురంలో ఇంటి స్థలాలు, తిరుపతి రూరల్ మండలం గాంధీపురం, ఉప్పరపల్లిరోడ్డు, తిరుమలనగర్ 6వ క్రాస్‌రోడ్డులో ఉన్న స్థలాలు.. ఈ మొత్తానికి కలిపి ప్రభుత్వం నిర్ణయించిన విలువ రూ.3.41 కోట్లు కాగా.. బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.5.16 కోట్లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపాన ఉపరితల ఆవర్తనం నెలకొంది. మధ్య భారతంలో నెలకొన్న శీతల వాతావరణం ప్రభావంతో ఉపరితల ఆవర్తనం దిశగా చలిగాలులు వీస్తున్నాయి. వీటన్నింటి ప్రభావంతో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత పెరిగింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా హుకుంపేటలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తాలో పలుచోట్ల ఉదయం పొగమంచు కురిసింది. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగి, రాత్రి ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని, పలుచోట్ల పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అనంతపురం కమిషనర్‌గా ఎం.జస్వంత్‌రావును, అక్కడ పనిచేస్తున్న బి.బాలస్వామిని విజయనగరానికి, పల్నాడు యూడీఏలో కార్యదర్శిగా ఉన్న జి.సాంబశివరావును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గాను, అక్కడ పనిచేస్తున్న టి.వెంకటకృష్ణయ్యను పల్నాడు యూడీఏకు సెక్రటరీగా నియమించారు. గుంతకల్ కమిషనర్ నయీం అహ్మద్‌ను ఆదోనికి, అక్కడ ఉన్న కృష్ణను సీఆర్‌డీఏకు బదిలీ చేశారు. ఏలూరు యూడీఏ కార్యదర్శిగా వెయిటింగ్‌లో ఉన్న పి.సింహాచలంను నియమించారు. ఒంగోలు యూడీఏలో కార్యదర్శిగా ఉన్న ఆర్.చండి దేవసేనను తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విజయవాడలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.శివరామ్‌ప్రసాద్‌ను వినుకొండ కమిషనర్‌గా, అక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.సుభాష్ చంద్రబోస్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని సూచించారు. కల్యాణదుర్గంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.నూర్ అలీఖాన్‌ను కమలాపురం నగరపంచాయతీ కమిషనర్‌గాను, అక్కడ పనిచేస్తున్న ప్రహ్లాద్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ వర్సిటీ

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఎనిమిది ప్రముఖ కంపెనీలతో మెమోరాండమ్ ఆఫ్ అసోషియేషన్ ఏర్పాటు కానుంది. ప్రతి కుటుంబంలోనూ ఏఐ శిక్షణ పొందేవారు ఒకరు ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో తొలిసారిగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంటూ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శుక్రవారం పేర్కొంటూ ఉత్తర్వు జారీ చేశారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు మంత్రివర్గ ఆమోదం తెలపాల్సి ఉంది.

90 వేల కోట్ల పెట్టుబడులకు ఆర్ఎంజడ్ సిద్ధం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఆర్ఎంజడ్ గ్రూప్ రాష్ట్రంలో రూ.90,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తూ లేఖ అందజేసింది. ఇటీవల ఆర్ఎంజడ్ సంస్థ విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. అనంతపురం జిల్లాలో ఎలక్ట్రానిక్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామంటూ ఆ లేఖలో స్పష్టం చేసింది. క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనలను అజెండాగా ఉంచాలని అధికారులు నిర్ణయించారు.



విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం సాయంత్రం రేసర్ల ప్రాక్టీస్

నేడు విశాఖలో బైక్ రేసింగ్ ఫైనల్

రాష్ట్రంలో తొలిసారి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖపట్నంలో మోటార్ బైక్ రేసింగ్ చాంపియన్‌షిప్ జరుగుతోంది. 'ఎంఆర్ఎఫ్ మోగ్రిప్ సూపర్‌క్రాస్ ఎఫ్ఎంఎస్‌సీఐ చాంపియన్‌షిప్-2025' పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఇప్పటివరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఐదు రౌండ్లు పూర్తయ్యాయి. విశాఖలో శనివారం ఫైనల్ రౌండ్ నిర్వహిస్తున్నారు. దీనికోసం వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ముస్తాబైంది. 130 మంది రేసర్లు ఇప్పటికే నగరానికి చేరుకుని శుక్రవారం ప్రాక్టీస్ చేశారు. ఇది అతిపెద్ద టు వీలర్ నేషనల్ రేసింగ్ చాంపియన్‌షిప్ అని ఆర్ఆర్ఆర్ మోటార్‌స్పోర్ట్ అసోసియేషన్ ఆర్కిటెక్ట్, శాప్ డైరక్టర్ రాజా మేడిది పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు పోటీలు మొదలవుతాయన్నారు.



హమ్మయ్య... పెద్దపులి చిక్కింది!

రాయవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఏడు రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా సంచరించిన పెద్దపులి ఎట్టకేలకు చిక్కింది. రాయవరం మండలం కూర్మాపురంలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన అటవీశాఖ అధికారులు పులికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. దీంతో ప్రజలతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం రాత్రి కేశవరం శివారు ప్రాంతంలో పులి సంచరిస్తోందని నిర్ధారణ అయింది. కానీ, ఎవరూ ఊహించని విధంగా పలు గ్రామాలు దాటుకుని 30 కిలోమీటర్లకు పైగా వెళ్లి రాయవరం మండలం కూర్మాపురంలో పెద్దపులి ప్రత్యక్షం కావడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం కూర్మాపురం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలోని పంట పొలాల్లో పురుగుల మందు స్ప్రే చేసేందుకు పలువురు కూలీలు వెళ్లారు. ఆ సమయంలో వారికి పొలాల్లో పులి అడుగులు కనిపించాయి. వాటిని పరిశీలిస్తుండగానే గ్రామానికి చెందిన రైతు పాలచర్ల రాజుకు చెందిన పాత పెంకుటింట్లోంచి పులి గాండ్రించడంతో అంతా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. తొలుత పెద్ద పులి జాడను డ్రోన్ కెమెరా ద్వారా నిర్ధారించుకున్నారు. మధ్యాహ్నం 1.50 గంటల సమయంలో పుణే నుంచి వచ్చిన రెస్క్యూ టీం, మత్తు మందు ఇచ్చే గన్ షూటర్లు పులిని షూట్ చేసేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఇంటి గేటుపై నుంచి ఎదురుగా ఉన్న పంటబోదెలోకి దూకేసింది. దీంతో పులిని చూసేందుకు గుమికూడిన ప్రజలతో పాటు అధికారులు ఒక్కసారిగా పరుగులు తీశారు. పంటపొలాల్లో నుంచి రెప్పపాటులో పారిపోయిన పులి గ్రామానికి చెందిన కొలగాని సత్తిబాబుకు చెందిన పశువుల పాకలో దూరింది. అప్పటికే లోపల రెండు గేదెలు ఉన్నాయి. వాటిని పులి చంపేసి ఉంటుందని భావించారు. కానీ, వాటిపై దాడి చేసి స్వల్ప గాయాలు మాత్రమే చేసింది. సాయంత్రం 6:30 గంటలకు పశువుల పాకనుంచి పెద్ద పులి మళ్లీ బయటకు వచ్చింది. అప్పటికే ఇద్దరు గన్ షూటర్లు మాటువేసి ఉన్నారు. వారిలో ఒకరు షూట్ చేయగా మిస్సయింది. మరొకరు షూట్ చేసిన మత్తు ఇంజెక్షన్ తగలడంతో అక్కడినుంచి కొంచెం దూరం పరిగెత్తింది. పంచాయతీ కార్యాలయం సమీపంలోని పాత కోళ్లఫాం వద్ద ఉన్న ఖాళీస్థలం నుంచి 50 మీటర్ల దూరం వరకు వెళ్లి మత్తుతో పడిపోయింది. దీంతో వల వేసిన అధికారులు పెద్దపులిని బోనులో బంధించి విశాఖలోని జూకు తరలించారు. పులిని బంధించిన పుణె బృందాన్ని, అధికారులను జనం అభినందించారు.





పెద్దపులికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు సిద్ధమైన పుణేకు చెందిన షూటర్, మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో కుప్పకూలిన పెద్దపులి

నెలవారీ సెటిల్‌మెంట్, బిల్లింగ్ తప్పనిసరి!

▸▸ డిస్కమ్‌లకు ఏపీఈఆర్సీ ఆదేశాలు

▸▸ సోలార్ రూఫ్‌టాప్ ప్రొస్యూమర్లకు ఊరట

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ ప్రొస్యూమర్లు (ఉత్పత్తి మరియు వినియోగదారులు) ఉత్పత్తి చేసి విద్యుత్తు యూనిట్ల సెటిల్‌మెంట్, వినియోగించిన విద్యుత్తు బిల్లింగ్‌ను నెలవారీగా అమలు చేయాలని ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి డిస్కమ్‌లను ఆదేశించింది. 2023లో అమల్లోకి వచ్చిన గ్రిడ్ ఇంటరాక్టివ్ సోలార్ రూఫ్‌టాప్ ఫొటోవోల్టాయిక్ సిస్టమ్ నిబంధనలు, 2025లో చేసిన మొదటి సవరణకు అనుగుణంగా ఈ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ప్రతినెలా విద్యుత్తు వినియోగం, మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు ఎగుమతి చేసిన యూనిట్ల లెక్కలను తీయాలని, గ్రిడ్‌కు అదనంగా పంపిన విద్యుత్తుకు సంబంధించిన చెల్లింపులను వినియోగదారులకు ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా చెల్లించాలని స్పష్టం చేసింది. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చిన ఈ నేపథ్యంలో ఈఆర్సీ... ఈ ఆదేశాలు జారీ చేసింది.

పాఠ్య పుస్తకాల్లో మార్పులు..!

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో 6 నుంచి 8 తరగతుల పాఠ్యపుస్తకాలు మారతాయని, ఆ తర్వాతి విద్యా సంవత్సరంలో 9, 10 తరగతుల పుస్తకాలు మారతాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం కరిక్యులమ్ మారుతూ ఉంటుందని, అందుకు అనుగుణంగా జూన్ నెలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు మార్చి 9న పూర్తవుతాయని, ఆ వెంటనే 10వ తరగతి పాఠ్యాంశాలు బోధించాలన్నారు. మూడో తరగతి విద్యార్థుల ప్రగతిపై 11 నుంచి 13 వరకు సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయ సంఘాలు, సబ్జెక్టు ఫోరమ్‌లు దృష్టి పెట్టాలని సూచించారు. గతేడాది జరిగినట్లుగా ఈ ఏడాది కూడా బదిలీలు ఉంటాయని తెలిపారు. జిల్లాల ప్రాతిపదికపై సాధారణ పరిపాలన శాఖ ఇచ్చే ఉత్తర్వులకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందన్నారు.

మైనింగ్ సర్వేయర్ ఆస్తులు కోట్లలో..!

▸▸ ఒంగోలు భూగర్భ గనుల శాఖలో ఏసీబీ సోదాలు

▸▸ పెద్ద మొత్తంలో ఆస్తి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం





విజయవాడలోని ఇంట్లో లభ్యమైన నగలు, ఆస్తుల పత్రాలతో సర్వేయర్ అబ్దుల్ ఆసిఫ్, ఒంగోలులో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు భూగర్భ గనుల శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శాఖలో పనిచేస్తున్న సర్వేయర్ షేక్ అబ్దుల్ ఆసిఫ్‌కు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈమేరకు నెల్లూరు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆసిఫ్‌పై కేసు నమోదు చేశారు. దీంతో శుక్రవారం ఆసిఫ్‌కు సంబంధించి విజయవాడ, గుంటూరు, సొంతూరు మార్కాపురం, అత్తగారి ఇల్లు కనిగిరితోపాటు ఆయన పనిచేస్తున్న ఒంగోలు మైనింగ్ కార్యాలయంలో రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ నేతృత్వంలో ఈ తనిఖీలు చేశారు. గతంలో ఆసిఫ్ నెల్లూరు మైనింగ్ కార్యాలయంలో పని చేశారు. అప్పట్లో జరిపిన లావాదేవీలు, ఆయన సంపాదించిన అక్రమ ఆస్తుల వివరాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏసీబీ ప్రత్యేక బృందం ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఆశ్రమం వద్ద ఉన్న మైనింగ్ కార్యాలయంపై ఆకస్మికంగా దాడిచేసి ఆసిఫ్‌ను అదుపులోకి తీసుకుంది. అక్కడి నుంచి విజయవాడలోని ఇంటికి తీసుకెళ్లి సోదాలు జరిపారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున బంగారం, వెండి, విలువైన ఆస్తి పత్రాలు లభించినట్లు సమాచారం. వాటి విలువ కోట్లల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలు మైనింగ్ కార్యాలయానికి ఏడాదిన్నర క్రితం ఆసిఫ్ నెల్లూరు నుంచి బదిలీపై వచ్చారు. అప్పటినుంచి జరిగిన లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒంగోలులో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు అబ్దుల్ ఆసిఫ్‌ను అరెస్టు చేశారు.

సోదాలలో బయటపడిన ఆస్తులు ఇవే...!

మార్కాపురానికి చెందిన ఆసిఫ్ 2013లో సర్వేయర్‌గా చేరారు. ఆయన ప్రకాశం, కడప, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో పనిచేశారు. శుక్రవారం జరిగిన సోదాలలో అతనికి సంబంధించి లభ్యమైన డాక్యుమెంట్ల ప్రకారం.. రెండు ఇళ్లు, ఒక ఇంటిస్థలం, 22 ఎకరాల పొలం, 620 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, రూ.2,82,264 నగదు, రూ.3,54,000 ప్రామిసరీ నోటు, 16 చేతి గడియారాలు, బైక్, విలువైన గృహోపకరణాలు, హెచ్‌డీఎఫ్‌సీలో రూ.15లక్షల పాలసీ, టయోటో హైరైడర్ కారు కొనేందుకు రూ.20వేల అడ్వాన్స్ ఇచ్చినట్లు ఉన్న రసీదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా బ్యాంకు లాకర్ ఉన్నట్లు గుర్తించారు. దానిని చట్టప్రకారం ఓపెన్ చేయాల్సి ఉంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.*